వెలుగుల వెనుక
కథలు
రూ॥160/- పేజీలు:160

నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

ఎల్‌నినోపై సమగ్ర కార్యాచరణ ప్రణాళిక 03

హౌతీల దాడులు 08
రెండు సౌదీ చమురు ట్యాంకర్లు దగ్ధం

సంపుటి 09, సంచిక: 234 | శుక్రవారం | 24-07-2026 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## లీకేజీ దోషులపై ప్రత్యేక కోర్టుల్లో విచారణ



పార్లమెంటు సమావేశంలో ఉన్నప్పటికీ ప్రధాని నరేంద్రమోదీ 'ఎక్స్' ద్వారా ఇలా ట్వీట్ చేశారు: 'మన యువత సంక్షేమం, భవిష్యత్ కన్నా ముఖ్యమైనది మరొకటి లేదు. ప్రశ్నపత్రాల లీకేజీతో సంబంధమున్న వారిని సత్వరంగా విచారించి, కఠిన శిక్ష విధించేందుకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని మేము నిర్ణయించాం. ఈ విషయంలో అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను నేను ఆదేశించాను.'

## మీరే బాధ్యులు



ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ 'ఎక్స్' ద్వారా ఇచ్చిన జవాబు :'మన యువత భవిష్యత్‌కు ఎంతో చేటుచేసిన వ్యక్తి మీరు. మన విద్యావ్యవస్థను మొత్తంగా స్వాధీనం చేసుకోవటం, నాశనం చేయటాన్ని మీరు అనుమతించారు, ప్రోత్సహించారు. అందుకు బాధ్యులైన ప్రతి ఒక్కరిని కాపాడారు' అంటూ విద్యార్థుల కోర్కెలు పునరుద్ఘాటించారు.

1. ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయండి.
2. విద్యార్థులకు క్షమాపణ చెప్పండి.
3.వారిపై దాడిచేసిన వారిపై చర్య తీసుకోండి.

సిజెపి కూడా ప్రధాని పోస్ట్‌కు తీవ్రంగా స్పందిస్తూ,
'ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసి తీరాలి' అని డిమాండ్ చేసింది.

# బెట్టు వీడని ప్రభుత్వం మెట్టుదిగని ప్రతిపక్షం

పార్లమెంటులో 4వ రోజూ ప్రతిష్టంభనే

- ఉభయసభలు పలుమార్లు వాయిదా
- లోక్‌సభలో వెల్‌లోకి దూసుకెళ్లి నిరసన తెలిపిన ప్రతిపక్ష ఎంపిలు
- గాంధీ స్మృతిభవన్ వద్ద ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు నివాళి అర్పించిన ఇండియా కూటమి ఎంపిలు



నీట్ పేపర్ లీక్ కారణంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు గాంధీ స్మృతి భవన్ వద్ద నివాళి అర్పించిన ఇండియా కూటమి ఎంపిలు

**న్యూఢిల్లీ :** ప్రశ్నపత్రాల లీకేజీని అరికట్టలేని అసమర్థుడు, విద్యార్థి లోకాన్ని సంక్షోభంలోకి నెట్టి, ప్రధాని చాటున దాక్కున్న విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్‌పై ఇటు జంతర్‌మంతర్‌లో సిజెపి, పార్లమెంటులో ప్రతిపక్ష ఆందోళన నాలుగవ రోజూ ఉధృతమైంది. నరేంద్రమోదీ ప్రభుత్వం బెట్టువీడలేదు. అయితే ప్రధానమంత్రి పార్లమెంటు జరుగుతున్నా, అటు వెళ్లకుండా, సామాజిక మాధ్యం 'ఎక్స్' ద్వారా, విద్యార్థులను బుజ్జగించే ప్రయత్నంగా, నీటి ప్రశ్నాపత్రం లీకేజీ దోషులను సత్వరం విచారించి కఠిన శిక్ష విధించేందుకు ప్రత్యేక కోర్టుల ఏర్పాటును ప్రకటించారు. అయితే మంత్రి ప్రధాన్ రాజీనామా, విద్యార్థులపై పాశవికంగా దాడిచేసిన నేరస్థులపై చర్యలు డిమాండ్ నుంచి సిజెపి, ప్రతిపక్షం వెనక్కు తగ్గలేదు. ఇదిలా వుండగా, విద్యార్థులకు న్యాయం జరగాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి పార్టీల ఎంపిలు గాంధీ స్మృతిభవన్‌కు బయలుదేరగా పోలీసులు అటకాయించారు. అయనప్పటికీ భారీ కేడ్లను దాటుకుని ఇండియా కూటమి ఎంపిలు గాంధీ స్మృతిభవన్‌కు చేరుకున్నారు. కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. నీట్ పేపర్ లీక్ కారణంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు నివాళులు అర్పించారు. విద్యార్థులు ఒంటరి వారు కారని వారికి మేము అండగా ఉన్నామని ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ భరోసా ఇచ్చారు. కాగా గురువారం పార్లమెంట్ ఉభయసభల్లో పలుమార్లు సభలు వాయిదా పడ్డాయి. ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించకుండానే చివరకు స్పీకర్, రాజ్యసభ చైర్మన్ మరుసటి రోజుకు సభలను వాయిదా వేశారు. లోక్‌సభ ఉదయం ప్రారంభమైన తరువాత భోజన విరామ సమయానికి రెండుసార్లు వాయిదా పడింది. ఆ తరువాత మధ్యాహ్నం 2 గంటలకు సభ తిరిగి సమావేశమైనప్పుడు, ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేయడం ప్రారంభించారు. సభకు అధ్యక్షత వహిస్తున్న దిలీప్ సైకియా, నిరసన తెలుపుతున్న సభ్యులను సభ గౌరవాన్ని కాపాడాలని కోరారు. కార్యకలాపాలకు అంతరాయం కలిగించడం సరికాదని అన్నారు. నీట్ పేపర్ లీక్ అంశంపై చర్చకు సంబంధించి ముందస్తు షరతులు విధిస్తూ, ప్రతిపక్షాలు చర్చ నుండి పారిపోవడానికి ప్రయత్నిస్తున్నాయని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. ప్రధాన్ రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు పట్టుబట్టగా, చర్చ సమయంలో ప్రభుత్వం కూడా ఈ విషయంపై తన వాదనను వినిపించాలనుకుంటోందని రిజిజు లోక్‌సభకు తెలిపారు. ప్రతిపక్ష సభ్యులు తమకు నచ్చినంత సేపు మాట్లాడవచ్చని, చర్చ రెండు రోజుల

తరువాయి 8లో



## పోలీసుల అరాచకాలకు వ్యతిరేకంగా 'నేడు' దేశవ్యాప్త నిరసనలు

- కాక్రోచ్ జనతా పార్టీ పిలుపు
- జంతర్ మంతర్ లేదా కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో చర్చకు సిద్ధం
- కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదనపై సిజెపి స్పందన

**న్యూఢిల్లీ :** 'చలో సంసద్' సందర్భంగా విద్యార్థులపై పోలీసుల దాష్టీకానికి నిరసనగా జూలై 24న దేశవ్యాప్త నిరసనలకు కాక్రోచ్ జనతా పార్టీ పిలుపునిచ్చింది. ఇదొకటే డిమాండ్‌పై ప్రతి జిల్లాలో కూడా శాంతియుత నిరసనను చేయాలని విజ్ఞప్తి చేసింది. పోలీసుల దాష్టీకంలో బాధితులకు భారతదేశమంతా సంఘీభావంగా నిలబడాలని విజ్ఞప్తిచేసింది. ఇందుకు అవసరమైన అనుమతులు, ఏర్పాట్ల కోసం విద్యార్థి సంఘాలు, ఇతర సంస్థలు సమన్వయం చేసుకోవాలని సూచించింది. నిరసన కార్యక్రమంలో అందరి సమక్షంలో విద్యార్థుల డిమాండ్‌లను చదివి వినిపించాలని, విద్యార్థులకు సంఘీభావాన్ని బలంగా ప్రకటించాలని కోరింది. మరోవైపు జంతర్‌మంతర్ లేదా కాన్‌స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో చర్చించేందుకు సిద్ధంగా ఉన్నట్లు కాక్రోచ్ జనతా పార్టీ ప్రకటించింది. కేంద్ర మంత్రి జితేందర్ సింగ్ చేసిన ప్రతిపాదనపై సిజెపి ప్రధాన అధికార ప్రతినిధి సౌరభ్ దాస్ స్పందించారు. 'ఎక్కడైనా చర్చలు జరపవచ్చని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ చెప్పారు. మేము మా ప్రతిపాదనను ఇప్పటికే

తరువాయి 8లో






## పోటాపోటీ ఆందోళనలు

- పార్లమెంట్ ఆవరణలో ఒకరికొకరు వ్యతిరేకంగా నినదించిన ప్రతిపక్ష, అధికారపక్ష ఎంపిలు
- మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను డిమాండ్ చేస్తూ పెద్ద బ్యానర్‌తో విపక్ష సభ్యులు భారీ ప్రదర్శన

**న్యూఢిల్లీ :** పార్లమెంట్ ఆవరణలో గురువారం ఉదయం కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణ కనిపించింది. ప్రతిపక్ష, అధికార పార్టీ ఎంపిలు పోటాపోటీగా నిరసనలు తెలిపారు. ఇరు వర్గాలకు చెందిన పెద్ద సంఖ్యలో ఎంపిలు పార్లమెంటు మకర ద్వారం బయట నిలబడి అవతలి పక్షానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రతిపక్ష ఇండియా కూటమి ఎంపిలు విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేయగా, పేపర్ లీక్ అంశాన్ని రాజకీయం చేస్తున్నారని ప్రతిపక్షానికి వ్యతిరేకంగా అధికార పార్టీ

తరువాయి 8లో

## రాజ్యాంగ పీఠిక పఠనం



విద్యార్థుల నిరసనకు 'మద్దతు' తెలిపిన 'సుప్రీం' న్యాయవాదులు

**న్యూఢిల్లీ :** జంతర్ మంతర్ వద్ద నిరసనకారులపై పోలీసుల చర్యలను వ్యతిరేకిస్తూ గురువారం సుప్రీంకోర్టు న్యాయవాదులు నిరసనకారులకు మద్దతుగా రాజ్యాంగ పీఠికను పఠించారు. న్యాయవాదులు 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి', 'రాజ్యాంగాన్ని రక్షించండి' అనే ప్రచారంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సుప్రీంకోర్టులో భోజన విరామ సమయంలో సీనియర్ అడ్వకేట్స్ ఇందిరా జైసింగ్, ఎస్. మురళీధర్ న్యాయవాదుల రాజ్యాంగ పీఠిక పఠనానికి నాయకత్వం వహించారు. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విలేకరులతో జైసింగ్ మాట్లాడుతూ, తాము విద్యార్థులకు అండగా

తరువాయి 8లో

## హైడ్రాపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం

- వివాదాస్పద భూమి రక్షణకు ఆర్మీ ఏర్పాటు చేయగలమని స్పష్టీకరణ
- ఏజీ హామీతో సైన్యం మోహరింపు ఉత్తర్వుల జారీ నిలిపివేత

ప్రజాపక్షం/హైదరాబాద్

కోర్టు ఉత్తర్వులను పదేపదే ఉల్లంఘిస్తూ వివాదాస్పద ప్రైవేటు భూమిలో హైడ్రా అధికారులు జోక్యం చేసుకుంటున్నారన్న ఆరోపణలపై హైకోర్టు గురువారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా లోతుకుంట గ్రామంలోని సర్వే నంబర్లు 1, 2లోని 40 ఎకరాల భూమికి సంబంధించిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై విచారణ సందర్భంగా జస్టిస్ అనిల్‌కుమార్ జుకంటి దేశంలోనే తొలిసారిగా ఒక ప్రైవేటు ఆస్తి రక్షణ కోసం సైన్యాన్ని మోహరించే దిశగా అసాధారణ ఆదేశాలు జారీ చేశారు. బైసన్ డివిజన్‌కు చెందిన సీనియర్ బ్రిగేడియర్‌ను సంప్రదించి పది మంది సైనికుల జాబితా సిద్ధం చేయాలని హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌ను ఆదేశించారు. వివాదాస్పద స్థలం వద్ద ఆర్మీ

తరువాయి 8లో




## విద్యార్థులపై లాఠీ ఛార్జీని ఖండిస్తూ సిపిఐ నిరసన ప్రదర్శన

హైదరాబాద్‌లోని లిబర్టీ చౌరస్తా నుండి ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ

ప్రజాపక్ష/హైదరాబాద్

నీట్ పరీక్ష పేపర్ లీకేజ్ ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీఛార్జ్‌ను ఖండిస్తూ గురువారం హైదరాబాద్‌లో సిపిఐ శ్రేణులు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించాయి. సిపిఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో లిబర్టీ చౌరస్తా నుండి ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వరకు జరిగిన ఈ ర్యాలీలో కమ్యూనిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాసంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీకి బాధ్యత వహించి మంత్రి ధర్మంధ్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, విద్యార్థుల ప్రయోజనాలను కాపాడాలని, ప్రజావ్యతిరేక విధానాలు అనుసరిస్తున్నా ప్రధాని మోదీ రాజీనామా చేయాలని వారు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ప్రదర్శనకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె.నారాయణ, జాతీయ కార్యవర్గ స భ్యురాలు పశ్య పద్మ, రాష్ట్ర సహాయ కార్యదర్శులు ఇటి.నరసింహ, తక్కళ్లపల్లి శ్రీనివాస రావు, కార్యదర్శివర్గ సభ్యులు కలవేణ శంకర్, బాగం హేమంత్ రావు, వి.ఎస్.బోస్, కార్యవర్గ సభ్యులు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం,

తరువాయి 12లో

## ధర్మేంద్ర రాజీనామాపై బిఆర్‌ఎస్ నోరుమెదపదేం?

- కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని ఎందుకు డిమాండ్ చేయడం లేదు
- బిఆర్‌ఎస్, బిజెపి కుమ్మక్కైనట్లు అర్థమవుతుంది
- గ్లోబరీనా సంస్థ విషయంలో కెటిఆర్ నిజాయితీ నిరూపించుకోవాలి
- మీడియా చిట్ చాట్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

నీట్ ప్రశ్నాపత్రం లీకేజీపై కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సిఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీకి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థులు ఉద్యమిస్తున్నారని, వారు కూడా కేంద్ర మంత్రి రాజీనామాను డిమాండ్ చేస్తున్నారని, కేంద్ర మంత్రి ధర్మేంధ్ర ప్రధాన్ రాజీనామా చేయాలని బిఆర్‌ఎస్ ఎందుకు డిమాండ్ చేయడంలేదని సిఎం ప్రశ్నించారు. ఈ విషయాలను పరిశీలిస్తే బిజెపి, బిఆర్‌ఎస్ రెండూ కుమ్మక్కయ్యాయని అర్థం అవుతుందని ఆయన వ్యాఖ్యానించారు. గ్లోబరీనా సంస్థ బిఆర్‌ఎస్ నేత కెటిఆర్ బినామీ సంస్థ అని, గ్లోబరీనా సంస్థ విషయంలో కెటిఆర్ తన నిజాయితీని నిరూపించుకోవాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. గతంలో ఇంటర్మీడియట్ పరీక్ష జవాబు పత్రాలు దిద్దే కాంట్రాక్టు గ్లోబరీనా సంస్థకు ఇస్తే దానిలో జరిగిన తప్పులకు 27 మంది ఇంటర్మీడియట్ పిల్లలు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఇందుకు కెటిఆర్ క్షమాపణ చెప్పాలన్నారు. కెసిఆర్

తరువాయి 8లో



03

బిజెపి ప్రజా వ్యతిరేక పాలనను నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో 'సెప్టెంబర్ 1నచలో ఢిల్లీ' పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

హనుమకొండలో..



నిజామాబాద్‌లో..



12

ఫీజు రీయింబర్స్‌మెంటు, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద ఎఐఎస్‌ఎఫ్ ధర్నా, ర్యాలీలు

02
ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
శుక్రవారం
24-07-2026
www.prajapaksham.in


# ప్రధాని నేరుగా స్పందించరా?

నెల రోజులపైబడి పార్లమెంటు ముంగిట జరుగుతున్న విద్యార్థుల ఆందోళనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేటి వరకు ప్రత్యక్షంగా స్పందించకపోవడం విచిత్రం. మన యువత సంక్షేమం, భవిష్యత్తు కంటే ముఖ్యమైనది మరొకటి లేదంటూ ఆయన గురువారం తన 'ఎక్స్' ఖాతా ద్వారానే ప్రకటన చేశారే తప్ప కనీసం వీడియో సందేశమివ్వలేదు. ఆ ప్రకటనలో 'సంసద్ మార్చ్' సందర్భంగా లాఠీల కరాళ నృత్యంలో గాయపడిన యువత పట్ల కనీస సానుభూతి వ్యక్తం చేసినా బాగుండేది. అప్పుడైనా ప్రధాని తమ గురించి ఆలోచిస్తున్నారనే సంకేతం యువతకు వెళ్ళేది. కానీ, పుండుమీద కారం పోసినట్లుగా ప్రశ్నపత్రాల లీకేజీకి పాల్పడిన వారికి త్వరితగతిన కఠిన శిక్షలు పడేలా చూసేందుకు 'ఫాస్ట్ ట్రాక్ కోర్టు'లను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని పసలేని వ్యాఖ్యలు ప్రధాని ప్రకటనలో ఉన్నాయి. మరి ఇంత కాలమేమి చేశారు? తాము ఉద్యమిస్తే తప్ప కఠిన నిర్ణయాలు తీసుకోరా? అని యువత ప్రశ్నిస్తోంది. నిజానికి ఆ దశ దాటిపోయింది. యువత కోరుకుంటున్నది 21 మంది విద్యార్థుల ఆత్మహత్యలకు దారి తీసిన నీట్ పేపర్ లీకేజీకి జవాబుదారీతనం వహించి కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు ఒక్క అంగుళం కూడా తక్కువ కాదు.

అంతకుముందు కూడా ఒకసారి నీట్ పేపర్ లీకేజీ గురించి ప్రధాని స్పందించారు. 'సంసద్ మార్చ్' మరుసటి రోజు 'మంగళ్ మిలన్' పేరిట జరిగిన ఎన్‌డిఎ ఎంపిల సమావేశంలో మోదీ ప్రసంగించినప్పుడు ఈ అంశాన్ని ప్రస్తావించినట్లు కేంద్ర పార్లమెంటరీ శాఖ మంత్రి కిరణ్ రిజిజు మీడియాకు చెప్పారు. నీట్ పేపర్ లీకేజీలను అడ్డుకోవడం 'జాతీయ బాధ్యత' అంటూ కేంద్రం బాధ్యతను అవలీలగా రాష్ట్రాలపై కూడా నెట్టేశారు ప్రధాని. సమాఖ్య స్ఫూర్తికి తూట్లు పొడుస్తూ, రాష్ట్రాల నుంచి లాగేసుకున్న అనేక అంశాలు, అధికారాల్లో 'నీట్' కూడా ఒకటి. గతంలో ఆయా రాష్ట్రాలలోని వైద్య విద్య ప్రవేశాలకు సంబంధించిన పరీక్షలు ఆ రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసే కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ కన్వీనర్ ఆధ్వర్యంలోనే జరిగేవి. కానీ, 'ఒక దేశం–ఒక పరీక్ష', ప్రతిభకే పట్టం అంటూ 2012లో జాతీయ స్థాయి ఉమ్మడి ప్రవేశపరీక్ష ప్రతిపాదన వచ్చి, 2016 నుంచి వైద్య విద్య ప్రవేశానికి నీట్‌ను నిర్వహించటం ప్రారంభమైంది. నాటి నుంచి కోచింగ్ సెంటర్‌ల మాఫియా తన రెక్కలను విస్తరించి, లీకేజీలకు పాల్పడడం కళ్ళకు కనపడుతూనే ఉంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో జరిగే నీట్ పరీక్షకు బాధ్యత వహించాల్సింది సహజంగా దానిని నియమించిన కేంద్ర ప్రభుత్వమే కదా.

పేపర్ లీకేజీలపై ప్రధాని స్పందించిన రెండు సందర్భాలు కూడా ప్రత్యక్షంగా కాకుండా పరోక్ష ప్రస్తావనలే. జూన్ 6 నుంచి సిజెపి పిలుపుపై జంతర్‌మంతర్‌లో విద్యార్థుల నిరసన, పాతిక రోజులకుపైగా సామాజిక ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ నిరశన సాగుతున్నది. పార్లమెంటు సమావేశాలు ప్రారంభమై నాలుగు రోజులవుతోంది. చలో పార్లమెంటుకు పదుల వేల సంఖ్యలో దేశ నలుమూలల నుంచి యువత పెద్ద ఎత్తున ఢిల్లీకి చేరుకున్నారు. ప్రతిపక్షాలు మొదటి నుంచే ప్రభుత్వ స్పందనను కోరుతున్నాయి. ఇంతకంటే గంభీరమైన సమస్య దేశం ముందు ఇప్పుడేమున్నది? అయినప్పటికీ ప్రధాని అటు లోక్‌సభ, ఇటు రాజ్యసభకు హాజరు కాకపోయినా పార్లమెంటులో మాట్లాడినట్లుగా ప్రజలకు భ్రమ కలిగిస్తున్నారు. అదెలాగంటే, ప్రతీసారి పార్లమెంటు తొలిరోజున సభ ప్రారంభమయ్యేముందు, ప్రవేశద్వారం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక నుంచి ప్రధాని నాలుగైదు నిమిషాలు వర్తమాన అంశాలపై మీడియా ఎదుట ప్రస్తావించి, లోపలికి వెళ్ళిపోతారు. అదే విషయాన్ని ప్రధాని పార్లమెంటు భవన ప్రాంగణంలో మాట్లాడారని మీడియా ప్రసారం చేయడం ద్వారా సభలోపల మాట్లాడినట్లుగా ప్రజలు భావిస్తారు. ఆ తరువాత ఒకరోజు పార్లమెంటు భవన ప్రాంగణంలోని హాల్‌లోనే ఎన్‌డిఎ ఎంపిలతో ప్రత్యేక సమావేశంలో ప్రధాని మాట్లాడడం ఆనవాయితీ. దానికి మీడియాను అనుమతించరు. ఆ విషయాలను ఎవరో ఒక కేంద్ర మంత్రి మీడియాకు వెల్లడిస్తారు. అది కూడా ప్రజలు తెలియక పార్లమెంటులోనే మాట్లాడతారని భావించడం కద్దు.

మొత్తం సమావేశాల్లో ఒకటో, రెండో సందర్భాలలోనే ప్రధాని పార్లమెంటు ఎగువ, దిగువ సభలకు వెళ్ళి చర్చకు సమాధానమిస్తారు. ఈసారి కూడా తొలిరోజున యువత ఆందోళనను పక్కనబెట్టి, ప్రధాని నరేంద్ర మోదీ ఒకవైపు, పార్లమెంటు సభ్యులు గౌరవప్రదంగా చర్చల్లో పాల్గొంటూ నిర్మాణాత్మక చర్చలకు సహకరించాలని కోరుతూనే, మరో వైపు, 56 ఏళ్ళ యువకుడి గురించి తాను మాట్లాడడం లేదని పరోక్షంగా ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీని ఉద్దేశించి ప్రధాని ఎద్దేవా చేశారు. ఈ చర్య ప్రతిపక్షాలను రెచ్చగొట్టడటమే అవుతుందని ఇట్టే అర్థమవుతోంది. అయినప్పటికీ, ప్రతిపక్షాలు సంయమనంతో పార్లమెంటులో తొలిరోజు విద్యార్థులపై దమనకాండ మీద చర్చకు డిమాండ్ చేశాయి. ఏ నిబంధన కిందైనా, ఎన్ని గంటలైనా చర్చకు సిద్ధమేనని సభలో సన్నాయి నొక్కులు నొక్కిన కేంద్ర మంత్రులు.. సభా కార్యక్రమాలన్నీ రద్దు చేసి, తామిచ్చిన వాయిదా తీర్మానాన్ని ఆమోదించి తక్షణమే చర్చించాలన్న ప్రతిపక్షం డిమాండ్‌ను మాత్రం త్రోసిపుచ్చారు. మార్గాంతరం లేక ప్రధాన ప్రతిపక్ష నేతలైన ఖర్గే, రాహుల్ గాంధీ తదితరులు మంత్రి ప్రధాన్ రాజీనామా డిమాండ్ చేస్తూ ప్రధాని ఇంటి వద్ద మెరుపు ధర్నాచేసి విద్యార్థుల ఆందోళనను, ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని బలంగా దేశ ప్రజల దృష్టికి తెచ్చారు. దేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన ప్రధానమంత్రులు జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీల తరువాత తనకు అంతటి బ్రాండ్‌ను సృష్టించుకున్న ప్రధాని మోదీ, నెహ్రూకన్నా ఎక్కువకాలం తాను పదవిలో ఉన్నట్లు ఒక అపోహను సృష్టించుకుని సంబరపడుతున్న మోదీ, నిత్యం నెహ్రూను దూషించే మోదీ ఆయన నుంచి ప్రజాస్వామ్య స్ఫూర్తిని పొంది ఉంటే దేశానికి మేలు జరిగేది. ఆయన ఇప్పటికైనా భేషజం వీడి ప్రత్యక్షంగా పార్లమెంటులోనూ, అలాగే ఉద్యమిస్తోన్న యువత ప్రతినిధులతోనూ మాట్లాడడం ప్రజాస్వామ్యానికి శోభనిస్తోంది.

సిజెపి నాయకులు ప్రభుత్వంతో చర్చలకు సుముఖంగా ఉన్నారు. అయితే తమ ఆందోళన శిబిరం వద్దకు రావటం మంత్రులకు ఇబ్బందిగా ఉంటే తటస్థ ప్రదేశంలో చర్చలకు సంసిద్ధత తెలియజేశారు. కేంద్రమంత్రి జెపి నడ్డా కార్యాలయంలోనో, ఇంటివద్దనో చర్చలను ప్రభుత్వం ప్రతిపాదించటం అహం తప్ప మరేమీ లేదు. మెట్టు దిగటానికి మొహమాటమెందుకు?



## యువతులపై బలప్రయోగం అత్యంత బాధాకరం

**దేశంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన విద్యార్థులు న్యూఢిల్లీ వీధుల్లో రోజుల తరబడి ఒకచోట ఉండటం బాధాకరం. పరీక్షా విధానం పట్ల వారికి ఉన్న ఆందోళనలు వాస్తవమైనవి. వాటిని సానుభూతితో, శాశ్వత పరిష్కారాన్ని కనుగొనాలనే చిత్తశుద్ధితో పరిష్కరించాలి. దీనిని కేవలం బలప్రయోగంతో పరిష్కరించాల్సిన శాంతిభద్రతల సమస్యగా మాత్రమే పరిగణించబోరని నేను బలంగా ఆశిస్తున్నాను. మహిళలు,యువతులపై దారుణంగా బలప్రయోగం చేయడం అత్యంత ఆవేదన కలిగించింది. ఈ విధమైన బలప్రయోగం.. 'వికసిత్ భారత్' అనే జాతీయ లక్ష్యం నుండి భారత సమాజంలోని అనేక వర్గాలను దూరం చేస్తుంది.**

–మురళీ మనోహర్ జోషి, కేంద్రవిద్యాశాఖ మాజీమంత్రి, బిజెపి మాజీ అధ్యక్షుడు



# విద్యకు బొట్టు పెట్టాలా?

కేంద్రమంత్రి బండి సంజయ్ ఇటీవల చేసిన వ్యాఖ్య రాజకీయ చర్చకు దారితీసింది. భవిష్యత్తులో తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పాఠశాలల్లో చదివే అమ్మాయిలకు బొట్టు, గాజులు తప్పనిసరి చేస్తామని ఆయన చెప్పినట్లు వార్తలు వచ్చాయి. సహజంగానే దీనిపై అనుకూల, ప్రతికూల స్పందనలు వచ్చాయి. కానీ ఈ చర్చను కేవలం బొట్టు అనుకూలం, వ్యతిరేకం అనే స్థాయిలో అర్థం చేసుకోవడం సరిపోదు. ఎందుకంటే ఇక్కడ అసలు ప్రశ్న బొట్టు గురించి కాదు. విద్యా వ్యవస్థపై దేశవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తం అవుతున్న ఈ సమయంలో ఒక రాజకీయ దృక్పథానికి ముందుగా బొట్టు ఎందుకు గుర్తుకు వచ్చింది అనేది. పదాలు యాదృచ్ఛికంగా బయటపడవచ్చు. కానీ ప్రతీకలు యాదృచ్ఛికంగా పుట్టవు. ఎందుకంటే అవి మాటలకంటే లోతుగా పనిచేసే ఒక భావజాలపు మానసిక వేలిముద్రలు.. ఈ వ్యాఖ్యలను కేవలం బండి సంజయ్ వ్యక్తిగత అభిప్రాయంగా చూడలేం. తెలంగాణ రాజకీయాల ప్రస్తుత నేపథ్యంలో ఈ వ్యాఖ్యకు మరో అర్థం కూడా కనిపిస్తుంది. జిహెచ్‌ఎంసి ఎన్నికల వాతావరణం, సామాజిక సమీకరణల కోసం జరగబోయే పోటీ, సాంస్కృతిక గుర్తింపుల చుట్టూ రాజకీయ చర్చలను నిర్మించే ప్రయత్నాలు, ఇవన్నీ ఈ వ్యాఖ్యను ఒక రాజకీయ సంకేతంగా చదవాలని సూచిస్తున్నాయి. ఎందుకంటే రాజకీయాలు కేవలం అధికారాన్నీ గెలుచుకోవడానికి మాత్రమే పోరాడవు. ఒక సామూహిక రాజకీయ ప్రతీకాత్మను నిర్మించడానికి కూడా పోరాడుతాయి. ప్రతి రాజకీయ భావజాలం తన అనుచరులను ఒక నిర్దిష్ట గుర్తింపు చుట్టూ సమీకరిస్తుంది. అందుకే ఆ రాజకీయ సమీకరణకు కొన్ని ప్రతీకలు అవసరం అవుతాయి. రాజకీయ మనోవిజ్ఞాన శాస్త్రం ఒక ఆసక్తికరమైన విషయాన్ని చెబుతుంది. సమస్యలు మనుషులను ఆలోచింపజేస్తాయి. ప్రతీకలు ప్రజలను సమీకరిస్తాయి.

పాఠశాల అనేది కేవలం విద్యాసంస్థ కాదు. సమాజం తన భవిష్యత్తును నిలువ చేసే మానసిక గిడ్డంగి. నేటి పిల్లల మనసుల్లో నాటిన ఊహలే రేపటి రాజకీయ, సాంస్కృతిగా, సామాజిక విలువలుగా, పౌర చైతన్యంగా రూపాంతరం చెందుతాయి. అందువల్ల విద్య గురించి జరిగే ప్రతి చర్చ వాస్తవానికి భవిష్యత్తు గురించి జరిగే చర్చే. ఇక్కడే విద్యపై రెండు తత్వాలు ఎదురుగా నిలుస్తాయి. విద్య ఒక్క పిల్లవాడిని ప్రపంచానికి మరింత తెరువాలా? లేక ఒక నిర్దిష్ట గుర్తింపులో మరింత బలంగా నిలబెట్టాలా? గొప్ప విద్య సమాధానాలను బోధించదు. ప్రశ్నలను పుట్టిస్తుంది. విధేయతను తయారు చేయదు. స్వతంత్ర ఆలోచనను పెంచుతుంది. ఎందుకంటే విద్య యొక్క అసలు లక్ష్యం ఒక సిద్ధమైన ప్రపంచాన్ని అంగీకరించడం కాదు. ప్రపంచాన్ని కొత్తగా చూడగలిగే మానసిక స్వేచ్ఛను కల్పించడం. పిల్లల నుదుటిపై ఏమి ఉండాలి అనే ప్రశ్న అడిగే ముందు వారి మనసులో ఏమి ఉండాలి అనే ప్రశ్న అడగాలి. ఎందుకంటే ఒక సమాజం యొక్క భవిష్యత్తును నిర్ణయించేది బాహ్య గుర్తింపులు కావు. అంతర్గత చైతన్యం. నుదుటిపై కనిపించేది సంస్కృతి కావచ్చు. కానీ మనసులో పెరిగేది వ్యక్తిత్వం. విద్య యొక్క అసలు ఒక మనిషిని నిర్మించడం. అందుకే ఈ చర్చ చివరికి బొట్టు, గాజుల గురించి కాదు. విద్యకు సంబంధించిన అసలు ప్రశ్నల నుంచి ప్రజల దృష్టిని ఏ వైపుకు మళ్లిస్తున్నారు అనే దాని గురించి. ఒక సమాజం తన పిల్లలకు ఏమి ధరించాలో చెప్పడం సులభం. కానీ ఎలా ఆలోచించాలో నేర్పడమే విద్య యొక్క అసలు బాధ్యత. అందుకే చరిత్ర చివరికి మనుషులు ఏమి ధరించారు అని కాదు. వారు ఎలా ఆలోచించారు అని గుర్తుంచుకుంటుంది.

ఆయిరబోయిన బిక్షపతి(అగల్ జోయా), 7993248717.

# వ్యవస్థలో మార్పుకై సిపిఐ ప్రచారాందోళన

**బి. కె.కాంగో**

పోరాటాల, మహోజ్వల త్యాగాల చరిత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)100 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఇది కేవలం ఒక రాజకీయ పార్టీ శత వార్షికోత్సవం మాత్రమే కాదు, భారతదేశ కార్మిక వర్గం, రైతులు, కూలీలు, యువత, మహిళలు... ప్రజాస్వామ్య, లౌకిక విలువల కోసం సాగించిన శతాబ్ద కాలపు పోరాట రాజకీయ వారసత్వం.

ఈ చారిత్రాత్మక సందర్భంలో, ఆగస్టు 6 నుండి 15 వరకు దేశవ్యాప్తంగా విస్తృత ప్రచారాన్ని, అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని, అలాగే 2026 సెప్టెంబర్ 1న ఢిల్లీలోని రామ్ లీలా మైదాన్‌లో భారీ జాతీయ ప్రదర్శన/బహిరంగ సభ నిర్వహించాలని పార్టీ నిర్ణయించింది. 'బదలావ్ జరూరి హై' (మార్పు అవసరం) అనే నినాదంతో ఈ ర్యాలీని నిర్వహిస్తున్నారు. సెప్టెంబర్ 1వ తేదీని ప్రపంచవ్యాప్తంగా 'సామ్రాజ్య వాద వ్యతిరేక దినం'గా, 'అంతర్జాతీయ శాంతి, ఫాసిజం వ్యతిరేక దినం'గా పాటిస్తారు. ఇది ఈ ర్యాలీ/ సభ రాజకీయ, సైద్ధాంతిక ప్రాముఖ్యతను మరింత పెంచుతుంది.

నేడు దేశం తీవ్రమైన రాజకీయ, ఆర్థిక, సామాజిక సంక్షోభం గుండా పయనిస్తోంది. ఒకవైపు నిరుద్యోగం, ధర ల పెరుగుదల, వ్యవసాయ సంక్షోభం, ఆర్థిక అసమానతలు, జీవనోపాధి సమస్యలు నిరంతరం పెరుగుతున్నాయి. మరోవైపు, ప్రజాస్వామ్య సంస్థల స్వయంప్రతిపత్తి, విశ్వసనీయతపై తీవ్రమైన ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వం అభివృద్ధి గురించి ప్రస్తావిస్తూ ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించడం గురించి గొప్పగా చెప్పుకుంటోంది. కానీ, సామాన్య పౌరుడి జీవితంలో ఈ వాదనల ప్రభావం ఏమాత్రం కనిపించడం లేదు. కోట్లాది మంది యువత నిరుద్యోగ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. రైతుల ఆదాయం, సాగు రెండూ కూడా సంక్షోభంలో ఉన్నాయి. కార్మికుల వాస్తవ ఆదాయం తగ్గుతోంది. ధరల పెరుగుదల సామాన్య కుటుంబాల బడ్జెట్‌లను అస్తవ్యస్తం చేసింది.

జిడిపి (స్థూల జాతీయ ఉత్పత్తి) వృద్ధిని అభివృద్ధికి ప్రధాన కొలమానంగా ప్రభుత్వం నిరంతరం చూపిస్తుంది. కానీ వాస్తవం ఏమిటంటే, అభివృద్ధి ఫలాలు సమాజంలోని మెజారిటీ ప్రజలకు చేరడం లేదు.

ప్రస్తుత ఆర్థిక నమూనా గరిష్ట లాభం, కార్పొరేట్ ప్రయోజనాల రక్షణపై ఆధారపడి ఉంది. ఆర్థిక వ్యవస్థ పై స్థాయి లో వృద్ధి చెందితే, దాని ప్రయోజనాలు సహజంగానే కింది స్థాయికి చేరుతాయని భావించారు. 'ట్రికిల్ డౌన్' (సంపద పై నుంచి కిందికి ప్రవహించడం) సిద్ధాంతం అని పిలువబడే ఈ ఆలోచన ఆచరణలో పూర్తిగా విఫలమైంది.

కేవలం జిడిపి వృద్ధి ప్రజల జీవితాలను స్వయంచాలకంగా మెరుగుపరచదని చరిత్ర, ప్రస్తుత అనుభవం రెండూ రుజువు చేస్తున్నాయి. అభివృద్ధికి మానవుడు(అతని జీవితం,గౌరవం, సాధికారత)కేంద్ర బిందువుగా మారనంత వరకు, ఆర్థిక వృద్ధి ఫలాలు కొన్ని వర్గాలకే పరిమితం అవుతాయి. ఈ ఆర్థిక వైఫల్యాలతో పాటు, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ కూడా నిరంతర ఒత్తిడికి గురవుతోంది. పార్లమెంటు సామర్థ్యం క్షీణిస్తోంది. రాజ్యాంగ సంస్థల నిష్పాక్షికత ప్రశ్నార్థకంగా మారింది. గణాంక సంస్థల సమాచార విశ్వసనీయతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల సంఘం, ఇతర సంస్థల స్వాతంత్ర్యంపై విస్తృత చర్చ జరుగుతోంది. అసమ్మతి స్వరాలను అనుమానంతో చూస్తున్నారు. ప్రజాస్వామ్య హక్కులపై నిరంతరం దాడులు జరుగుతున్నాయి. సమాజంలో మతపరమైన విభజనను ప్రోత్సహిస్తున్నారు. ఈ ధోరణులను ప్రజాస్వామ్య వ్యవస్థకు తీవ్రమైన ముప్పుగా సిపిఐ పరిగణిస్తుంది. వీటిని పెరుగుతున్న ఫాసిస్ట్ రాజకీయ పోకడల వ్యక్తీకరణగా భావిస్తోంది. ఇటువంటి పరిస్థితులలో, కేవలం పార్లమెంటరీ చర్చ లేదా ఎన్నికల రాజకీయాలు మాత్రమే సరిపోవు. ప్రజల నిజమైన సమస్యల చుట్టూ విస్తృత ప్రజా ప్రచారం, ప్రజా చైతన్యం, ఉమ్మడి పోరాటం ఆవశ్యకత గతంలో కంటే ఎక్కువగా పెరిగింది. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించటానికి, రాజ్యాంగ విలువలను కాపాడటానికి,సామాజిక న్యాయం, లౌకికవాదం, ఆర్థిక సమానత్వాన్ని సాధించడానికి ప్రజల ప్రత్యక్ష భాగస్వామ్యమే అతిపెద్ద బలం. ఈ దృక్పథంతో, సిపిఐ తన రాజకీయ సందేశాన్ని నేరుగా ప్రజల వద్దకు తీసుకువెళ్లి, ప్రజా పోరాటానికి విస్తృత రూపాన్ని ఇవ్వాలని నిర్ణయించుకుంది.

ఈ మేరకు ఆగస్టు 6 నుంచి 15 వరకు అన్ని రాష్ట్రాల్లో విస్తృత




రాజకీయ ప్రచారాన్ని నిర్వహించాలని ఢిల్లీలో జరిగిన సిపిఐ జాతీయ సమితి సమావేశంలో నిర్ణయించారు. విస్తృతమైన ప్రజా సంబంధాన్ని ఏర్పరచడం, ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల గురించి, బిజెపి ప్రభుత్వ దుష్పరిపాలన ఫలితంగా ఏర్పడిన సమస్యల గురించి అవగాహన కల్పించడం దీని లక్ష్యం. ఈ ప్రచారం 2026 సెప్టెంబర్ 1వ తేదీన న్యూఢిల్లీలోని రామ్ లీలా మైదాన్‌లో భారీ జాతీయ ప్రదర్శన, బహిరంగ సభతో ముగుస్తుందని కూడా జాతీయ సమితి నిర్ణయించింది.

2026 సెప్టెంబర్ 1న 'బదలావ్ జరూరి హై (మార్పు అవసరం)' అనే నినాదంతో ప్రచారానికి పార్టీ సన్నాహాలు ప్రారంభించింది. బిజెపి పాలనలో తీవ్రమవుతున్న ఆర్థిక సంక్షోభం, పెరుగుతున్న నిరుద్యోగం, పెరుగుతున్న మత విభజన, ప్రజాస్వామ్య హక్కులపై పెరుగుతున్న దాడులు, వ్యవసాయ సంక్షోభం, ప్రజల జీవన స్థితిగతులను నేరుగా పరిష్కరించేందుకు, ప్రజల జీవన స్థితిగతులను నేరుగా పరిష్కరించడానికి పార్టీ సన్నాహాలను ప్రారంభించింది.

ఆగస్టు 6 నుంచి 15 వ తేదీల మధ్య, దేశవ్యాప్తంగా పార్టీ శాఖలు పాదయాత్రలు, బహిరంగ సభలు, వీధి చివర సమావేశాలు, ఇంటింటికీ ప్రచారాలు, ఇతర ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తాయి. ర్యాలీకి ప్రజలను ఆహ్వానించడం మాత్రమే కాదు, ప్రజలతో సంభాషణను నిర్మించడం, వారి సమస్యలను అర్థం చేసుకోవడం, ప్రస్తుత రాజకీయ, ఆర్థిక పరిస్థితులపై విస్తృత ప్రజాభిప్రాయాన్ని రూపొందించడం. ఈ కార్యక్రమాల పరంపర ఢిల్లీలో 'బదలావ్ జరూరి హై' జాతీయ ర్యాలీతో ముగుస్తుంది.

సన్నాహాలను పర్యవేక్షించడానికి, మార్గనిర్దేశం చేయడానికి, పార్టీ కేంద్రం 10 మంది సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసింది. దీనికి జాతీయ కార్యదర్శి వర్గ సభ్యుడు, ఎంపి పి. సందోష్ కుమార్ కన్వీనర్‌గా ఉన్నారు. ఈ కమిటీ అనేక సమావేశాల ద్వారా సన్నాహాలను సమీక్షిస్తోంది. దేశవ్యాప్త ప్రచారాన్ని సమన్వయం చేస్తోం ది.

ఈ ప్రచార కార్యక్రమం పట్ల పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు, శ్రేయోభిలాషులలో విశేషమైన ఉత్సాహాన్ని రాష్ట్రాల నుండి వచ్చిన నివేదికలు సూచిస్తున్నాయి. రాజకీయ స్పష్టత, ప్రణాళికాబద్ధమైన సన్నద్ధత, సమర్థవంతమైన సమన్వయం, శక్తివంతమైన ప్రజాసంఘాల బలంతో, ఈ ప్రచారాన్ని దేశవ్యాప్త ప్రజా ఉద్యమంగా మార్చడానికి పార్టీ కట్టుబడి ఉంది.

దేశం ఎదుర్కొంటున్న సవాళ్లు ఏ ఒక్క విధానం లేదా నిర్ణయం వల్ల వచ్చినవి కావు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, పెరుగుతున్న అసమానత, నెమ్మదించిన తలసరి ఆదాయ వృద్ధి, భారతదేశం అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా మారుతున్నట్లు పేర్కొన్నప్పటికీ అభివృద్ధి ప్రయోజనాలు సమాజానికి సమానంగా అందడం లేదు. ఇందుకు 2002 – 2014 మధ్య తలసరి ఆదాయం దాదాపు 250 శాతం పెరగగా, 2014–2026 మధ్య, ఈ వృద్ధి కేవలం 60 శాతం మాత్రమే ఉండడం రుజువు.

ఈ సంఖ్య ప్రస్తుత ఆర్థిక విధానాల పరిమితులను బహిర్గతం చేస్తుంది. ఇందు లో, గణాంక సంస్థల విశ్వసనీయతపై ప్రశ్నలు, ఎన్నికల కమిషన్, న్యాయవ్యవస్థ, ఇతర సంస్థల స్వతంత్రతపై పెరుగుతున్న ఆందోళనలు, వ్యవస్థలో విస్తృత సంస్కరణలు, మార్పుల అవసరాన్ని కూడా సూచిస్తాయి.

ఈ కారణంగానే, కేవలం ప్రభుత్వాన్ని మార్చడమే కాకుండా, విధానాలను, ప్రజా వ్యతిరేక వ్యవస్థనే మార్చాల్సిన సమయం ఆసన్నమైందని సిపిఐ భావిస్తోంది. 'బదలావ్ జరూరి హై – మార్పు అవసరం' అనేది కేవలం ఒక నినాదం మాత్రమే కాదు ఇది ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగ విలువల పునరుద్ధరణ, ఆర్థిక న్యాయం, సామాజిక సమానత్వం, లౌకికవాదం, ప్రజాకేంద్రిత అభివృద్ధి కోసం ఇచ్చిన జాతీయ పిలుపు.

**'మార్పు అవసరం'**
**2026 సెప్టెంబర్ 1న 'చలో ఢిల్లీ'**

# అరుణోదయ నాగన్నను స్మరించుకుందాం!


జె.సీతారామయ్య
9490700954

'జై బోలో తెలంగాణ జన గర్జనల జడివాన'అంటూ తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో గజ్జగట్టి ఆటలాడి,గోచిపెట్టి గంతు లేసి గొంగడి భుజానవేసుకొని డప్పు చేతబట్టుకొని అరుణోదయ కళాకారులం మేము ప్రజలకొరకు ఆడి పాడుతాం అంటూ తెలంగాణ అంతటా మారుమోగేలా ఆడి పాడిన తెలంగాణ గాన కోకిల అరుణోదయ నాగన్న గొంతు శాశ్వతంగా మూగపోయింది.అరుణోదయ నాగన్నగా తెలంగాణ, ఆంధ్రతో పాటు ఎన్నో రాష్ట్రాల్లో పేరుపొందిన పరకాల నాగన్న జూలై 3,2026న ఖమ్మంలో అమరత్వం పొందాడు. జులై 4న ఆయన అంతిమయాత్రలో రెండు తెలుగు రాష్ట్రాల్లో ని అరుణోదయ కళాకారులు, తెలంగాణ రాష్ట్రంలో అన్నిరకా ల కళాకారులు, నాగన్న శిష్యులు, అనుచరులు,అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని వినమ్రంగా జోహార్లు అర్పించారు.

అర్ధశతాబ్ది కాలం పాటు గొప్ప కళాకారుడుగా, ఆదర్శవంతమైన జీవితంగడిపిన అరుణోదయ సంస్థ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు నాగన్న మరణం కళాఉద్యమానికి ఎంతో నష్టదాయకం. వందకు పైగా పాటలురాసి, వెయ్యికి పైగా విప్లవగీతాలు ఆలపించి, 50 ఏండ్ల పాటూ కళారంగానికి ఎన్నో సేవలు చేసిన నాగన్న తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ఎంతో చురుకుగా పని చేశారు.

సకల జనులసమ్మె, సాగరహారం, మిలియన్ మార్చ్, తెలంగాణ ధూమ్ ధాం లలో అవిశ్రాంతంగా ఎన్నో కళాప్రదర్శనలు నాగన్న చేశాడు. రాష్ట్ర ఉద్యమంలో తెలంగాణ రాష్ట్రంలో నాగన్న తిరగని జిల్లా,గ్రామం లేదంటే అతిశయోక్తి ఎంతమాత్రం కాదు. తెలంగాణ సాధన ఉద్యమంకు మద్దతుగా సిపిఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ ఆంధ్రప్రాంతంలో ఏర్పాటుచేసిన సభల సందర్భంగా శ్రీకాకుళం, విజయనగరం, గుంటూరు, కృష్ణ, నెల్లూరు, ఒంగోలు, కర్నూలు, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో అనేక మారుమూల గ్రామాల్లో అరుణోదయ నాగన్న తిరిగి ప్రజలకి తెలంగాణ రాష్ట్ర ఉద్యమం ఎంత న్యాయమైన డిమాండో అర్థంచేయించడంలో మంచి కృషి చేశాడు. తన పాటలద్వారా మాటల ద్వారా ఆంధ్ర, తెలంగాణ ప్రజల మధ్య ఐక్యత కొనసాగేటట్లు తెలంగాణ ప్రజల ఉద్యమానికి మద్దతును సమకూర్చుకునేటట్లు 'జై బోలో తెలంగాణ జన గర్జనల జడివాన' అంటూ నాగన్న ఎన్నెన్నో కళారూపా లను ప్రదర్శించాడు. మహారాష్ట్రలో ముంబై, సూరత్ ప్రాంతంలో నివసిస్తున్న తెలంగాణ ప్రజలను చైతన్యవంతం చేసేందుకు పాటలు కళారూపాల ద్వారా తెలంగాణ వెనుకబాటును ప్రజల కళ్లగట్టేలా చూపించాడు.

ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం రాజారం గ్రామంలో 1956లో కామ్రేడ్ నాగన్న జన్మించాడు. ఆయన తండ్రి పాపయ్య, తల్లి లక్ష్మమ్మలకు రెండవ సంతానంగా నాగన్న జన్మించాడు. కల్లుగీత కార్మిక కుటుంబంలో పుట్టిన నాగన్న కడుపేదరికంలో బతుకుతున్న కుటుంబంలో జన్మించాడు. అందువల్ల మేకల కాపరిగా, పొలం దున్నే పాలేరుగా జీవితాన్ని సాగించాడు. అనంతరం కుటుంబ పోషణకు టైలర్‌గా జీవించాడు. కడుపేదరికం వల్ల ఆయన ఏ బడికి వెళ్లి చదువుకొనలేదు. శ్రీపాద వెంకటేశ్వరరావు ఆ గ్రామంలో నడిపిస్తున్న రాత్రి పాఠశాలలో నాగన్న పగలు జీతంచేస్తూ రాత్రిబడికి వెళ్లి చదువుకునేవాడు. ఆ విధంగా నాగన్న ప్రాథమిక అక్షరజ్ఞానం మాత్రమే కలిగి ఉన్నాడు. ప్రాథమిక అక్షరజ్ఞానమే అయినప్పటికీ సమాజాన్ని చదవాడు. దేశంలో పీడిత ప్రజల జీవితాన్ని చదివాడు. దేశంలో దోపిడికి కారణాలు, ప్రజల సమస్యలకు పరిష్కారమార్గాలు కనుగొనడంలో యూనివర్సిటీ ప్రొఫెసర్లను, గొప్ప సామాజికవేత్తలను మించిపోయాడు.

1980 నుండి అరుణోదయ సాంస్కృతిక సమాఖ్యలో కార్యకర్తగా నాయకుడుగా అగ్ర నాయకుడిగా ఎదిగాడు. నాగన్న బుర్రకథలు, జానపద గేయాలు, ఒగ్గుకథలు, జమిడికలు, డప్పువాయిద్యాలు, కోలాటం తదితర కళారూపాలలో ఆరితేరాడు. ఎందరికో శిక్షణ ఇచ్చాడు. తనకున్న మధురమైన గాత్రంతో పాటలు పాడటంతో ఆయనకు వేలాదిమంది అభిమానులు, వందలాది మంది అనుచరులు ఉన్నారు. అరుణోదయ సంస్థ పేరుని ఇంటిపేరుగా మార్చుకున్న వారిలో ఒకరు అరుణోదయ నాగన్న కాగా మరొకరు అరుణోదయ రామారావు. వీరిద్దరూ కళారంగంలో ఉద్దండ పండితుడైన కానూరి వెంకటేశ్వరరావు(తాతగారి)శిష్యులు.

ఎదిగిన కొద్దీ ఒదిగి ఉండమనే దానిని ఆదర్శంగా తీసుకున్న అరుణోదయ నాగన్న ఎన్నికష్టాలు వచ్చినా ఎన్ని ఇబ్బందులు వచ్చినా ప్రజల్లోనే జీవించాడు. ఏనాడు గొప్ప కళాకారుడిగా పొంగిపోలేదు. అహంకారం దగ్గరికి చేరనీయని నేత. సంపాదనకోసం ఏనాడు ఆశపడలేదు. ఇతరుల ముందు తలవంచని గొప్పతనం ఆయనది. నమ్ముకున్న ఆశయాలను,పేద ప్రజలను విడవకుండా, తన కళారూపాన్ని వదులు కోకుండా జీవితాంతం ఉన్నత ఆదర్శాలతో బ్రతికాడు. మతోన్మాద కార్పొరేట్ శక్తులు కళారంగాన్ని కాలుష్యం చేస్తున్న సమయంలో కళాకారులను ప్రలోభపెట్టి లోబర్చుకుంటున్న సందర్భంలో నిర్బంధాలకు, డబ్బుకు, కుయుక్తులకు లొంగని ఉక్కుమనిషి నాగన్న గడిపిన సాధారణ జీవితం, పాటించిన ఉన్నత ఆదర్శాలు, ఎంచుకున్న గొప్ప ఆశయం, ప్రజల పట్ల అచంచల విశ్వసనీయత అందరికి ఆదర్శప్రా యం కావాలి.


### శనివారం సంతాపసభ

అరుణోదయ నాగన్నను స్మరించుకునేందుకు జులై 25న సుందరయ్య విజ్ఞానకేంద్రంలో అరుణోదయ సమాఖ్య రాష్ట్ర కమిటీ సంతాపసభ నిర్వహిస్తోంది. తెలంగాణ గానకోకిల అరుణోదయ నాగన్నను స్మరించుకుందాం. ఘనంగా నివాళి అర్పిద్దాం. ప్రజా కళాకారులుగా, ప్రజల మనుషులుగా జీవిద్దాం.

(రచయిత : ఇఫ్టు,తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు)

# ఎల్-నినోపై సమగ్ర కార్యాచరణ ప్రణాళిక

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందజేస్తాం : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ఎల్‌నినో పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ఉమ్మడి జిల్లాల వారీగా వచ్చిన సూచనలతో సమగ్ర రాష్ట్ర స్థాయి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి అందజేయనున్నట్లు వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సచివాలయంలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జి. చిన్నారెడ్డి, ఉన్నతాధికారులు, ఐఎండి, ఇక్రిశాట్, నాబార్డు, బ్యాంకింగ్ రంగాల ప్రతినిధులు, శాస్త్రవేత్తలతో గురువారం నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి కె.సురేంద్ర మోహన్, వ్యవసాయ శాఖ డైరక్టర్ బి.గోపి, సహకార శాఖ కమిషనర్ రాహుల్ రాజ్, హార్టికల్చర్ ఎండి యాస్మిన్ బాషా, టిజిఎన్‌పిడిసిఎల్ ఎండి కర్నాటి వరుణ్ రెడ్డి, ఐఎండి ఇక్రిశాట్, క్రిడా, ఐఐఎంఆర్, ఎస్‌ఎల్‌బిసి, నాబార్డు, నేషనల్ కార్పొరేషన్ తదితర సంస్థల అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

**వరి సాగుపై పునరాలోచించండి**

భారత వాతావరణ శాఖ నివేదిక ప్రకారం ఎల్ నినో ప్రభావం రానున్న నెలల్లోనూ కొనసాగి, డిసెంబర్ నాటికి మరింత తీవ్రమయ్యే అవకాశముందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం 23 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైందన్నారు. మహారాష్ట్ర, కర్ణాటకల్లో వర్షాలు లేకపోవడంతో గోదావరి, కృష్ణా నదులకు వరద నీరు వచ్చే అవకాశాలు తక్కువగా ఉన్నాయన్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలను చూసి రైతులు వరి వేయవద్దని, భూగర్భ జలాలు పడిపోతున్నందున బోరుబావుల కింద కూడా వరి సాగు చేయవద్దని సూచించారు. ప్రాజెక్టుల్లో ఉన్న నీరు తాగునీటి అవసరాలకే ప్రాధాన్యమని స్పష్టం చేశారు.

**ప్రత్యామ్నాయ పంటలు – సూక్ష్మ సేద్యం**

వరి, పత్తి స్థానంలో తక్కువ నీటితో పండే పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనెగింజలు, ఉద్యాన పంటలను ప్రోత్సహించాలని ఆదేశించారు. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న రంగారెడ్డి, మేడ్చల్, మహబూబ్ నగర్, భువనగిరి, నల్లగొండ జిల్లాల రైతులు కూరగాయల సాగు చేపట్టేలా అవగాహన కల్పించాలన్నారు. నాబార్డ్ ఆర్‌ఐడిఎఫ్ కింద రూ.498 కోట్లు సాధించి రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్లు సబ్సిడీపై అందించాలని ఉద్యానశాఖ అధికారులను ఆదేశించారు. ప్రత్యామ్నాయ విత్తనాలను ముందుగానే సిద్ధం చేసి 'రైతు వేదికల' ద్వారా పంపిణీ చేయాలని సూచించారు.

**రుణ సదుపాయం, గ్రామ స్థాయిలో అవగాహన**

ఈ ఏడాది రైతులకు రూ.58 వేల కోట్ల పంట రుణాల లక్ష్యానికి గాను ఇప్పటివరకు రూ.20 వేల కోట్లు అందించామని బ్యాంకర్లు తెలపగా, ప్రస్తుత పరిస్థితుల్లో రుణ వితరణను మరింత పెంచాలని మంత్రి కోరారు. జిల్లాల తరహాలోనే ప్రతి మండలానికి, గ్రామానికి ప్రత్యేక అధికారులను నియమించి రైతులకు నీటి పొదుపు, వాతావరణ మార్పులపై అవగాహన కల్పించాలన్నారు. ఉపాధి హామీ పథకం పనుల్లో నీటి సంరక్షణ చర్యలకే అధిక ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి సూచించారు.

**32 లక్షల ఎకరాల్లో సాగు తగ్గే అవకాశం: జి. చిన్నారెడ్డి**

రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి. చిన్నారెడ్డి మాట్లాడుతూ ఇప్పటివరకు రాష్ట్రంలో 24 శాతం లోటు వర్షపాతం నమోదైందని, సాధారణ సాగుతో పోలిస్తే దాదాపు 32 లక్షల ఎకరాల్లో సాగు తగ్గే అవకాశం ఉందన్నారు. నీటి కొరత ఉన్నందున రైతులకు నష్టం వాటిల్లకుండా ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని కోరారు.

### బిజెపి ప్రజా వ్యతిరేక పాలనను నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో

# 'సెప్టెంబర్ 1న చలో ఢిల్లీ'

**ఆగస్టు 6 నుంచి 14 వరకు పాదయాత్రలు**

**'చలో ఢిల్లీ' పోస్టర్‌ను ఆవిష్కరించిన సిపిఐ నేతలు**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిజెపి ఎన్నికల సందర్భంగా అభివృద్ధి, ఉపాధి, సంక్షేమం, సుపరిపాలనతో పాటు మెరుగైన భవిష్యత్తును అందిస్తామని వాగ్దానం చేసిందని కానీ, దానికి బదులుగా దేశంలో నేడు పెరుగుతున్న నిరుద్యోగం, భరించలేని ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదల, విస్తరిస్తున్న అసమానతలు, బలహీనపడిన గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, కుచించుకుపోతున్న ప్రజాస్వామ్యం, పెరుగుతున్న సామాజిక ఉద్రిక్తతలను ఎదుర్కొంటుందని పలువురు సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశం సిపిఐ మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్ అధ్యక్షతన పార్టీ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో గురువారం జరిగింది. సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, ఈ.టి.నరసింహ, కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్, వి.ఎస్.బోస్, బాగం హేమంతరావు తదితరులు 'చలో ఢిల్లీ పోస్టర్'ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కె.రామకృష్ణ మాట్లాడుతూ నేడు భారతదేశం ఒక కీలకమైన మలుపులో నిలిచి ఉందని, నరేంద్ర మోదీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉన్న ఈ దశాబ్దం క్రమంగా ఆందోళన, నిరాశ, పెరుగుతున్న కష్టాలకు దారితీసిందన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న అసలైన సమస్యల నుండి దృష్టిని మరల్చడానికి విభజనను ప్రోత్సహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యువత పోటీ పరీక్షల కోసం ఏళ్ల తరబడి సన్నద్ధమవుతుంటే, నియామకాలు ఆలస్యం కావడం, రద్దు కావడం లేదా వరుస పేపర్ లీకేజీల వల్ల పక్కదారి పట్టడం వంటివి జరుగుతున్నాయన్నారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారం చేపట్టినప్పటి నుంచి నిత్యావసర వస్తువుల ధరలు గణనీయంగా పెరుగుతున్నాయన్నారు. కేవలం బతకడం కోసమే పేదలు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులు, అనిశ్చిత ఆదాయాలు, పేరుకుపోతున్న అప్పుల ఊబిని ఎదుర్కొంటున్నారన్నారు. దేశవ్యాప్తంగా రైతులు సుదీర్ఘ పోరాటాలు చేసినప్పటికీ, కనీస మద్దతు ధరకు చట్టపరమైన హామీ కల్పించాలనే డిమాండ్ ఇంకా పరిష్కారం కాలేదన్నారు. ప్రస్తుతం విద్య అనేది ఒక బిడ్డ నేర్చుకునే సామర్థ్యంపై కాకుండా, ఆ కుటుంబం చెల్లించగలిగే ఆర్థిక శక్తిపైనే ఎక్కువ ఆధారపడుతోందని, ఇదే రకమైన నిర్లక్ష్యం ఆరోగ్య రంగంలోనూ స్పష్టంగా కనిపిస్తోందన్నారు. మహిళా సాధికారత గురించి పదేపదే పాలకులు హామీలు ఇస్తున్నప్పటికీ, వారు ఇప్పటికీ వివక్షను, అసమాన అవకాశాలను ఎదుర్కొంటూనే ఉన్నారని తెలిపారు. మహిళల రిజర్వేషన్లకు సంబంధించిన రాజ్యాంగ సవరణను ఇక ఎంతమాత్రం ఆలస్యం చేయకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

**ఆగస్టు 6 నుంచి 14 వరకు సిపిఐ పాదయాత్రలు**

ప్రతి గ్రామం, పట్టణం, నగరానికి ఐక్యత, న్యాయం, ప్రజాస్వామ్య మార్పుల సందేశాన్ని చేరవేస్తూ ఆగస్టు 6 నుండి 14 వరకు దేశవ్యాప్త ప్రచారం, పాదయాత్రలకు సిపిఐ పిలుపునిచ్చిందని కూనంనేని సాంబశివరావు వివరించారు. ఈ పాదయాత్రలు సెప్టెంబర్ 1న న్యూఢిల్లీలోని రాంలీలా మైదానంలో జరగనున్న 'బద్లావ్ జరూరీ హై' (మార్పు అనివార్యం) ర్యాలీతో ముగుస్తాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జరిగే ఈ పాదయాత్రలను, సెప్టెంబర్ 1న మార్పు కోసం చలో ఢిల్లీ కార్యక్రమాలను జయప్రదం చేయాలని సిపిఐ తెలంగాణ రాష్ట్ర సమితి పిలుపునిచ్చిందన్నారు.

# యువత ఆకాంక్షలను అర్థం చేసుకోవడంలో బిజెపి విఫలం

## మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశ యువత ఆకాంక్షలను అర్థం చేసుకోవడంలో, వారి సమస్యలకు పరిష్కారాలు చూపడంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. పెరుగుతున్న నిరుద్యోగం, వరుసగా జరుగుతున్న పరీక్షల పేపర్ లీకులు, విద్యార్థుల భవిష్యత్తుపై నెలకొన్న అనిశ్చితి, అవకాశాల కొరత తదితర అంశాలు దేశ యువతలో తీవ్ర నిరాశను కలిగించాయని, తద్వారా బిజెపి ప్రభుత్వానికి, యువతకు మధ్య పెరుగుతున్న దూరం స్పష్టంగా కనిపిస్తోందని ఉత్తమ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యువత, విద్యార్థుల ఆవేదనను వినాల్సిన కేంద్ర ప్రభుత్వం అందుకు భిన్నంగా ఆందోళనకు దిగినవారిని అణచివేతకు పాల్పడటం అత్యంత దురదృష్టకరమన్నారు. ప్రశ్నించే గొంతులను అరెస్టులతో, బెదిరింపులతో అణచివేయాలని ప్రయత్నిస్తే ప్రజాస్వామ్య స్ఫూర్తికి, భారత రాజ్యాంగ విలువలకు పూర్తిగా విరుద్ధమన్నారు. విద్యార్థుల సమస్యలను తన సమస్యలుగా భావించి, వారి తరఫున నిర్భయంగా గళమెత్తడం, రాజ్యాంగాన్ని కాపాడేందుకు, ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకు రాజీలేని పోరాటం చేయడం రాహుల్ నాయకత్వంలోని గొప్పతనమని పేర్కొన్నారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉన్నదని, ఆ యువత ఆకాంక్షలకు ప్రతిబింబంగా, ప్రజాస్వామ్య భారత నిర్మాణానికి నాయకత్వం వహించే ప్రత్యామ్నాయ నాయకునిగా రాహుల్ గాంధీ ఎదుగుతున్నారని, ఈ మార్పును దేశ ప్రజలు హర్షిస్తున్నారని, రానున్న రోజుల్లో ఈ విశ్వాసం మరింత బలపడుతుందని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

# హైదరాబాద్ నడిబొడ్డున పేదలకు సొంతిల్లు..

## మంత్రి పొంగులేటి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ నగర నడిబొడ్డులో పేదలకు గౌరవప్రదమైన సొంతింటిని అందించాలనే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పాన్ని బిఆర్ఎస్ రాజకీయంగా తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి విమర్శించారు. పదేళ్ల పాలనలో చేయలేని పనిని కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతుంటే దానిపై విష్రపచారం చేయడం తగదన్నారు. సచివాలయంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, దరఖాస్తుల ప్రక్రియ తదితర అంశాలపై గురువారం అధికారులతో సమీక్ష నిర్వహించిన అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్‌లోనే పుట్టి పెరిగి జీవిస్తున్న పేద కుటుంబాలు నగరంలోనే గౌరవంగా జీవించేలా నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని వారు నివసిస్తున్న ప్రాంతాల్లోనే ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పేరుతో పేదలను నగరానికి 30 నుంచి 40 కిలోమీటర్ల దూరంలోకి తరలించిందని, ఉద్యోగాలు, ఉపాధి, విద్య, వైద్య సౌకర్యాలకు దూరంగా అరకొర వసతులతో ఇళ్లు నిర్మించిందని విమర్శించారు. ప్రస్తుతం ప్రభుత్వం విలువైన ప్రభుత్వ భూములను ప్రజల సంక్షేమం కోసం వినియోగిస్తూ పేదలకు శాశ్వత భరోసా కల్పించేలా ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాన్ని చేపట్టిందన్నారు. పేదల జీవితాలతో రాజకీయాలు చేయకుండా బిఆర్ఎస్ దుష్ప్రచారాన్ని విరమించుకోవాలన్నారు. ఇందిరమ్మ టవర్స్‌కు సంబంధించి గతంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను విక్రయిస్తారనే ప్రచారం పూర్తిగా అవాస్తవమన్నారు. లబ్ధిదారులపై ఆర్థిక భారం తగ్గించేందుకు ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడి అందిస్తోందని, లబ్ధిదారుడి వాటా కేవలం రూ.6 లక్షలు మాత్రమేనని చెప్పారు. తొలి విడతలో 16 నియోజకవర్గాల్లో నిర్మించనున్న ఫ్లాట్ల మార్కెట్ విలువ రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఉంటుందని, అయినప్పటికీ అత్యంత తక్కువ వ్యయంతో పేదలకు అందిస్తున్నామన్నారు. యాజమాన్య హక్కుల కేటాయింపులో సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇస్తూ ఎస్‌సిలకు 14 శాతం, ఎస్‌టిలకు 5 శాతం, బిసిలకు 16 శాతం, దివ్యాంగులకు 5 శాతం, ప్రభుత్వ అవుట్‌సోర్సింగ్, నాలుగో తరగతి ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులకు 10 శాతం చొప్పున మొత్తం 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నామన్నారు. ఈ రిజర్వేషన్‌లలో 30 శాతం మహిళలకు కేటాయిస్తామని, మిగిలిన 50 శాతం జనరల్ కేటగిరీలో భర్తీ చేస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం స్థానిక మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. మీ సేవ వాట్సాప్ నెంబర్ 8096958096, వెబ్‌సైట్ ద్వారా కూడా దరఖాస్తులు సమర్పించవచ్చని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమాన్ని అడ్డుకునేలా బిఆర్ఎస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని, ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు సహకరించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# సింగరేణి భవిష్యత్తు కోసం సాంకేతికత, నాణ్యతే కీలకం

## డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** తెలంగాణకు సింగరేణి ఆత్మలాంటిదని, సింగరేణి అప్డేట్ కాకుంటే అంబాసిడర్ కార్ పరిస్థితికి వస్తుందన్నారు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క. సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గురువారం సింగరేణి గనులను సందర్శించారు. ముందుగా సింగరేణి అతిథి గృహానికి చేరుకున్న ఉప ముఖ్యమంత్రికి సింగరేణి సీఎండీ జ్యోతి బుద్ధ ప్రకాష్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం జెవిఆర్ ఒసి ప్రాంతంలో ఒబి తొలగింపు, బొగ్గు ఉత్పత్తి పనులను ప్రత్యక్షంగా పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ, ఒబి (ఓవర్ బర్డెన్) , బొగ్గు కలిసిపోకుండా కచ్చితమైన పర్యవేక్షణ అవసరమని అధికారులకు సూచించారు. రెండూ కలిసిపోతే కాంట్రాక్టర్‌కే లాభం తప్ప సంస్థకు ప్రయోజనం ఉండదన్నారు. నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి ద్వారా మాత్రమే సింగరేణి పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోగలదని పేర్కొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని సంస్థను నిరంతరం నవీకరించుకోవాలని, లేదంటే అంబాసిడర్ కారు పరిస్థితి ఎదురవుతుందని వ్యాఖ్యానించారు. ప్రైవేట్ సంస్థలకు పోటీగా తక్కువ ధరలో నాణ్యమైన బొగ్గు సరఫరా చేసే విధంగా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రభుత్వం తరపున సింగరేణికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. తెలంగాణకు సింగరేణి ఆత్మవంటిదని, 135 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ సంస్థ భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికలతో సాగాలని భట్టి అన్నారు. మరో పదేళ్ల తర్వాత విద్యుత్ అవసరాలను అంచనా వేసి అందుకు అనుగుణంగా బొగ్గు ఉత్పత్తి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. థర్మల్ విద్యుత్‌తో పాటు ప్రత్యామ్నాయ వినియోగాలపైనా దృష్టి పెట్టాలని, బొగ్గుతో పాటు ఇతర ఖనిజాల ఉత్పత్తి, విస్తరణపై దృష్టి సారిస్తే భవిష్యత్ తరాలకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. అంతకుముందు సింగరేణి జీఎం చింతల శ్రీనివాసరావు మాట్లాడుతూ తాడిచర్ల బ్లాక్ సింగరేణికి రావడంలో ఉప ముఖ్యమంత్రి చేసిన కృషికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే జేవీఆర్ ఓసీ3 ప్రాజెక్టును కూడా సింగరేణికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్, కిష్టారం సర్పంచ్ నరుకుళ్ల రాజేశ్వరి, మున్సిపల్ చైర్‌పర్సన్ రిహానా కమల్ పాషా, వైస్ చైర్‌పర్సన్ బొంతు సుమలత, మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్, టీఎస్ జెన్‌కో చైర్మన్ హరీష్, జిల్లా అటవీ శాఖ అధికారి అనూస్ అగర్వాల్, సింగరేణి జీఎం చింతల శ్రీనివాసరావు, వెల్ఫేర్ అధికారి కావ్యతో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సాధ్యమైనంత త్వరగా ఉద్యమకారుల గుర్తింపు

**డిసెంబర్ నాటికి ప్రభుత్వానికి తుది నివేదిక**

**కమిటీ చైర్మన్ కేశవరావు, సభ్యులు కోదండరామ్, అద్దంకి దయాకర్**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ఉద్యమకారులను సాధ్యమైనంత త్వరగా గుర్తించి, రాష్ట్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదిక సమర్పిస్తామని ఉద్యమకారుల గుర్తింపు కమిటీ చైర్మన్ కె. కేశవరావు (కేకే) తెలిపారు. హైదరాబాద్‌లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 6వ తేదీ నుంచి 16 రోజుల పాటు వివిధ రాజకీయ పార్టీలు, ఉద్యమ సంఘాలు, ప్రజా ప్రతినిధులు, ఉద్యమకారులతో విస్తృత స్థాయిలో చర్చలు నిర్వహించినట్లు వెల్లడించారు. ఉద్యమకారులను ఏ విధంగా గుర్తించాలి, వారికి తగిన గౌరవం ఎలా కల్పించాలనే అంశాలపై అన్ని వర్గాల అభిప్రాయాలను కమిటీ సేకరించిందని తెలిపారు. మొత్తం 13 వేల మంది సమావేశాలకు హాజరుకాగా, దాదాపు వెయ్యి మంది తమ సూచనలు, అభిప్రాయాలను లిఖితపూర్వకంగా అందజేశారని చెప్పారు. కమిటీ పరిధి ఉద్యమకారులను గుర్తించడం వరకేనని, దీనికి రాజకీయ పార్టీలు లేదా సంఘాలతో సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ సమావేశాలు ఇక్కడితో ముగియలేదని, త్వరలో ఆన్‌లైన్ ద్వారా కూడా అభిప్రాయాలు, దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. ఇందుకు సంబంధించిన తేదీలను త్వరలో ప్రకటిస్తామని చెప్పారు. అలాగే వివిధ జిల్లాల్లో పర్యటించి ఉద్యమకారులు, సంఘాలతో సమావేశాలు నిర్వహించి మరిన్ని సూచనలు స్వీకరిస్తామన్నారు. తెలంగాణ ఉద్యమ చరిత్ర 1950 ముల్కీ ఉద్యమం నుంచి తెలంగాణ వచ్చే వరకు మలిదశ ఉద్యమం వరకు కొనసాగిందని, ఆ కాలంలో ఉద్యమంలో పాల్గొన్న వారిని గుర్తించే ప్రయత్నం చేస్తున్నామని కేశవరావు చెప్పారు. గత ప్రభుత్వాలు ఉద్యమకారులకు ఏమీ చేయలేదని తాను చెప్పబోనని, అయితే ఇప్పుడు వారికి తగిన గౌరవం దక్కేలా కమిటీ నివేదిక రూపొందిస్తుందని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని కేశవరావు అన్నారు. ఎమ్మెల్సీ, కమిటీ సభ్యుడు ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియలో అందరినీ భాగస్వాములను చేస్తామన్నారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ కమిటీ సమావేశానికి హాజరుకావాలని లేఖ రాస్తామని తెలిపారు. ఆయన కమిటీ ముందు హాజరై తన సూచనలు, అభిప్రాయాలు వెల్లడించవచ్చని చెప్పారు. ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియలో అందరికీ ఆహ్వానం ఉంటుందని, త్వరలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపిలతో కూడా ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని కోదండరామ్ వెల్లడించారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ కెసిఆర్ పట్ల తమకు గౌరవం ఉందని, ఆయన అభిప్రాయాలను కూడా కమిటీ పరిగణనలోకి తీసుకుంటుందన్నారు. ఉద్యమకారులకు న్యాయం జరిగేలా, వారికి తగిన గుర్తింపు, గౌరవం కల్పించేలా కమిటీ నివేదిక రూపొందించి డిసెంబర్‌లోపు రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 27న లోక్‌భవన్, కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు

## సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ



**న్యూఢిల్లీ:** నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యావ్యతిరేక దుర్మార్గపు విధానాలకు నిరసనగాను, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, న్యూఢిల్లీలో కొనసాగుతున్న ఘటనలకు స్పందిస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) అధ్వర్యంలో ఈనెల 27వ తేదీన దేశవ్యాప్తంగా గవర్నర్ కార్యాలయాలు (లోక్‌భవన్), కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు చేపట్టనున్నామని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని క్షలాది మంది విద్యార్థులు పోరాడుతుంటే... వాటిపై స్పందించకుండా పోలీసు దమనకాండతో ఉద్యమాన్ని అణచివేసేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నించడాన్ని తప్పుపట్టారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, బలవన్మరణానికి పాల్పడిన నీట్ విద్యార్థుల బాధిత కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం ఇవ్వాలన్న డిమాండ్‌ను ఇప్పటివరకు మోదీ సర్కారు ఆమోదించలేదన్నారు. ఉద్యమిస్తున్న విద్యార్థులపై పెద్దఎత్తున కేసులు నమోదు చేసి... జైళ్లకు పంపడానికి దుర్మార్గమైన కుట్రకు పాల్పడుతోందన్నారు. మోదీ ప్రభుత్వం అత్యంత దుర్మార్గంగాను, నిరంకుశ పద్ధతుల్లో ఉద్యమం అణచివేతకు ప్రయత్నిస్తోందని, సమస్యల పరిష్కారంపై ఏమాత్రం శ్రద్ధలేదని విమర్శించారు. గవర్నర్ కార్యాలయాలు, కలెక్టరేట్ల ఎదుట నిర్వహించ తలపెట్టిన ధర్నాలను పార్టీ శ్రేణులు, ప్రజా సంఘాల నేతలు విజయవంతం చేయాలని కోరారు.

# గిరిజన డిక్లరేషన్ సాధించేవరకూ పోరాటం

## కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్లు దాటినా గిరిజనుల అభ్యున్నతికి సరైన చర్యలు తీసుకోలేదు : అంజయ్య నాయక్

**(బొమ్మలపల్లి అంజన్ కుమార్ )**



హైదరాబాద్: "కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్లు దాటినా గిరిజనుల అభివృద్ధి కోసం సరైన చర్యలు తీసుకోలేదు. చేవెళ్ల వేదికగా కాంగ్రెస్ అధినేత సాక్షిగా కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన గిరిజన డిక్లరేషన్‌ను ప్రభుత్వ అమలు చేయాలి. లేకపోతే వాటిని సాధించుకునేంతవరకు తమ పోరాటం కొనసాగిస్తామని తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్ చెప్పారు. ఈ నెల 18, 19 తేదీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర 3వ మహాసభలు విజయవంతంగా ముగిశాయని తెలిపారు. గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మరో మారు అంజయ్య నాయక్ ఎన్నికైన ఈ సందర్భంలో మహాసభల విశేషలు, భవిష్యత్ కార్యాచరణను 'ప్రజాపక్షం'కి వెల్లడించారు. మహాసభ విజయవంతంగా జరిగింది. దాదాపు పది వేల మందితో భారీ ర్యాలీ నిర్వహించాము. అలాగే 173 మంది ప్రతినిధులు మహాసభలో పాల్గొన్నారని వివరించారు. కొత్తగా ఎన్నికైన వారిలో 57 మంది కౌన్సిల్ సభ్యులు, 25 మంది కార్యవర్గ సభ్యులు, 13 మంది ఆఫీస్ బేరర్స్ ఉన్నారని వివరించారు. గిరిజనుల హక్కులు, సంక్షేమం, విద్య, వైద్యం, పోడు భూముల సమస్యలు, ఎస్‌టి కార్పొరేషన్ల బలోపేతం, సబ్సిడీల బకాయిలు , గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల పరిస్థితి వంటి కీలక అంశాలపై విస్తృతంగా చర్చించి తీర్మానాలు చేశామన్నారు. రాష్ట్రంలో 40 శాతానికి పైగా పోడు రైతులకు ఇప్పటికీ పట్టా హక్కు పత్రాలు అందలేదని, ప్రభుత్వం వెంటనే వారికి హక్కు పత్రాలు అందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌టి కార్పొరేషన్లను బలోపేతం చేయడం, సబ్సిడీ విడుదల చేయడం, ఏజెన్సీ ప్రాంతాల్లో విద్య, వైద్య సదుపాయాలు మెరుగుపరచడం, గురుకులాలు–ఆశ్రమ పాఠశాలల్లో సీట్లు పెంచడం వంటి అంశాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వాటిని సాధించుకోవడమే లక్ష్యంగా గిరిజన సమాఖ్య మహాసభల్లో భవిష్యత్ కార్యాచరణను ప్రకటించాం. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్‌టి కార్పొరేషన్లను నిర్వీర్యం చేసే విధంగా 'రాజీవ్ యువ వికాసం' పేరుతో దరఖాస్తులు స్వీకరించిందని, ఇది సరైన విధానం కాదన్నారు. సబ్సిడీల బాకాయిలు భారీగా పెండింగ్‌లో ఉన్నాయి. కేవలం ట్రైకార్ కార్పొరేషన్‌కే రూ.370 కోట్లు బకాయి ఉందన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులకు ఇంకా నాణ్యమైన విద్య, వైద్య సేవలు అందడం లేదని, ఐటిడిఎల జవాబుదారీతనం పెరగాలన్నారు. గిరిజన సంక్షేమ శాఖలో పూర్తిస్థాయి డీడీఓలు లేకపోవడంతో ఇతర అధికారులు ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తున్నారన్నారు. గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో ప్రవేశాలకు భారీ డిమాండ్ ఉన్నప్పటికీ ప్రభుత్వం సీట్లు పెంచడం లేదన్నారు. పైగా బోయిన్‌పల్లి ఆశ్రమ పాఠశాల వంటి కొన్ని పాఠశాలలను మూసివేయడం ఆందోళన కలిగిస్తోందని, కొత్త సీట్లు పెంచడంతో పాటు మూసివేసిన పాఠశాలలను తిరిగి ప్రారంభించాలని తెలిపారు.

# రాష్ట్రంలో వారం రోజులు వర్షాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రానున్న ఏడు రోజుల పాటు తేలిక పాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు పలు ప్రాంతాల్లో కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 30–40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందని హెచ్చరించారు. ఆదిలాబాద్, కోమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లో కూడా గంటకు 30–40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఉపరితల గాలులు వీచే అవకాశం ఉందన్నారు. శుక్రవారం నుంచి గురువారం వరకు రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని చెప్పారు.




తెలంగాణ రాష్ట్రం, దేవాదాయ - ధర్మాదాయ శాఖ

**శ్రీ గణేష్ దేవస్థానము (సిద్ధి గణపతి)**

గణేష్ గడ్డ, రుద్రారం గ్రామం, పటాన్‌చెరు మం., సంగారెడ్డి జిల్లా.

SRI GANESH DEVASTHANAM (SIDDI GANAPATHI)

GANESH GADDA, Rudraram Village, Patancheru Mdl.. Sangareddy Dist.

నెం.SGD/2026 — **సీల్డ్ టెండరు ప్రకటన** — తేది: 23-07-2026

ఇందుమూలముగా సమస్త ప్రజలకు, వ్యాపారస్తులకు తెలియచేయునది ఏమనగా ఈ క్రింద పేర్కొనబడిన లైసెన్స్ మరియు సరఫరా హక్కులకై 2026-2027 సం.నకు గాను (1) సంవత్సర కాలపరిమితికి తేది: 03-08-2026 సోమవారము రోజున ఉ.11.30 ని.లకు శ్రీ గణేష్ దేవస్థానము (సిద్ధి గణపతి) ప్రాంగణములో దేవాదాయ-ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షములో సీల్డ్ టెండర్ నిర్వహించబడును.

| క్ర.సం. | టెండరు వివరములు | కాల పరిమితి | ధరావత్తు (E.M.D) | టెండరు షెడ్యూల్ ధర |
|---|---|---|---|---|
| 1. | విద్యుత్ అలంకరణ | తేది 01-08-2026 నుండి 31-07-2027 వరకు | రూ. 10,000/- | రూ.500/- |

1. తేది: 24-07-2026 నుండి 29-07-2026 వరకు దరఖాస్తులు స్వీకరించబడును.
2. తేది: 30-07-2026 నుండి 02-08-2026 వరకు టెండరు షెడ్యూల్ జారీ చేయబడును.
3. తేది: 03-08-2026, సోమవారము రోజున ఉ.10.30 ని.ల వరకు సీల్డ్ టెండర్లు స్వీకరించబడును. అదే రోజు ఉ.11.30 ని.లకు టెండరు దారుల సమక్షములో సీల్డ్ టెండర్-కమ్-బహిరంగ వేలము ప్రక్రియ నిర్వహించబడును.

పూర్తి వివరములకు దేవాలయ పని వేళల్లో కార్యాలయమునందు సంప్రదించగలరు.

యస్. లావణ్య
కార్యనిర్వహణాధికారిణి

DIPR R.O. No. : 6566-PP/CL/ADVT/2026-27, Date: 23-07-2026

## విద్యార్థి సంఘాల బంద్‌కు ఎఐవైఎఫ్, డివైఎఫ్ఐ మద్దతు



**ప్రజాపక్షం/కరీంనగర్:** నీట్ పేపర్ లీకేజీ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, ఎన్‌టిఏను రద్దు చేయాలని, ఢిల్లీలో విద్యార్థులపై పోలీసుల దాడిని ఖండిస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నేడు చేపట్టిన విద్యాసంస్థల బంద్‌కు ఏఐవైఎఫ్,డివైఎఫ్ఐ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగంధర్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరేష్ పటేల్ లు తెలిపారు. గురువారం బద్దం ఎల్లారెడ్డి భవన్లో ఎ ఐ వై ఎఫ్, డి వై ఎఫ్ ఐ నాయకుల సమావేశం ఏఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కసిబోసుల సంతోష చారి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగంధర్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరేష్ పటేల్ లు మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజ్‌కు బాధ్యులపై చర్యలు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, ఎన్‌టిఏ రద్దు, ఢిల్లీలో విద్యార్థులపై పోలీసు దాడిని ఖండిస్తూ జూలై 24 విద్యాసంస్థల బంద్‌ను ప్రజలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, యువత పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నీట్ పేపర్ లీకేజీ నిరుద్యోగం తదితర విద్యావ్యవస్థ సంక్షోభాలపై విద్యార్థులు సామాజిక కార్యకర్తలు చేపట్టిన శాంతియుత నిరసనను అణిచివేయడం దుర్మార్గమని మోదీ ప్రభుత్వం నియంతృత్వం ఇలాగే కొనసాగిస్తే యువత విద్యార్థుల తిరుగుబాటు తప్పదని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలోఏ ఐ వై ఎఫ్, పెనుమల్ల ఉదయభాస్కర్, డి వై ఎఫ్ ఐ జిల్లా ఉపాధ్యక్షులు శివ కుమార్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రైవేటీకరణను వద్దు




**ప్రజాపక్షం/మెట్‌పల్లి:** యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రయత్నాలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని మెట్‌పల్లి విద్యుత్ డివిజన్ డివిజనల్ ఇంజనీర్ (డీఈ) మధుసూదన్ డిమాండ్ చేశారు.యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గురువారం మెట్‌పల్లి డివిజన్ విద్యుత్ కార్యాలయం ఎదుట విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా డీఈ మధుసూదన్ మాట్లాడుతూ, విద్యుత్ రంగం ప్రజలకు అత్యంత కీలకమైన సేవా రంగమని, ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయాల్సిన సమయంలో ప్రైవేటీకరణ చర్యలు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తే ఉద్యోగుల భద్రతతో పాటు ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సేవలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.విద్యుత్ సంస్థలను లాభాపేక్షతో కాకుండా ప్రజా సేవా దృక్పథంతో నిర్వహించాల్సిన అవసరం ఉందని, విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం పునఃసమీక్షించాలని కోరారు.ఈ నిరసన కార్యక్రమంలో జేఏసీ జిల్లా చైర్మన్ అజీజ్, మెట్‌పల్లి డివిజన్ జేఏసీ చైర్మన్ మునుగురి లక్ష్మణ్, కార్యదర్శి హరి ప్రసాద్, జేఏసీ నాయకులు లక్కంపల్లి సురేష్,ఎండీ కరీం,శంకరయ్య,రవీందర్, భోయినపల్లి అశోక్, లక్ష్మి ,రాజమ్మ,మౌనిక,తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు లక్ష్యసాధనతో ముందుకు సాగాలి: మేయర్ కొలగాని



**ప్రజాపక్షం/కొత్తపల్లి :** విద్యార్థులు విద్యతోపాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతను అలవర్చుకొని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకు సాగాలని కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్‌లోని సాన్వీ జూనియర్ కళాశాల ఢిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో గురువారం కొత్తపల్లి రోడ్ రేకుర్తిలోని స్వాగత్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన నవోత్సవం2026 సాంస్కృతిక వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి భారత నిర్మాణ శిల్పులని అన్నారు. చదువుతోపాటు వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి, సేవా ధృక్పథం పెంపొందించుకోవాలని సూచించారు. సాన్వీ జూనియర్ కాలేజ్, ఢిఫెన్స్ అకాడమీ విద్యార్థులను పోటీ ప్రపంచానికి అనుగుణంగా తీర్చిదిద్దుతూ విద్యా, క్రీడా, సాంస్కృతిక రంగాల్లో ప్రోత్సహించడం అభినందనీయమని కొనియాడారు. లయన్ క్లబ్ నాయకులు లయన్ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని సేవాభావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. సామాజిక సేవకుడు నాగేశ్వర్ మాట్లాడుతూ యువత సమాజాభివృద్ధిలో కీలకపాత్ర పోశించాలని అన్నారు. పచ్చునూరి సురేందర్ విద్యతోపాటు వ్యక్తిత్వ వికాసం అవసరమని పేర్కొన్నారు. ట్రెడిషనల్ యోగా గురువు మెహర్ కుశల్ మాట్లాడుతూ యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతందని అన్నారు. పోలీస్ సంఘం అధ్యక్షులు మామిడాల సురేందర్ రెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణ, చట్టాల పట్ల గౌరవం ప్రతి విద్యార్థిలో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శేఖర్, గుంటుపల్లి స్వామి, వంశీధర్ రెడ్డి, అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రధాని మోదీ, అమిత్ షా విద్యార్థులకు క్షమాపణలు

**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్:** దేశం, ధర్మం అంటూ బిజేపి మాటలకే పరిమితం అవుతోందని దేశం పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదివికి రాజీనామా చేసి విద్యార్థులకు క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి అన్నారు. నీట్ పరీక్ష లీకేజీపై దేశవ్యాప్తంగా విద్యార్థులు ఆందోళనకు దిగుతున్న నేపథ్యంలో నరేందర్ రెడ్డి వినూత్నంగా బిజేపి దమన నీతిని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి కరీంనగర్‌లో ఛాయ్‌పే చర్చ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గురువారం కలెక్టరేట్ రోడ్డులోని సిరి టీ హోటల్ వద్ద ఛాయ్ పే చర్చ కార్యక్రమం నిర్వహించారు. విద్యావంతులు, మేధావులు, లాయర్లు, సీనియర్ సిటిజన్లతో కేంద్ర ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలను వారితో పంచుకున్నారు. మేధావుల అభిప్రాయలను తెలుసుకున్నారు. విద్యార్థులపై లాఠీ చార్జీ చేయడంతోపాటు ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు పార్లమెంట్‌లో గళం విప్పారని ప్రధాన మంత్రి అధికారిక నివాసం ముందు శాంతియుతంగా ధర్నాకు దిగితే వారిని కర్కషంగా అరెస్ట్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ చర్చ కార్యక్రమంలో వేణుగోపాల్, లక్ష్మణ్ రావు, ప్రముఖ డాక్టర్లు చాట్ల శ్రీధర్, వొద్దె రాంరెడ్డి, రమణారెడ్డి, పి.కిషన్ రావు, ఎల్లారెడ్డి, బోయిని అశోక్‌తోపాటు పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆరుతడి పంటలపై రైతులు దృష్టి

### అధికారులు ఎల్‌నినోపై అవగాహన కల్పించాలి

### అధికారులను, రైతులకు సూచించిన మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హుస్నాబాద్ :** రాష్టంలో ఈ సారి ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు పడకపోవడంతో ఎలాంటి ఇబ్బందులు రాకుండ రైతులు ఆరుతడి పంటలపై దృష్టి పెట్టాలని నీటి తీవ్రతపై అధికారులు వారికి అవగాహన కల్పించాలని రైతులను, అధికారులను మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. గురువారం హుస్నాబాద్ ఇంటిగ్రెటెడ్ కార్యాలయ భవన సముదాయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ నియోజకవర్గ పరిదిలోని 7 మండలాల్లో ఎల్ నినో ప్రభావం ప్రత్యేక ఏర్పాట్లుపై సిద్దిపేట, కరీంనగర్, హన్మకొండ జిల్లాల కలెక్టర్‌ర్లులు , జిల్లాస్థాయి మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌మాట్లాడుతూ హుస్నాబాద్ అంటేనే కరవుతో కూడుకున్న నేల అందులో వర్షాలు రాక పోవడంతో ఎల్‌నినో ప్రభావంతోమరింత కరువు ఏర్పాడే అవకాశం ఉన్నందున సమస్యలు రాక ముందే ఏం చేయాలనే దానిపై దిశనిర్దేశం చేశారు. ప్రతి శాఖల అధికారులు కరువు నివారణ కోసం ముందే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. కరీంనగర్, హన్మకొండ, సిద్దిపేట జిల్లా కలెకక్టర్లు ఎల్‌నినో ప్రభావంతో కరవును ఏలా నివారించాలనే ఆలోచనతో ముందు ఉన్నారని అన్నారు. కరువు తీవ్రత ఎక్కువగా ఉంటే తాగునీరు సాగు, పశు గ్రాసంపై ఉంటుందని దాన్ని నివారించేందుకు ఆరుతడి పంటలు వేసేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను కోరారు. మంజూరైన అభివృద్ధి పనుల వేగంగా పూర్తి చేయాలన్నారు. వీటితో పాటు ప్రారంబమైన పనులు వెంటనే పూర్తి చేయాలని అధికారులను కోరారు. ఈ సమావేశంలో సిద్దిపేట కలెక్టర్ కె హైమవతి, కరీంనగర్ కలెక్టర్ చిత్రామిశ్రా, హన్మకొండ కలెక్టర్ చాహత్‌భాజ్‌సాయి, ఆర్‌డివో రాంమూర్తి,తో పాటు అన్ని శాఖల అధికారులు పాల్గోన్నారు.



**రాష్టంలో సమృద్ధిగా వర్షాలు కురువాలని మంత్రి హుస్నాబాద్‌లో ప్రత్యేక పూజలు:** రాష్టంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని పాడి పంటలతో పచ్చని పొలాలతో చెరువులు కుంటలు నీటితో నిండి కళకళాడాలని ప్రజలంతా ఆ యురారోగ్యాలతో సుఖశాంతులతో జీవించాలని కోరుతూ గురువారం హుస్నాబాద్ పట్టణంలోని ఆయ్యప్ప దేవాలయంలో 108 మంది రుత్వికులతో 21 హోమ గుండాలతో నిర్వహించిన శ్రీ వారాహిమూల మంత్ర హోమ గుండాలతోహోమహా యజ్ఞంలో పాల్గోని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆనంతరం శ్రీక్రిష్ణ మందిరంలో, మరకత రాజారాజ్వేరా ఆలయాంలో 108 కలశాలతో వరుణ యాగం చేసి రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులు కుంటలు నిండి మంచి జలశాలతో రైతులు ఆనందంతో ఉండాలనిప్రార్థించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన ప్రతి పని ఏలాంటి ఆటంకం లేకుండ ముందుకు సాగాలని , మంచి వానాలు పడి రైతులు సంతోషంగా ఉండాలని కరువు కాటకాలు లేకుండ చూడలని దేవున్ని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ దండి లక్ష్మి కొమురయ్య, వైస్‌చైర్మెన్ పద్మ, కౌన్సిలర్లు, నాయకులు పండితులు పాల్గోన్నారు.

## కార్మికులకు న్యాయం జరిగే విధంగా వైద్య పరీక్షలు

### సింగరేణి అధికారులకు ఎఐటియుసి వినతి



**ప్రజాపక్షం/రామగిరి :** గురువారం అర్జీ3 ఏరియాలోని సింగరేణి కార్మికుల సమస్యలపై ఆయా గనుల సింగరేణి అధికారులకు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గుర్తింపు సంఘం ఏఐటీయూసీ యూనియన్ వినతి పత్రాలు అందజేశారు.తధానంతరం వారు మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం మెడికల్ బోర్డు పరీక్షల్లో పారదర్శకత పాటించాలని, కార్మికులకు న్యాయం జరిగే విధంగా వైద్య పరీక్షలు నిర్వహించాలని,అన్యాయమైన ఇన్వాలిడేషన్ నిర్ణయాలను పునఃసమీక్షించాలని యాజమాన్యాన్ని కోరారు.ఇటీవల నిర్వహించిన మెడికల్ బోర్డులో 20% ఇన్వాలిడేషన్ విధానాన్ని వ్యతిరేకిస్తూ,పాత పద్ధతి విధానం లాగా 80% ఇన్వాలిడేషన్ చేయాలనీ బోర్డు కు ఎక్కువ సంఖ్యలో కార్మికులను పిలవాలనీ కోరారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న అర్జీ3 ఏరియా బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ బండారి క్రాంతి, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ డిటి.రావు ఓసిపి1 ప్రాజెక్ట్, ఓసిపి2, ఎఎల్పిమైన్, సిహెచ్ పి అన్ని గనుల పిట్ కార్యదర్శిలు,ఈ.గంగాధర్ ,సురేష్ ,జీ.శ్రీనివాస్,అసిస్టెంట్ పిట్ కార్యదర్శులు,జియం కమిటీ సభ్యులు,వర్క్ మెన్ ఇన్స్పెక్టర్, సేఫ్టీవర్క్ కమిటీ మెంబర్స్, క్యాంటీన్ టెంపుల్ కమిటీ మెంబర్స్,కార్మికులు పాల్గొన్నారు.

## రైతులు ఆరుతడి పంటలు సాగుచేసుకోవాలి

**ప్రజాపక్షం/ధర్మపురి :** ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటలు సాగుచేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ తెలిపారు.ధర్మపురి రైతు వేదికలో గురువారం ధర్మపురి డివిజన్ లోని వివిధ మండలాల వ్యవసాయాధికారులు,విస్తరణాధికారులతో ఎల్ నినో ప్రభావం,ఆరుతడి పంటల ప్రణాళికపై జిల్లా వ్యవసాయ అధికారి నేతృత్వంలో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులు ఉండే అవకాశం ఉన్నందున రైతులు వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలైన కంది,మొక్కజొన్న, పెసర,మినుము,జొన్న,వేరుశనగ వంటి ఆరుతడి పంటలు సాగుచేసేలా రైతులను చైతన్యపరచాలని సూచించారు. రైతులకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆత్మ డీపిడి జాన్ సుధాకర్,ధర్మపురి ఏడిఎ రాంచందర్,ఏఓ లు,ఏఈఓలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సేవల్లో మరింత జవాబుదారీతనం అవసరం

### కలెక్టర్ కోయ శ్రీహర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్:** ప్రభుత్వ శాఖల పనితీరు క్షేత్రస్థాయిలో మెరుగుపడి ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన సేవలు అందేలా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు.గురువారం పెద్దపల్లి, ధర్మారం, జూలపల్లి మండలాల్లో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్ పెద్దపల్లి పట్టణంలోని ప్రగతి నగర్ ఎంపీపీఎస్ పాఠశాల, ప్రభుత్వ సమీకృత సంక్షేమ బాలికల హాస్టల్ సముదాయం, పెద్దపల్లి మండలంలోని బ్రాహ్మణపల్లి ఎం.పీ.పీ.ఎస్, జడ్పీ.హెచ్.ఎస్, అంగన్‌వాడీ కేంద్రం, రాగినేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రాగినేడు జడ్పీ.హెచ్.ఎస్, బొంపల్లి జడ్పీ.హెచ్. ఎస్ ప్రాథమిక పాఠశాల, ధర్మారం మండలంలోని పైడి చింతలపల్లి గ్రామంలో జరుగుతున్న భూముల రీ సర్వే, జూలపల్లి మండలంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి చదవడం, రాయడం, వంటి ప్రాథమిక నైపుణ్యాలు పూర్తిస్థాయిలో సాధించేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి అదనపు బోధన అందించాలని, విద్యా ప్రమాణాల పెంపే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని సూచించారు.ప్రభుత్వ సమీకృత సంక్షేమ బాలికల హాస్టల్ సముదాయాన్ని పరిశీలించిన కలెక్టర్ విద్యార్థినులకు అందుతున్న ఆహారం, వసతి, పరిశుభ్రత, భద్రత, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. హాస్టళ్లలో ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలు నాణ్యతతో అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.బ్రాహ్మణపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల ఎదుగుదల, పోషకాహార పంపిణీని పరిశీలించిన కలెక్టర్ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం, గుడ్లు, పాలు తదితర ఆహారాన్ని సకాలంలో అందించాలని సూచించారు. ప్రతి చిన్నారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. గ్రామసభల ద్వారా రైతులకు రీ సర్వే ప్రయోజనాలను వివరించి ప్రజల పూర్తి సహకారంతో ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు.జూలపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ రెవెన్యూ శాఖలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, ఇతర పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.ప్రజలకు జాప్యం లేకుండా పారదర్శకంగా, వేగవంతంగా సేవలు అందించడం ప్రతి అధికారికి బాధ్యత అని స్పష్టం చేశారు.ఈ పర్యటనలో సంబంధిత శాఖల అధికారులు,మండల అధికారులు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నేతల నిరసన ర్యాలీ ధర్నా



**ప్రజాపక్షం / రామడుగు:** ఏఐసిసి అగ్ర నాయకులు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తదితర సీనియర్ నాయకులు నీట్ పరీక్ష లీకేజీపై విద్యార్థులకు మద్ధతుగా ఢిల్లీలోని ప్రధాని నరేంద్ర మోడీ నివాసం వద్ద శాంతియుతంగా ధర్నా చేస్తున్న తమ నేతలను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ మండల కాంగ్రెస్ నేతలు గురువారం మండల కేంద్రంలో శాంతియుత వాతావరణంలో ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ నీట్ పరీక్షను రద్దు చేసి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించిన విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు విచక్షణరహితంగా దాడి చేసి టియర్ గ్యాస్ ప్రయోగించి ఇష్టానుసారంగా ప్రవర్తించిన బిజేపి కేంద్ర ప్రభుత్వ తీరుపట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు ఈ నిరసనలు ఆగవని, నీట్ పరీక్షను కేంద్ర ప్రభుత్వం కాకుండా రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించేలా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జవ్వాజి హరీశ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పిండి సత్యం, సర్పంచులు దావ అనంతరెడ్డి, మెయిజ్ నాయకులు అంజనీ ప్రసాద్, వెన్న రాజమల్లయ్య, పంజాల శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచులు గునుగొండ అశోక్, కాడె శంకర్, అనుపురం పరశురాం గౌడ్ తోపాటు మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, మార్కెట్ కమిటీ తాజా మాజీ డైరెక్టర్లు, గ్రామశాఖ అధ్యక్షులు, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపల్లి ఎఐవైఎఫ్ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక




**ప్రజాపక్షం/పెద్దపల్లి:** పెద్దపల్లి జిల్లా అఖిల భారత యువజన సమైక్య (ఏఐవైఎఫ్) నూతన కమిటీని ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా అధ్యక్షులు గా ఆసాల నవీన్, ప్రధాన కార్యదర్శిగా ఆరెపల్లి మానస్ కుమార్, ఉపాధ్యక్షులుగా తాళ్లపల్లి సురేందర్, సహాయ కార్యదర్శిగా మాచర్ల అంజి, కోశాధికారిగా ఖాజా, వీరితో పాటు 25 మందితో కౌన్సిల్ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన వారిని ఉద్దేశించి వలి ఉల్లా ఖాద్రి మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలో యువజన సంఘాన్ని ప్రతి గ్రామంలో బలోపేతం చేసి యువజన హక్కుల సాధన కోసం యువతను కదిలించాలని,గ్రామ గ్రామాన యువజన సంఘాన్ని నిర్మించి రానున్న రోజుల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఇచ్చిన హామీల సాధన కోసం, నిరుద్యోగ భృతి,ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ కోసం యువతను చైతన్యపరిచి పోరాటాల వైపు తీసుకురావాలని ఆయన అన్నారు .అలాగే నీట్ పేపర్ లీకేజీ కుంభకోణం వలన 21 మంది అమాయక విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఈ ఆత్మహత్యలకు కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. విద్యార్థి యువతపై దాడికి పాల్పడిన పోలీసులపై విచారణ చేసి సస్పెండ్ చేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయించాలని అన్నారు. జూలై 24న విద్యార్థి సంఘాలు నిర్వహించే విద్యాసంస్థల బంద్ లో యువత,ప్రజలు మేధావులు,విద్యాసంస్థలు, తల్లిదండ్రులు,ప్రజాస్వామ్యవాదులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో ఆరెపల్లి మానస్ కుమార్.అసాల నవీన్, మాచర్ల అంజి,తాళ్లపల్లి సురేందర్. ఖాజా, చంద్రగిరి ఉదయ్,కల్లేపల్లి నవీన్,తుంగ రాజు, తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా ప్రక్రియను వేగవంతం: అదనపు కలెక్టర్

**ప్రజాపక్షం/కోరుట్ల :** జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ 'సర్' ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ బి ఎస్ లత బిఎల్ఓ లకు సూచించారు. నిర్దిష్ట గడువులోగా పనులను పూర్తి చేయడానికి క్షేత్రస్థాయిలో వేగం పెంచాలని సూచించారు. ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను ఎలాంటి ఆలస్యం లేకుండా పూర్తి చేయాలని కోరారు. గురువారం కోరుట్ల పట్టణంలోని పలు వార్డులు సందర్శించి బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు, రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు సమన్వయంతో పనులు వేగవంతం చేయాలని కోరారు. కోరుట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి జివాకర్ రెడ్డి మాట్లాడుతూ ఓటర్లు ఆన్‌లైన్‌లో ఫారాలు సమర్పిస్తే, హార్డ్ కాపీల కోసం వారిని ఇబ్బంది పెట్టవద్దని అన్నారు. ఫారాలు ఇచ్చేటప్పుడు ఆధార్ కార్డు తప్పనిసరి అని అనవసరంగా ఒత్తిడి చేయకూడదు. అని సూచించారు. కోరుట్ల నియోజకవర్గ ప్రజలు ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణప్రక్రియను మరింత వేగవంతం చేయాలని బీఎల్ఓ లకు నిర్దిష్ట సమయంలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ ఫరూక్,రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,రత్నాకర్,బి ఎల్ ఓ జి.రాధా,తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులు వేగవంతం

### అధికారులకు కలెక్టర్ సత్యప్రసాద్ సూచన



**ప్రజాపక్షం/ధర్మపురి:** ధర్మపురి మండలంలోని నేరెల్ల గ్రామ శివారులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తిచేయాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అన్నారు.ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను గురువారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.పాఠశాల నిర్మాణ పనులు పురోగతి, నాణ్యతా ప్రమాణాలు,భవన రూపకల్పన,తరగతి గదులు,వసతి గృహాలు,మౌలిక సదుపాయాల ఏర్పాట్లను సంబంధిత అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు.నిర్దేశిత గడువులోగా నిర్మాణ పనులు పూర్తి చేయడంతో పారు నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడవద్దని అధికారులను ఆదేశించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ద్వారా విద్యార్థులకు ఆధునిక విద్య, అత్యుత్తమ వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రతి పనిని అత్యంత బాధ్యతాయుతంగా పూర్తిచేయాలని సూచించారు. నిర్మాణ పనుల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు,తాగునీరు,విద్యుత్,పారిశుద్ధ్యం వంటి అంశాలను ప్లాన్ మ్యాప్ లో కలెక్టర్ పరిశీలించి పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్ష జరపాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మధుసూదన్, జిల్లా విద్యాధికారి కె.రాము,తహసీల్దార్ ఏరుకొండ శ్రీనివాస్,ఇంజనీరింగ్ శాఖ అధికారులు,సంబందిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

**'సర్' ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్**

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జగిత్యాల జిల్లాలో కొనసాగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (SIR)కార్యక్రమంలో భాగంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ తెలిపారు. గురువారం ధర్మపురి మున్సిపల్ లో 5వ వార్డులోని 33 పోలింగ్ స్టేషన్ పరిధిలో ఇంటింటా నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియను కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలించారు. బూత్ లెవల్ అధికారులు ఇప్పటికే ఇంటింటికి వెళ్లి ఫారాలను పంపిణీ చేయగా ఈ ఆగస్టు 3వ తేదీలోగా ఫారాలను సంబందిత బీఎల్ఓలకు అందజేయాలని కోరారు. ఫారాలు నింపడంలో ప్రజలకు సందేహాలు ఉంటే తమ పరిధిలోని బీఎల్ఓలను లేదా ఎన్నికల అధికారులను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. ఫారాల సేకరణ,డిజిటైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.వేరే ప్రాంతంలో ఓటు ఉన్నట్లయితే ఆ వివరాలను ఫారంలో పేర్కొనడం ద్వారా అవసరమైన మార్పులు చేసి సరైన నియోజకవర్గంలో ఓటును కొనసాగించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు ఒకవేళ ఫారాలు సమర్పించకుండా, ఎలాంటి స్పందన ఇవ్వకపోతే ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పరిశీలన అనంతరం ఓటరు జాబితానుండి పేరు తొలగించబడే అవకాశం ఉందని అన్నారు.అర్హులైన ప్రతి ఓటరు ఆగస్టు 3 లోపు ఫారాలను పూర్తిగా నింపి సంబందిత బీఎల్ఓకు అందజేసి తమ ఓటుహక్కును పరిరక్షించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్,తహశీల్దార్ ఏరుకొండ శ్రీనివాస్, బీఎల్ఓలు పాల్గొన్నారు

## అరెస్టులకు నిరసనగా కాంగ్రెస్ ధర్నా



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ పట్టణంలోని తెలంగాణ తల్లి చౌక్ వద్ద కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగిలి శంకర్ ఆధ్వర్యంలో గురువారం నిరసన ధర్నా నిర్వహించారు.ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు ఈ ధర్నా చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థుల తరఫున నిలబడి న్యాయం కోరిన నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఆయన విమర్శించారు.పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీ ఘటనలతో విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్న కేంద్ర ప్రభుత్వాన్ని ప్రజలు క్షమించరని,బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు రాజూరా సత్యం, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి దొనికెని దయానంద్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కడార్ల గంగ నరసయ్య,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గొర్రె గంగాధర్,కాంగ్రెస్ నాయకులు మధిరే సత్యనారాయణషబ్బీర్ పాషా,భాషెట్టి నరసయ్య,నయీమ్ ఖాన్,పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు

### మెదక్ జిల్లాఎస్పి శ్రీనివాస రావు



**ప్రజాపక్షం/వెల్దుర్తి:** ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు వెల్దుర్తి పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా కరుణాకర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు,ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అం దజేశారు. వెల్దుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేందుకు అంకితభావంతో పనిచేయాలని ఎస్ఐ కరుణాకర్ రెడ్డికి సూచించారు. ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ విధులు నిర్వహి ంచాలని ఆయన తెలిపారు. నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించి, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని సూచించారు. ఇంతకు ముందు వెల్దుర్తి ఎస్ఐగా విధులు నిర్వహించిన రాజు జిల్లా పోలీస్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ బకాయిలు తక్షణమే పూర్తి

### అదనపు కలెక్టర్ రాములు



**ప్రజాపక్షం/జన్నారం :** జిల్లాలో సిఎంఆర్ బకాయిలను తక్షణమే పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ వి.రాములు మిల్లుల యాజమాన్యాలను ఆదేశించారు. గురువారం జన్నారం మండలం పొనకల్ గ్రామంలోని శ్రీ శివసాయి రాఘవేంద్ర రైస్ మిల్లు, మర్రిగూడలోని రాజరాజేశ్వరి రైస్ మిల్లుతో పాటు దండేపల్లి మండలం లింగాపూర్‌లోని శ్రీ కృష్ణ అగ్రో ఇండస్ట్రీస్, పెద్దపేటలోని భవాని ఇండస్ట్రీస్, కన్నెపల్లిలోని వెంకటేశ్వర పిబిఆర్ఎం, రాధాకృష్ణ ఇండస్ట్రీస్ రైస్ మిల్లులను తహసీల్దార్లతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025–26 వానాకాలం, యాసంగి సీజన్లకు సంబంధించిన పెండింగ్ బియ్యాన్ని వెంటనే మిల్లింగ్ చేసి ప్రభుత్వానికి అప్పగించాలని తెలిపారు. నిర్దేశిత గడువులోగా పూర్తి చేయని పక్షంలో ఆ ధాన్యాన్ని మెరుగైన పనితీరు కనబరిచే ఇతర మిల్లులకు తరలిస్తామని హెచ్చరించారు. జన్నారం, దండేపల్లి తహసీల్దార్ కార్యాలయాలను సందర్శించి ఎస్ఐఆర్ ప్రక్రియ, సాదాబైనామా, భూ భారతి, రెవెన్యూ సదస్సుల దరఖాస్తులను సమీక్షించారు. 60 రోజులకు పైగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ప్రాధాన్యతతో పరిష్కరించాలని ఆదేశించారు. ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను వేగవంతం చేసి పనులను గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. జన్నారం, దండేపల్లి మండలాల తహసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## 'సర్'లో పేరు సరిచూసుకోవాలి

### ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి



**ప్రజాపక్షం/బెల్లంపల్లి :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎస్ఐఆర్ లో తమ పేరు ఉందో లేదో చరవాణి ద్వారా సరిచూసుకోవాలని బెల్లంపల్లి శాసనసభ్యులు గడ్డం వినోద్ వెంకటస్వామి ప్రజలకు సూచించారు. చరవాణిలో ఇసిఐ అని టైప్ చేసి, వ్యవధి ఇచ్చి ఎపిక్ నంబర్ నమోదు చేసి 1950కు సందేశం పంపాలని తెలిపారు. వివరాలు వస్తే నమోదు పూర్తయినట్లేనని, రాకుంటే బిఎల్‌ఒను సంప్రదించాలని కోరారు. ఆగస్టు 3 లోపు ఇంటింటి సర్వే ముగుస్తుందని, ఆగస్టు 10న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదలవుతుందని స్పష్టం చేశారు.

## ఆరుతడి పంటలు సాగు చేయాలి

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** ఎల్‌నినో కారణంగా ప్రస్తుతం ఎదురవుతున్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని రైతులు ఆరుతడి పంటలు సాగును చేపట్టాలని మండల వ్యవసాయాధికారిని లావణ్య తెలిపారు. గురువారం వ్యవసాయ, ఉద్యానవన శాఖల సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు ఎల్‌నినో ప్రభావం, ఆరుతడి పంటల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ భారత వాతావరణ శాఖ సూచనల మేరకు ఈ యేడాది అత్యల్ప వర్షపాతం నమోదయ్యే అవకాశాలున్నందున రైతులు అందుబాటులోని సాగునీటి వసతులను సద్వినియోగం చేసుకుంటూ ఆరుతడి పంటల సాగును చేపట్టాలని సూచించారు. అత్యధిక నీటి అవసరముండే వరికి బదులుగా జొన్న, సజ్జ,వేరుశనగ, సోయాబీన్ లాంటి చిరుధాన్యాలు, నూనె గింజ పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. అలాగే తక్కువ సాగునీటి అవసరముండే పండ్లు, కూరగాయలు, పూలమొక్కల సాగుతో రైతులు నిరంతరాదాయం పొందవచ్చని సూచించారు. వ్యవసాయ విస్తీర్ణాధికారులు స్నేహ, దివ్య, రంజిత్, అరవింద్, మౌనిక, రోహిత్, నాగేష్, రైతులు పాల్గొన్నారు.



# వేగవంతంగా అభివృద్ధి పనులు

### కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం/మంచిర్యాల :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. గురువారం హాజీపూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి భోజనశాల, అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పోషకాహారం, పరిశుభ్రమైన తాగునీటిని అందించాలని, ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు. అనంతరం హాజీపూర్ తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి తహసిల్దార్ పుష్పలతతో కలిసి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పరిశీలించారు. ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరి వివరాలు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలని ఆదేశించారు. భూభారతి, సాదా బైనమా దరఖాస్తుల పరిష్కారంపై పలు సూచనలు చేశారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి గ్రామపంచాయతీల పనితీరు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, జలసిరి పనులపై సమీక్షించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని నిరంతరం నిర్వహించాలని, సిబ్బంది విధులకు సమయానికి హాజరై ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. అనంతరం లక్షెట్టిపేటలోని 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అత్యవసర విభాగం, వార్డులు, ల్యాబ్, మందుల నిల్వలను పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వర్షాకాలం దృష్ట్యా అంటువ్యాధుల పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. మున్సిపల్ పరిధిలో అమృత్ 2.0 పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్ ను ఆదేశించారు. లక్షెట్టిపేట కెజిబివి పాఠశాలను సందర్శించి అదనపు గదుల నిర్మాణ పనులను, వంటశాలను పరిశీలించారు. తహసిల్దార్ పుష్పలత, మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ అరెస్టును వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ నాయకుల నిరసన



**ప్రజాపక్షం/లక్ష్మ ణ చందా :** లక్ష్మ ణ చందా మండలంలోని ఎమ్మార్వో కార్యాలయం ముందు నీట్ పేపర్ లీకేజీ మరియు కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకు లైనటువంటి రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీల అరెస్టును వ్యతిరేకిస్తూ విద్యార్థుల మీద జరిగిన అమానుష దాడులను ఖండిస్తూ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోండ్ర నరేష్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు మండల కేంద్రంలో నిరసన ధర్నా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో అల్లోల సురేందర్ రెడ్డి,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నరేష్ రెడ్డి, నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి, వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్,రఘునందన్ రెడ్డి,ఓస రాజేశ్వర్,బీమ్ రెడ్డి, గురాల లింగారెడ్డి,బిట్లింగ్ రజినికాంత్,వెంకట్ రాజు,బూసి మహేష్,సుదర్శన్,పసుపుల నరేష్,సమ్మెట రవి,గణేష్,నారా గౌడ్, అస్గర్,సిరాజ్ భూమన్న,గంగయ్య,కార్యకర్తలు పాల్గొన్నారు.

## భూగర్భ జలాల పెంపుదలకు జలసిరి ఫామ్ పాండ్‌లు దోహదం

### కలెక్టర్ భవేశ్ మిశ్రా

**ప్రజాపక్షం/భైంసా :** జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా గురువారం కుబీర్ మండలం దోడర్న గ్రామంలో జలసిరి కార్యక్రమంలో భాగంగా,ఫామ్ పాండ్ నిర్మాణ శంకుస్థాపన చేశారు.గ్రామానికి చెందిన రైతు దంపతులు గోరేకర్ సంతోష్,సాగరలకు చెందిన వ్యవసాయ క్షేత్రంలో, ఫామ్ పాండ్ నిర్మాణానికి కలెక్టర్ గురువారం భూమిపూజ చేసి,శంకుస్థాపన చేశారు.ఫామ్ పాండ్ నిర్మాణానికి ముందుకు వచ్చిన రైతులను ఈ సందర్భంగా కలెక్టర్ శాలువాతో సన్మానించి,అభినందించారు.వారి వ్యవసాయానికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. భూగర్భ జలాల సంరక్షణకు ఫామ్ పాండ్ ల నిర్మాణాలు దోహదం చేస్తాయని వివరించారు.ప్రతి రైతు బాధ్యతగా తమ వ్యవసాయ క్షేత్రాల్లో ఫామ్ పాండ్ లు ఏర్పాటు చేసుకోవాలన్నారు.ప్రభుత్వం ఈ నిర్మాణాలకు ఆర్థిక సహాయం అందజేస్తుందని పేర్కొన్నారు.ప్రస్తుతం ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువ ఉన్నాయని,ఇటువంటి నీటి నిల్వ నిర్మాణాల వల్ల అత్యవసర పరిస్థితుల్లో పంటకు నీరు అందుతుందని తెలిపారు. భూగర్భ జలాలు పెరుగుతాయని చెప్పారు. రైతులు పెద్ద ఎత్తున ఫామ్ పాండ్ ల నిర్మాణానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

## 'సర్'లో 100 శాతం డిజిటలైజేషన్ పూర్తి

### జిల్లా కలెక్టర్ హరిత



**ప్రజాపక్షం/కాగజ్ నగర్ :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, మున్సిపల్ చైర్మన్లు మెంగ్రే ఆకాష్, షహీన్ సుల్తానాలతో కలిసి ఎస్ఐఆర్ ప్రక్రియపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 85.94 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని, మిగిలిన 14 శాతం పూర్తి చేసి 100 శాతం సాధించేందుకు రాజకీయ పార్టీలు, మున్సిపాలిటీ పాలకవర్గాలు సహకరించాలని కోరారు. కాగజ్ నగర్, ఆసిఫాబాద్ మున్సిపాలిటీల్లో ఇంకా చాలామంది ఎన్యుమరేషన్ ఫారాలు అందించాల్సి ఉందని, ఫారాలు ఇవ్వకపోతే ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఫారాలు ఇవ్వని వారి జాబితా ఆధారంగా రాజకీయ పార్టీలు దృష్టి సారించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వర్గీకరణతో పాటు మరణించిన వారు, గ్రామం వదిలి వెళ్లిన వారి జాబితాలను సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. బూత్ స్థాయి ఏజెంట్లు క్షేత్రస్థాయిలో సహకరించి నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, శిక్షణ ఉపపాలనాధికారి జాస్టిన్ జోన్, ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎం డి. అహ్మద్, ఎన్నికల విభాగం అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## వసతి గృహంలో విద్యార్థులకు ఆరోగ్యకర వాతావరణం

### మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**ప్రజాపక్షం/మెదక్ :** వసతి గృహంలో విద్యార్థులకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేలా ప్రతి రోజూ శుభ్రత చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ హాస్టల్ నిర్వాహకులను ఆదేశించారు.గురువారం చిన్న శంకరంపేట్ మండల క్షేత్రస్థాకి పర్యటన లో భాగంగా కలెక్టర్ షెడ్యూల్ కులాల (ఎస్‌సి) బాలుర వసతి గృహాన్ని కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆకస్మింగ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్లోని వంటగది, స్టోర్ రూమ్ ను కలెక్టర్ పరిశీలించి ఆహార పదార్థల నిల్వ, పరిశుభ్రతను తని ఖీ చేశారు. అనంతరం హాస్టల్ ఆవరణ, డ్రైనేజీ వ్యవస్థ, మరుగుదొడ్లు, ఇతర వసతుల ను పరిశీలించారు. హాస్టల్ విద్యార్థుల సంఖ్య, సిబ్బంది వివరాలు వార్డెన్ ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు పరిశుభ్రమైన ఆరోగ్యకరమైన వాతావరణం క ల్పించేలా హాస్టల్లో ప్రతిరోజూ శుభ్రత చర్యలు చేపట్టాలని, మరుగుదొడ్లు, హాస్టల్ గదులు పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మొక్కలు క్రమ పద్ధతిలో పెంచాలని తెలిపారు. ప్రభుత్వంచే మంజూరైన ఇంటిగ్రేటెడ్ నిధులను వా డుకొని సౌకర్యాలు సమర్థవంతంగా ఏర్పాటు చేయాలన్నారు. ట్యూబ్ లైట్లు మరికొన్ని ఏ ర్పాటు చేయాలని ఆదేశించారు. బయటి వ్యక్తులను హాస్టల్లోనికి అనుమతించరాదని తెలిపారు. కలెక్టర్ వెంట హాస్టల్ వార్డెన్ తులసీరామ్, ఎంపీడీఓ దామోదర్, సర్పంచ్ చంద్రశేఖర్ ఉన్నారు.

## 'సర్'కోసం 30 ప్రచార రథాలు

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

**ప్రజాపక్షం/పటాన్‌చెరు :** ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు అమూల్యమైనదని, ఓటు హక్కును పరిరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యతని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్చెరు నియోజకవర్గంలో అభివృద్ధి నిరంతరం కొనసాగటం కోసం అర్హులైన ప్రతి ఓటరు సర్ ప్రక్రియలో తప్పని సరిగా పాల్గొనాలని ,ఆగస్టు 3 వ తేది తరువాత తమ దరఖాస్తులను పూర్తి వివరాలతో సమర్పించాలని విజ్ఞప్తి చేశారు. జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సర్‌పై అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 30 ప్రచార రథాలకు జెండి ఊపి ప్రారంభించారు.ప్రకటన ప్రకారం ఈ రథాలు నియోజకవర్గంలోని తొమ్మిది డివిజన్లు ,మూడు మున్సిపాలిటీలు ,రెండు మండలాలన్ని వార్డుల వరకు చేరిప్రజలకు సర్ ప్రాముఖ్యతను తెలియజేస్తాయి. ముఖ్యంగా ప్రార్థన స్థలాలు,క్రీడా ప్రాంగణాలు, విద్యసంస్థలు ,పార్కులు, మార్కెట్లు పారిశ్రామిక ప్రాంతాలు, వంటి పరిసరాల్లో వివిధ ప్రచార మాధ్యమాల ద్వారా సమాచారం అందిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. సర్ ప్రక్రియలో పాల్గొనని వారు తమ విలువైన ఓటు హక్కును కోల్పోయే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు.బిఆర్ఎస్ నియోజకవర్గ కో –ఆర్డినేటర్, ఆదర్శరెడ్డి, ప్రజాప్రతినిధులు ,మాజీ ప్రజాప్రతినిదులు, పార్టీసీనియర్ నాయకులు, పాల్గొన్నారు.

## అధ్వాన్నంగా రైల్వే అండర్ బ్రిడ్జి పరిస్థితి

### స్పందించిన సర్పంచ్ హారిక అశోక్

**ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి :** కమ్మర్‌పల్లిలో నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జి పరిస్థితి అధ్వాన్నంగా మారింది. మంగళవారం దీనిపై ప్రజాపక్షంలో ప్రచురితమైన కథనానికి సర్పంచ్ కొత్తపల్లి హారిక అశోక్ స్పందించారు. గురువారం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో రైల్వే బ్రిడ్జి కింద ఉన్న పిచ్చి మొక్కలు, నీటిని జెసిబి సాయంతో తొలగించారు. రైల్వే అధికారులు స్పందించి నీటి నిల్వ పునరావృతం కాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని ప్రయాణీకులు ప్రజలు కోరుతున్నారు.




## రీ సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం

### కలెక్టర్ ప్రతిమా సింగ్



**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ జిల్లాలో భూముల రీ సర్వేతో భూ సమస్యలు ఇక చెల్లు అవుతాయని కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు. గురువారం మెదక్ మండలం కోంటూర్ గ్రామంలో భూభారతి భూముల రీ సర్వే లో గ్రామసభలో ఆదనపు కలెక్టర్ నగేష్, మెదక్ ఆర్డీఓ రమాదేవి, ఏడి ల్యాండ్ సర్వే కిషన్ రైతులతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. భూభారతి భూముల రీ సర్వే గ్రామసభలో కలెక్టర్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి మోకాపై సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నా రైతులకు ప్రభుత్వం లబ్ది చేకూర్చనుందని , అక్రమంగా పట్టాలు పొంది ప్రభుత్వ సంక్షేమ ఫలాలు పొందుతున్న వారికి ఇకపైన రద్దయ్యేలా చర్యలు చేపడతామని, నిజమైన రైతులకు న్యాయం చేస్తామన్నారు. భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సంబంధిత దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులను చూసి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రికార్డులు, మోకా, పట్టాదారుల వివరాలు ఇతర అంశాలను పరిగనలోకి తీసుకుని ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. మొదటగా గ్రామంలోని భూములకు సంబంధించి హద్దులు నిర్ధారిస్తామని, త ద్వారా గ్రామానికి సంబంధించిన భూమిస్పష్టత వస్తుందని, ప్రభుత్వ భూముల సైతం నిర్ధారణ అవుతాయన్నారు. పట్టా కలిగి ఉండి మోకాపై లేకపోవడం, మోకాపై ఉండి పట్టా కలిగి ఉండకపోవడం అంశాలపై ప్రత్యేక కమిటీ ఏర్పాటుకు చ ర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ భూ ములు ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

# తెలంగాణలో రోడ్డు భద్రతకు కేంద్రం పెద్దపీట

### నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లో బ్లాక్‌స్పాట్ల నివారణకు రూ.1023 కోట్లు, లోక్‌సభలో ఎంపి అరవింద్ ప్రశ్నకు మంత్రి నితిక్ గడ్కరీ సమాధానం

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** రాష్ట్రంలో జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు కేంద్ర ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపడుతోందని జిల్లా పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ తెలిపారు. రోడ్డు ప్రమాదాల బ్లాక్ స్పాట్ల నివారణ, రహదారి భద్రతా చర్యలకు సంబంధించి తాను లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఇచ్చిన సమాధానంలో కీలక వివరాలు వెల్లడయ్యాయని తెలిపారు. తెలంగాణలో గత కొన్నేళ్లలో ప్రమాదాల ఆదారంగా మొత్తం 1513 యాక్సిడెంట్ బ్లాక్‌స్పాట్లు గురిచగా వాటిలో 1308 బ్లాక్ స్పాట్లకు సంబంధించిన శాశ్వత నివారణ చర్యలు పూర్తయ్యాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించిందని ఎంపీ అరవింద్ తెలిపారు. మరో 205 బ్లాక్ స్పాట్లలో శాశ్వత నివారణ చర్యలు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని చెప్పారు.

### నిజామాబాద్, జగిత్యాల జిల్లాలకు ప్రత్యేక ప్రాధాన్యం

జిల్లాలో మొత్తం 78 ప్రమాదకర స్పాట్లు గుర్తించగా వాటిలో 75 ప్రాంతాల్లో నివారణ చర్యలు పూర్తయ్యాయని మరో 3 ప్రాంతాల్లో చర్యలు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని, అదేవిధంగా జగిత్యాల జిల్లాలో మొత్తం 107 ప్రమాదకర బ్లాక్‌స్పాట్లు గుర్తించగా అందులో 99 ప్రాంతాల్లో నివారణ చర్యలు పూర్తయ్యాయని, మరో 8 ప్రాంతాల్లో పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించిందని ఎంపి తెలిపారు. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన రహదారులు, సురక్షితమైన ప్రయాణమందించటమే తన ప్రధాన లక్ష్యమని ఎంపి అరవింద్ అన్నారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి అక్కడ శాశ్వత పరిష్కారాలు చూపించేందుకు కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సమన్వయం చేస్తామని తెలిపారు. నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లో జాతీయ రహదారుల అభివృద్ధి, బ్లాక్ స్పాట్ల నివారణ, వంతెనలు, బైపాస్‌లు, ఇతర రోడ్డు భద్రతా మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.1023 కోట్లు కేటాయించిందని ఎంపి అరవింద్ తెలిపారు. రోడ్డు భద్రతా పనులను వేగవంతం చేయడానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు.



## 24న రాష్ట్రవ్యాప్తంగా కళాశాలల బంద్

### వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు




**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలో ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ దిగంబర్,(పిడిఎస్‌యు) అధ్యక్షుడు సింగరి వెంకటేష్ మాట్లాడుతూ, దేశంలో విద్యా వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు.కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాల వల్ల విద్యార్థుల భవిష్యత్తు అంధకారంగా మారుతోందని వారు విమర్శించారు.

**ప్రధాన డిమాండ్లు ఢిల్లీ దాడులపై విచారణ:** ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన దాడుల పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.ఈ ఘటనలపై పారదర్శకమైన విచారణ జరిపించి దోషులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు.

**కేంద్ర మంత్రి రాజీనామా :** దేశవ్యాప్తంగా వరుసగా జరుగుతున్న క్వశ్చన్ పేపర్ లీకేజీలు,విద్యాశాఖ వైఫల్యాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలన్నారు.

**ఎన్‌టిఏ రద్దు :** విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ)ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగాన్ని ప్రైవేటీకరించేందుకు మరియు విద్యార్థుల హక్కులను కాలరాసేలా ఉన్న విబిఎస్ఏ బిల్లును వెంటనే వెనక్కి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.24న చేపట్టబోయే కళాశాలల బంద్‌ను జయప్రదం చేయాలని, యాజమాన్యాలు కూడా బంద్‌కు సహకరించి స్వచ్ఛందంగా కళాశాలలను మూసివేయాలని విద్యార్థి నాయకులు కోరారు.

# తాగునీటి ఎద్దడిలేకుండా పటిష్ఠ చర్యలు

### ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/కొణిజర్ల :** రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో వాతావరణ పరిస్థితుల వల్ల ఖమ్మం జిల్లా ప్రజలు తాగు నీటి ఎద్దడి ఎదుర్కోకుండా పటిష్ట చర్యలు తీసుకుంటు న్నట్లు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క తెలిపారు. మండల పరిధిలోని తనికెళ్ల లోగల ఎన్‌ఎస్‌పి లాకులవ ద్దకు చేరుతున్న గోదావరి జలాలను గురువారం భటివి క్రమార్క స్వయంగా క్షేత్రస్థాయిలో వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్, జిల్లా కలెక్టర్ దివా కర్ టిఎస్, సిపి సునీలదత్ తో కలిసి పరిశీలించారు. గోదావరి జలాలు ఎన్ని టిఎంసిలు వస్తున్నాయి? కెనాల్ పరిధిలో ఎన్ని చెరువులు ఉన్నాయి? ఎన్‌ఎస్‌పి కెనాల్ పరిధిలో ఉన్న చెరువులు నింపేందుకు కృషి చేయాలని ఇరిగేషన్ శాఖ అధికారులతో చర్చించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షా భావ పరిస్థితులకనుగుణంగా ఆరుతడి పంటలు సాగుచేసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం ఉన్న నీటిని తాగునీటి అవసరా లకు మాత్రమే ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. తొలుత తనికెళ్ల గ్రామ సర్పంచ్ గడల కళావతి భట్టిని శాలువాలతో ఘనంగా సన్మానించి బొకేను అందించారు. గ్రామానికి సంబంధించిన పలు సమస్యలపై ఆయనకు వివరిం చారు. ఈ కార్యక్రమంలో వివెంకటాయపాలెం సర్పంచ్ కాపా ఆదినారాయణ, బోడియాతండా సర్పంచ్ వడ్డియా భద్రకాళి, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఇరిగేషన్ శాఖ ఎఈ వంకటేశ్వర్లు, ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కమిటి చైర్మన్ యరగర్ల హనుమంతురావు, రాష్ట్ర హస్తకళల సంస్థ మాజీ చైర్మన్ నాయుడు సత్యనా రాయణ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కొణిజర్ల తహశీల్దార్ నారపోగు అరుణ, ఆర్‌ఐ నరేష్, కాంగ్రేస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు నూతి సత్య నారాయణ, తనికెళ్ల ఉపసర్పంచ్ చల్లా నరసింహారావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 28, 29 తేదీల్లో అతిథి అధ్యాపక ఇంటర్వ్యూలు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం ఎస్‌ఆర్‌అండ్‌బిజిఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2026 –27 విద్యా సంవత్సరానికి సంబంధించి అతిథి అధ్యా పక ఎంపిక కోసం 28, 29 తేదీలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళా శాల ప్రిన్సిపాల్ మహ్మద్ జాకీరుల్లా ఒక ప్రకటనలో తెలిపారు. 28న కంప్యూటర్ సైన్స్ అప్లికేషన్స్, డేటా సైన్స్, బిసిఏ, బిబిఏ, బిజినెస్, గణితం, ఇంగ్లీష్ పోస్టులకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. 29న బయోటెక్నా లజీ, తెలుగు, పొలిటికల్ సైన్స్, హిస్టరీ, ఎకనామిక్స్ పోస్టులకు ఇంట ర్వ్యూలు జరుగుతాయని జాకీరుల్లా తెలిపారు.

## భూముల రీ సర్వేకు రైతులు సహకరించాలి

### కలెక్టర్ అంకిత్



**ప్రజాపక్షం/పాల్వంచ :** భూముల రీ సర్వేకు రైతులు పూర్తి స్థాయిలో సహకరించి సర్వే సమయంలో అధికారులకు తమ భూములకు సంబంధించిన పట్టాదారు పాస్ బుక్‌లు, రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇతర ఆధారాలను అందించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. పాల్వంచ కరకవాగులో గల సర్వే నెంబర్ 727లో కొనసాగుతున్న భూ రీసర్వేను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా భూ రీసర్వే పనుల పురోగతి, అనుసరిస్తున్న విధానం, భూముల హద్దుల నిర్ధారణ తది తర వివరాలను సంభంధిత అధికారులను అడిగి తెలుసుకొన్నారు. ప్రతీ రోజు 42 నుండి 50 ఎకరాలలో రీ సర్వే నిర్వహిస్తున్నామని ఇప్పటి వరకు 580 ఎకరాలలో సర్వే పూర్తి చేశామని మిగతా 750 ఎకరాలలో సర్వే చేయాల్సి ఉందని సంబంధిత అధికారులు కలెక్టర్‌కు తెలియజేశారు. అనం తరం కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వే పనులను మరింత వేగవంతం చేయా లని, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతీ భూమి హద్దు లను సంబంధిత రైతుల సమక్షంలోనే గుర్తించి సర్వే చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం రైతుల ప్రయోజనాల కోసమే భూ రీ సర్వే చేపట్టిందని చెప్పారు. భూముల హద్దులను నిర్ధారించే సమయంలో రైతులు క్షేత్ర స్థా యిలో అందుబాటులో ఉండి అధికారులకు అవసరమైన పత్రాలను చూపె ట్టాలన్నారు. భూ రీ సర్వే పూర్తి అయితే భూముల హద్దులపై స్పష్టత ఏర్పడి భూ వివాదాలు తగ్గడంతో పాటు భూ రికార్డులు మరింత పారదర్శకంగా ఉంటాయని తెలిపారు. భూ రీ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవా లని, అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీ ల్దార్ ప్రసాద్, సర్వేయర్లు, రైతులు, అధికారులు పాల్గొన్నా రు.

## భద్రాద్రివ్యాప్తంగా ప్రత్యేక నాకాబందీ

### 3,714 వాహనాల తనిఖీ, 764 స్పాట్ చలానాలు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలో ఏకకాలంలో పోలీసులు గురు వారం ప్రత్యేక నాకాబందీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ, గంజాయి అక్రమరవాణా అరికట్టేందుకు రోడ్డు భద్రత లక్ష్యంగా వాహనాలు తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు, ఫింగర్ ప్రింట్ డివైజ్‌తో పాత నేరస్తుల గుర్తింపు చేపట్టారు. ఈ తనిఖీల్లో మొత్తం 3,714 వాహనాలను పరిశీలించగా 510 మంది లైసెన్సులు లేకుండా వాహనాలు నడపడం, 524 మంది హెల్మెట్ లేకుండా, 106 మంది సీటుబెల్టు లేకుండా ప్రయాణించడం, 14 మంది మైనర్లు వాహ నాలు నడపడంతో పాటు 7 మంది డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోద య్యాయి. 764 మందికి స్పాట్ చలాన్లు విధించి 1,567 వాహనాల నుండి జరిమానాలు వసూళ్లు చేశారు. అదేవిధంగా చోరీకి గురైన ఒక ద్విచక్ర వాహనాన్ని గుర్తించి స్వాదీనం చేసుకున్నారు. 15 అనుమతి లేని వాహ నాలు, 7 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, హెల్మెట్, సీట్ బెల్టు తప్పని సరిగా ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని ఈ సందర్భంగా ఎస్‌పి రోహిత్ రాజ్ సూచించారు. జిల్లాలో ఇలాంటి ప్రత్యేక తనిఖీలు ఇక నుండి నిరంతరా యంగా కొనసాగుతాయని చెప్పారు.

## ప్రత్యామ్నాయ పంటల సాగు లాభదాయకం

### జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య



**ప్రజాపక్షం/కూసుమంచి:** ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో రైతులు వరి సాగుపై పూర్తిగా ఆధారపడకుండా ప్రత్యా మ్నాయ పంటలను సాగు చేయాలని ఖమ్మం జిల్లా వ్యవ సాయ అధికారి పుల్లయ్య సూచించారు. కిష్టాపురం లో నిర్వహించిన రైతుల అవగాహన కార్యక్రమంలో ఆయన మా ట్లాడుతూ మండలంలో సాధారణం కంటే 56శాతం తక్కువ వర్షపాతం నమోదైన నేపథ్యంలో పెసర, కంది, జొన్న, ఆముదం వంటి తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలని తెలిపారు. అలాగే వర్షపు నీటిని నిల్వ చేసుకునేందుకు ఫార్మ్ పాండ్లు ఏర్పాటు చేసుకోవాలని, ప్రభుత్వం అందిస్తున్న రాయితీ పథ కాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్ర మంలో గ్రామ సర్పంచ్ సైదులు, మండల వ్యవసాయ అధికారి వాణి, వ్యవ సాయ విస్తరణ అధికారి జానీతో పాటు రైతులు పాల్గొన్నారు.

## కస్నాతండాలో మోటర్ల వైర్లు చోరీ

### రూ.72వేల విలువగల వైర్లు అపహరణ



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మం రూరల్ మండలం కస్నాతండాలో వైరు దొంగలు మరోసారి రెచ్చిపోయారు. రాత్రి వేళలో వ్యవసాయ బోర్లకు అమ ర్చిన విద్యుత్ మీటర్ వైర్లను అపహ రించి రైతులకు భారీ నష్టం కలిగిం చారు. ఈ ఘటన తొమ్మిది మంది రైతు లకు చెందిన సుమారు రూ.72వేల విలువైన కరెంట్ మీటర్ వైర్లు చోరీకి గురయ్యాయి. బాధిత రైతులు ఆకేరు పరివాహక ప్రాంతంలో పంట సాగు చేస్తున్నారు. పంటలకు నీరందించేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ మోటా ర్లకు అమర్చిన మీటర్ వైర్లనే లక్ష్యంగా చేసుకుని దుండగులు చోరీకి పాల్ప డ్డారని రైతులు వాపోయారు. ఆకేరు పరివాహక ప్రాంతం నిర్మానుష్యంగా ఉండటం, రాత్రి వేళ్లలో ఎవరూ సంచరించకపోవడంతో దొంగలు ఈ ప్రాంతాన్ని అడ్డాగా మార్చుకున్నట్లు సమాచారం. వరుస ఘటనలతో రైతులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. వ్యవసాయ సీజన్‌లో ఇలాంటి చోరీలు రైతులకు తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి వేళల్లో గస్తీని పెంచి, వైరు దొంగల ముఠాను వెంటనే పట్టుకొని చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

## ఓటుహక్కుపై సిపిఐ విస్తృత ప్రచారం

### 'సర్' ప్రక్రియపై గడపగడపకూ అవగాహన
### అర్హులకు ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం
### ఎస్‌కె. సాబీర్ పాషా



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్‌ఐఆర్) ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించేం దుకు సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి ఆధ్వర్యంలో విస్తృత ప్రచార కార్యక్రమాన్ని చేపట్టినట్లు సిపిఐ జిల్లా కార్య దర్శి ఎస్‌కె. సాబీర్ పాషా తెలిపారు. కొత్తగూడెం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ప్రధాన బస్తీలు, గ్రామాల్లో 5 ప్రచార ఆటోల ద్వారా మైకు ప్రచారాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజా స్వామ్యంలో ఓటుహక్కు అత్యంత విలువైనదని ఓటరు నమోదు ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తే భవిష్యత్‌లో హక్కును కోల్పోయే ప్రమాదం ఉంద న్నారు. ఎన్యూమరేషన్ ఫారాలను సరైన వివరాలతో నింపి తిరిగి ఎన్నికల అధికారులకు అందించే బాధ్యతను ప్రతీ పౌరుడూ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వాటిని సరిగా సమ ర్పించకుంటే ఎదురయ్యే నష్టాలను, ప్రక్రియ షెడ్యూల్‌లో విశేషాలను మైకుల ద్వారా వీధి వీధినా వివరిస్తున్నట్లు తెలి పారు. ఓటు హక్కు పరిరక్షణే లక్ష్యంగా పెట్టుకుని పార్టీ పనిచేస్తుందన్నారు. స్థానిక శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు ప్రాతినిధ్య నియోజకవర్గంలో అన్ని రంగాల్లోనూ శీఘ్రగతిన అభివృద్ధి పనులు జరుగుతున్నా యని తెలిపారు. అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలంటే ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రజ లు భాగస్వామ్యం ఓటుహక్కు నమోదు అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రత్యేక సవరణ ప్రక్రియ పూర్తయ్యేం త వరకు నియోజక వర్గవ్యాప్తంగా తమ పార్టీ ప్రచారాన్ని నిరంతరాయంగా కొన సాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలి

### వామపక్ష యువజన సంఘాల పిలుపు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఢిల్లీలో యువజన విద్యార్థులపై జరిగిన దాడికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ 24న విద్యార్థి సంఘాలు తలపెట్టిన బంద్‌ను జయప్రదం చేయాలని వామపక్ష యువజన సంఘాలు పిలుపునిచ్చాయి. ఎఐవైఎఫ్, డివైఎఫ్ఐ, పివైఎల్ ఆధ్వర్యంలో రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో యువజన సంఘాల సమావేశం జరిగింది. నీట్ లీకేజీ కారణంగా 21 మంది అమాయకులు ఆత్మ హత్యలు చేసుకున్నారని ఇందుకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. విద్యార్థి,యువతపై జరిగిన దాడికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ సమావేశంలో యువజన సంఘాల నాయకులు మామిళ్ల శ్రీనాథ్‌రెడ్డి, ఎన్‌వి రాకేష్, జక్కుల భరత్, మద్దోజు శ్రవణ్, చింతల రమేష్, డి.అశోక్, మామిడాల కిరణ్, శ్రీకాంత్, ప్రణయ్ పాల్గొన్నారు.

## న్యాయ వ్యవస్థ గౌరవాన్ని పోగొట్టుకుంది

### యువజన, విద్యార్థుల ఆందోళనకు సంపూర్ణ మద్దతు
### సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అనుచిత వ్యాఖ్యలతో దేశంలోని న్యాయ వ్యవస్థ గౌరవాన్ని పోగొట్టుకుంటుందని సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తెలిపారు. దేశాన్ని అట్టుడికిస్తున్న జంతర్ మంతర్ ఆందోళనలకు సంబంధించిన వీడి యోలు చూసే తీరిక కానీ కేసు వినే సమయం కానీ లేదని ప్రధాన న్యాయ మూర్తి వ్యాఖ్యానించడం శోచనీయమని, ఎవరి మెప్పు కోసం ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారో అర్థం కావడం లేదని ఆయన తెలిపారు. గురువారం సిపిఐ (ఎంఎల్)మాస్‌లైన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రంగారావు మాట్లాడుతూ.. కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వ ర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న నిరసన ప్రదర్శనకారు లపై పోలీసులు సాగించిన దమనకాండను మాస్‌లైన్ పార్టీ తీవ్రంగా ఖండి స్తుందని దీనిపై న్యాయ విచారణకు డిమాండ్ చేస్తున్నామన్నారు. శాంతి యుతంగా తమ డిమాండ్ల సాధన కోసం ఆందోళన చేస్తున్న వారిపై లాఠీ ఛార్జ్, బాష్పవాయువు ప్రయోగాన్ని తాము తీవ్రంగా నిరసిస్తున్నామ న్నారు. విద్యార్థిని మరణానికి మోదీ ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఇది రాజ్యం చేసిన హత్యగా రంగారావు అభివర్ణించారు. కేంద్ర, రాష్ట్ర ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యా హక్కును కేంద్ర ప్రభుత్వం అభిప్రాయ సేక రణ చేయకుండానే ఆధిపత్యంలోకి తీసుకుని నీట్ పరీక్షను నిర్వహించడం ప్రారంభించిందని ఆయన తెలిపారు. ఈ ఏడాది 23 లక్షల మంది విద్యా ర్థుల భవితవ్యాన్ని ప్రశ్నార్థకం చేసేవిధంగా ప్రశ్నా పత్రం లీకై దేశ వ్యాప్తంగా 20 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని మోదీ ప్రభుత్వం దీనిపై కనీసం పశ్చాత్తాపం తెలిపే పరిస్థితిలో కూడా లేదన్నారు. కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయా లని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థులు, యువజనులు ప్రజాస్వామ్యబ ద్ధంగా చేస్తున్న ఆందోళనకు తమ మద్దతు ఉంటుందన్నారు. మీడియా సమావేశంలో సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ నాయకులు కె.జి. రాంచందర్, కె. రంగయ్య, కె. రమా, గుమ్మడి నర్సయ్య, వి. కృష్ణ, పద్మ, చిన్న చంద్రన్న, చంద్ర అరుణ, గోకినేపల్లి వెంకటేశ్వరరావు, కె. సూర్యం పాల్గొన్నారు.




## విద్యార్థులపై లాఠీఛార్జి అమానుషం

### ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఫహీమ్ దాదా




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** విద్యార్థులపై జరిగిన లాఠీఛార్జిని ఖండిస్తూ కేంద్ర ప్రభుత్వం వెంటనే విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయాలని ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఫహీమ్ దాదా డిమాండ్ చేశారు. న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీ సులు జరిపిన అక్రమ నిర్బంధాలు దమనకాండకు నిరసనగా గురువారం రామ వరంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగబద్దంగా నిరసన తెలపడం విద్యార్థుల హక్కని దానిని అణచివేసేలా బారికేడ్లు ఏర్పాటు చేసి అడ్డుకోవడం మోదీ ప్రభుత్వ నిరంకుశత్వానికి నిద ర్శనం అన్నారు. ఎన్‌డిఏ అవినీతి వరుస పరీక్షా కుంభకోణాల వల్ల 17 మంది నీట్ పరీక్ష రాసిన విద్యార్థులు ప్రాణాలు కోల్పోయినా కేంద్రం నిమ్మకు నీరెత్తిన ట్లుగా ఉందన్నారు. దేశభవిష్యత్‌ను నిర్మించే విద్యార్థులను నేరస్తులుగా చూడటం మానకోవాలని నిరసన హక్కులను కాలరాసే చర్యలను తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా ఉపాధ్య క్షులు ఖయ్యూమ్ జావీద్, కొచ్చర్ల రాకేష్, ప్రసాద్, రవి, శివ, యాకూబ్ పాషా, చంటి, సతీష్, వంశీ, ఇస్మాయేల్, శేఖర్, అఖిల్ పాల్గొన్నారు.

## భట్టి పర్యటనను విజయవంతం చేయండి

### ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పిలుపు

**ప్రజాపక్షం/మణుగూరు:** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక మరియు విద్యుత్ శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క నేడు పినపాక నియోజకవర్గంలోని మణుగూరులో పర్యటించనున్న నేపథ్యంలో, నియో జకవర్గ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కోరారు. ఉప ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా బిటిపిఎస్‌లో టిజి జెన్‌కో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డిఎవి పబ్లిక్ స్కూల్‌ను ప్రారంభించడం, అనంతరం సింగరేణి ఓపెన్‌కాస్ట్ మరియు అండర్‌గ్రౌండ్ గనులను పరిశీలించడం, బొగ్గు ఉత్పత్తి, నాణ్యత, భవిష్యత్ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ పర్యటన పినపాక నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కీలకమని పేర్కొంటూ, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయ కులు, కార్యకర్తలు, సింగరేణి కార్మికులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు.

## ఢిల్లీలో పోలీస్ హింసాకాండపై న్యాయ విచారణ జరిపించాలి

### విద్యార్థిని మరణానికి ప్రభుత్వానిదే బాధ్యత
### సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న యువ జన, విద్యార్థులపై పోలీసులు సాగించిన హింసాకాండను సిపిఐ తీవ్రంగా నిరసిస్తుందని ఇందుకు సంబంధించి న్యాయ విచారణ జరిపించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఐ జిల్లా సమితి పక్షాన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 23 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడిన ప్రభుత్వం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న వారిపై అత్యంత పాశవికంగా దాడి చేసిందని దారుణంగా ఉన్న వీడియోలను చూస్తుంటే మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్య స్థానే నియంతృత్వ ఆలోచనలు చేస్తుందన్న భావన బలపడుతుందని సురేష్ తెలిపారు. పోలీసులకు విస్తృత అధికారాలు ఇవ్వడం, ఎటువంటి అభియోగాలు లేకపోయినా ఏడాది పాటు నిర్బంధించే అవకాశాన్ని కల్పించడం ఏ ప్రజాస్వామ్యంలో ఉందని ఆయన ప్రశ్నించారు. విద్యార్థిని మరణానికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని, ఇది కేంద్ర ప్రభుత్వం చేసిన హత్యగా సిపిఐ భావిస్తుందని సురేష్ తెలిపారు. ప్రభుత్వ వ్యవస్థలలో న్యాయం దక్కనప్పుడు న్యాయస్థానాలను ఆశ్రయించడం హక్కు అని కానీ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యలు పలు అనుమా నాలకు తావివ్వడంతో పాటు ఆవేదన కలిగిస్తున్నాయని సురేష్ తెలి పారు. దేశాన్ని అట్టుడికిస్తున్న ఓ ప్రధాన సమస్యపై న్యాయమూ ర్తికి వినే తీరిక లేదనడంతో పాటు నా సమయాన్ని వృధా చేయ వద్దని అనడం శోచనీయమన్నారు. న్యాయ వ్యవస్థపై ప్రజలు నమ్మకం కోల్పోయిన నాడు ఆవేదన నుండి ఆవేశం పురుడుపో సుకుంటుందన్న వాస్తవాన్ని న్యాయమూర్తులు గ్రహించాలని ఆయన కోరారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులకు అనుగుణంగా ఖమ్మం జిల్లాలో తక్షణ చర్యలు చేపట్టాలని ఉపాధి కల్పన రంగా లను మెరుగుపర్చాలని రైతులను అన్ని విధాలా ఆదుకునేందుకు కరువు ప్యాకేజీని ప్రకటించాలని సురేష్ డిమాండ్‌చేశారు. దేశంలో యువత సాగి స్తున్న శాంతియుత ఉద్యమాలకు 24వ తేదీన జరుగుతున్న బంద్‌కు సిపిఐ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని సురేష్ తెలిపారు.

## వృద్ధ దంపతుల కళ్లల్లో కారంచల్లి చోరీ

### మూడు తులాల బంగారు గొలుసు అపహరణ
### వరుస దొంగతనాలతో
### హడలెత్తుతున్న మండల ప్రజలు



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** తిరుమలా యపాలెం మండలంలో వరుస దొంగతనాలు ప్రజల్లో తీవ్ర ఆందోళనకు కారణవుతున్నాయి. గత మూడు సంవత్సరాలుగా మండలంలోని ఏదో ఒక గ్రామంలో చోరీలు, దోపిడీలు, గొలుసు అపహరణలు జరుగుతుండటంతో గ్రామీణ ప్రజలు, ముఖ్యంగా వృద్ధులు, మహి ళలు భయాందోళనలకు గురవుతున్నారు. పిండి ప్రోలు గ్రామానికి చెందిన చెన్న సుగణమ్మ హత్య ఘటన ఇంకా ప్రజల మదిలో నుంచి చెరి గిపోకముందే తాజాగా బీరోలు గ్రామంలో మరో దొంగతనం చోటు చేసుకుంది. గ్రామం లోని పాత ఆంధ్రా బ్యాంకు సమీపంలో నివాస ముంటున్న వృద్ధ దంపతులు ఆవుల శకుం తల(75), భద్రయ్య(80) ఇంట్లో అర్ధరాత్రి సమయంలో ఈ ఘటన జరిగింది. పోలీసుల సమాచారం ప్రకారం శకుంతల రాత్రి సుమారు 1.30గంటల సమయంలో బాత్రుంకు వెళ్లి తిరిగి ఇంట్లోకి వస్తుండగా ఇంటి వెనుక ద్వారం గుండా ప్రవేశించిన దుండగులు దంపతుల కళ్లల్లో కారం చల్లి శకుంతల మెడలో ఉన్న సుమారు మూడు తులాల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యారు. బాధితులు కేకలు వేయ డంతో స్థానికులు అక్కడికి చేరుకున్నట్లు తెలి సింది. మూడు సంవత్సరాలుగా వరుస ఘట నలు మండలంలో గత కొన్నేళ్లుగగా చోటుచేసు కున్న పలు దొంగతనాలు ప్రజల్లో భయాన్ని పెంచుతున్నాయి. తాళ్లచెర్వులో అత్తా కోడళ్ల మంగళసూత్రాలకు మెరుగు పెడతానని నమ్మబ లికి ఇంట్లోకి ప్రవేశించిన వ్యక్తి వారి బంగారు గొలుసులు అపహరించిన ఘటన జరిగింది. కొండబాల బాబూరావు వ్యవసాయక్షేత్రంలో పనిచేస్తున్న సమయంలో దుండగులు కత్తులతో బెదిరించి మెడలోని మూడు తులాల బంగారు గొలుసు, ఉంగరాన్ని దోచుకెళ్లారు. పిండిప్రోలు గ్రామంలో వృద్ధురాలు ఆరెంపుల వెంకమ్మ నిద్రి స్తున్న సమయంలో ఆమెపై రాయితో దాడి చేసి మెడలోని బంగారు గొలుసును అపహరించా డు. అదే గ్రామంలో ఖమ్మం వరంగల్ జాతీయ రహదారి పక్కన ఉన్న మల్లెబోయిన యాదగిరి కిరాణా దుకాణంలోకి చొరబడి సుమారు పది తులాల బంగారం దొంగలించారు. అలాగే బ స్టాండ్ సెంటర్‌లోని పూజలు శ్రీను ఇంట్లో ఎవ రూలేని సమయంలో చొరబడి బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లిన ఘటన కూడా చోటు చేసుకుంది. ఇవి మాత్రమే కాకుండా రైతుల పొ లాల్లో విద్యుత్ మోటార్లు, పెట్రోల్ బంకుల్లో డీజిల్ చోరీలు, రోడ్డుపై నిలిపిన వాహనాల టైర్ల దొంగత నాలు, రైతుల ఇళ్ల వద్ద మేకలు, గొర్రెల అపహరణ వంటి అనేక ఘటనలు వరుసగా వెలుగుచూ శాయి. రాత్రివేళలోల గ్రామాల్లో పో లీసుల పెట్రోలింగ్ తగినస్థా యిలో లేకపోకపోవడం వల్ల దొంగలు రెచ్చిపో తున్నారని స్థానికు లు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ముఖ్యంగా నిర్మానుష్య ప్రాంతాల్లోని ఇళ్లు, వృద్ధ దంపతులు, ఒంటరిగా నివసించే మహిళలనే లక్ష్యంగా చేసుకుని దొంగల ముఠా సంచరిస్తోందనే అనుమానాలు వ్యక్త మవుతు న్నాయి. మండలంలో పోలీస్ నిఘాలను మరింత బలోపేతం చేసి రాత్రివేళలో క్రమం తప్పకుండా పెట్రోలింగ్ నిర్వహించాలని, వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను త్వరగా గుర్తించి చట్టం ముందు నిలబెట్టాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే వరుస చోరీలకు అడ్డుకట్ట వేసి ప్రజల్లో భద్రతా భావం, పోలీసు లపై విశ్వాసాన్ని పెంచాలని మండల ప్రజలు కోరుతున్నా రు. స్థానికుల సమాచారం మేరకు స్థానిక ఎస్సై కూచిపూడి జగదీష్ తన సిబ్బం దితో వెళ్లి చోరీ జరిగిన తీరును పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రభుత్వ ఆస్పత్రే కానీ.. కత్తికే ఎక్కువ పని

### సహజ ప్రసవాల కంటే సిజేరియన్లకే పెద్దపీట




**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం:** ప్రభుత్వ ఆసుపత్రులలో సాధారణ ప్రస వాలను ప్రోత్సహించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పదే పదే ఆదేశాలు జారీ చేస్తున్నా.. ఖమ్మం ప్రభుత్వ మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో మాత్రం పరిస్థితి అందుకు విరుద్ధంగా కనిపిస్తోంది. గర్భిణీలకు సాధ్యమైనంత వరకు సహజ ప్రసవాలు చేయాల్సిన చోట, అధిక సంఖ్యలో సిజేరియన్ ఆపరేషన్లు జరుగుతుండం చర్చనీయాంశంగా మారింది. జిల్లాలో జరిగే మొత్తం ప్రస వాల్లో దాదాపు ప్రసవాలు ఖమ్మం మాతా శిశు ఆరోగ్య కేంద్రంలోనే నమో దువుతున్నాయి. 2024 ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మొత్తం 14,133 ప్రసవాలు జరగగా, వాటిలో 12,605 ప్రస వాలు ఖమ్మం ప్రభుత్వ మాతా శిశు ఆరోగ్య కేంద్రంలోనే జరిగాయి. ఆశ్చ ర్యకరంగా వీటిలో 58 శాతం సిజేరియన్ ప్రసవాలే కావడం ఆందోళనకు గురిచేస్తోంది. వైద్యపరంగా అవసరమైతే మాత్రమే సిజేరియన్ చేయాలని మార్గదర్శకాలు ఉన్నప్పటికీ, ఇంత అధిక శాతం ఆపరేషన్లు జరగడం వెనుక కారణాలపై ఆరోగ్యశాఖ సమీక్ష చేపట్టాల్సిన అవసరం ఉందని ప్రజారోగ్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు. తల్లి, శిశువు ఆరోగ్య పరిస్థితులను బట్టి నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నప్పటికీ, సహజ ప్రసవాల శాతాన్ని పెంచే దిశగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు.

# యువత భవిష్యత్తుకు హాని చేసింది మోదీనే

**భారత విద్యా వ్యవస్థను పూర్తిగా చేజిక్కించుకోవడానికి, నాశనం చేయడానికి అనుమతించారు.. బాధ్యులైన ప్రతి ఒక్కరినీ రక్షించారు.. ప్రధానిపై రాహుల్‌గాంధీ ఫైర్**



**న్యూఢిల్లీ :** పేపర్ లీక్‌లలో ప్రమేయం ఉన్నవారిని శిక్షించడానికి ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తామన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటనను కాంగ్రెస్ కొట్టిపారేసింది. ఈ ప్రకటన చాలా చిన్నదని, తీవ్ర జాప్యం జరిగిందని, విద్యార్థులు ఇటువంటి 'అర్థాంశ చర్యలను' అంగీకరించలేరని పేర్కొంది. దేశవ్యాప్తంగా జరుగుతున్న నిరసనలతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కలత చెందారని, యువత భవిష్యత్తుకు ఆయనే అత్యధికంగా హాని చేశారని ఆరోపించింది. భారత విద్యా వ్యవస్థను పూర్తిగా చేజిక్కించుకోవడానికి, నాశనం చేయడానికి మోదీ అనుమతించి, ప్రోత్సహించారని, అందుకు బాధ్యులైన ప్రతి ఒక్కరినీ రక్షించారని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా ఆరోపించారు. మన యువత సంక్షేమం, భవిష్యత్తు కంటే ముఖ్యమైనది ఏదీ లేదని మోదీ ఎక్స్‌లో పేర్కొన్న తరువాత ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ మాట్లాడుతూ, సందర్భం వచ్చినప్పుడు తన పూర్వ ప్రధానులందరూ చేసినట్లుగా పార్లమెంటులో నిలబడి మాట్లాడి, తీవ్రమైన చర్చలో పాల్గొనే ధైర్యం ప్రధానికి లేదని అన్నారు. నిజానికి, ఆ పోస్ట్ చూస్తేనే ఆయన కలత చెందారని స్పష్టమవుతోందన్నారు. 'ఓటు దొంగతనం, సీటు దొంగతనం, చందా దొంగతనం, పరీక్ష పేపర్ దొంగతనం' ఈ జాబితా ఇలా కొనసాగుతూనే ఉంటుంది' అని ఎద్దేవా చేశారు. పేపర్ లీక్‌లను నివారించడంలో మోదీ ప్రభుత్వం విఫలమవడం, అవి జరిగినప్పుడు వాటిని అంగీకరించడానికి విముఖత చూపడం,, వాటిపై నిష్పక్షపాతంగా విచారణ జరపడంలో అసమర్థతపై విద్యార్థులు నిజమైన జవాబుదారీతనం కోరుతున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ అన్నారు. గత 12 ఏళ్లుగా బిజెపి ప్రభుత్వం పేపర్ లీక్‌లను ఎలా కప్పిపుచ్చిందో, వాటికి ఎలా ఆజ్యం పోసిందో అనే నిజాన్ని ప్రధాని ముందుగా గ్రహించాలన్నారు. తమ హయాంలో పేపర్ లీక్‌లు జరిగాయని అంగీకరించే ధైర్యం కూడా మోదీ ప్రభుత్వానికి లేదని రమేశ్ ఆరోపించారు. 'ఎన్‌టిఎ ద్వారా ఎలాంటి పేపర్ లీక్‌లు జరగలేదని విద్యా మంత్రిత్వ శాఖ గతంలో పార్లమెంటరీ విద్యా స్థాయీ సంఘానికి చెప్పింది. ప్రధాన్ మంత్రి, మంత్రి ప్రధాన్ నిజాన్ని అంగీకరించకుండా ప్రజలకు, పార్లమెంటుకు సిగ్గులేకుండా అబద్ధాలు చెబుతున్నారు' అని మోదీ, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌లపై ఎద్దేవా చేస్తూ ఆయన అన్నారు.

**వీధుల్లో రక్తం చిందించిన యువత కళ్లలోకి చూడండి: ఖర్గే**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే విమర్శలు గుప్పించారు. నిరసన తెలుపుతూ వీధుల్లో రక్తం చిందించిన యువత కళ్లలోకి చూడాలని డిమాండ్ చేశారు. యువత భవిష్యత్తుతో ఆడుకునే వారిని వదిలిపెట్టబోమని ప్రధాని మోదీ అంటున్నారని, అయితే యువతకు అన్ని దారులు మూసుకుపోయాయని, వారు ఎక్కడికి వెళ్లాలని ఖర్గే ప్రశ్నించారు. పరీక్షల అవకతవకలకు వ్యతిరేకంగా విద్యార్థులు చేస్తున్న నిరసనలను ప్రస్తావిస్తూ, 'నరేంద్ర మోదీ జీ, మీ హయాంలో విద్యా వ్యవస్థ క్షీణించిపోయింది. మాకు ఊరట మాటలు గానీ, శాంతి ప్రకటనలు గానీ అవసరం లేదు. మీ ప్రభుత్వం యువతపై లాఠీచార్జ్ చేసింది, బాష్ప గోళాలు ప్రయోగించింది. వారు మా సొంత పిల్లలు కానట్లుగా నిర్భయంగా క్రూరంగా ప్రవర్తించింది' అని ధ్వజమెత్తారు. 'మీ ఎసి సౌధాల నుండి బయటకు వచ్చి, మీ నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాడుతూ వీధుల్లో రక్తం చిందించిన యువతీ యువకుల కళ్లలోకి చూడండి' అని ఆయన అన్నారు. యువత కేవలం మూడు సాధారణ డిమాండ్లను మాత్రమే నెరవేర్చాలని కోరుకుంటున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ విద్యా వ్యవస్థను తన ఆధీనంలోకి తీసుకుందని కూడా ఖర్గే ఆరోపించారు. 'యువత నిరుద్యోగం 29 శాతానికి (పిఎల్‌ఎఫ్‌ఎస్) పెరిగిపోతోంది. ప్రైవేట్ ఉద్యోగాలు లేవు, కొన్ని మాత్రమే శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలు ఉన్నాయి. కాంట్రాక్టు పద్ధతి పరాకాష్టకు చేరింది. అన్ని దారులు మూసుకుపోయాయి. తమ భవిష్యత్తును కోరుకోవడానికి యువత ఎక్కడికి వెళ్లాలి?' అని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. ప్రధాన మంత్రి వ్యాఖ్యలు పూర్తిగా 'కంటి తుడుపు చర్య' అని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ కూడా విమర్శించారు. యువత దీనితో సరిపెట్టుకుంటుందని మోదీ అనుకుంటే ఆయన భ్రమల్లో బతుకుతున్నారు. వారి డిమాండ్లు స్పష్టంగా ఉన్నాయని పేర్కొన్నారు.

# పిల్లల పట్ల చూపుతున్న శ్రద్ధ ఇదేనా?

**అంగారక గ్రహం పైకి వెళ్లిన ఘనతను మోదీ తన ఖాతాలో వేసుకున్నారు విద్యార్థులపై నిరసనలకు బాధ్యత వహించాల్సిన సమయం ఆసన్నమైంది : ప్రియాంకాగాంధీ**



**న్యూఢిల్లీ :** విద్యార్థుల నిరసనల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా గురువారం ప్రధాని నరేంద్ర మోదీపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అంగారక గ్రహం (మార్స్) పైకి వెళ్లిన ఘనతను తన ఖాతాలో వేసుకున్న మోదీ, ఇప్పుడు తన చర్యలకు బాధ్యత వహించాల్సిన సమయం ఆసన్నమైంది అని ఆమె అన్నారు. పార్లమెంట్ భవన సముదాయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ పిల్లల పట్ల తనకు శ్రద్ధ ఉందని ప్రధాని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారని, కానీ సరిగ్గా బుధవారం రాత్రే వారిపై బాష్పవాయువు ప్రయోగించి, వారిని కొట్టించారని ఆమె గుర్తుచేశారు. 'పాలక పక్షానికి చెందిన ఎంపిలే బయట నిలబడి నిరసన తెలపడం మన ప్రజాస్వామ్య చరిత్రలో ఎప్పుడైనా చూశారా? ఎన్ని సమావేశాలుగా ఇది జరుగుతోంది, వారు పార్లమెంట్ సమావేశాలను నడపలేకపోతున్నారు. బయట ఏం జరుగుతోంది?' అని అన్నారు. ప్రధాని బలహీనుడు, పిరికివాడు అని వ్యాఖ్యానించారు. మధ్య ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలను నిలిపివేసినట్లు వచ్చిన వార్తలపై స్పందిస్తూ, 'మనం ప్రజాస్వామ్యంలో జీవిస్తున్నామా? ఒక్కసారి ఆలోచించండి, పిల్లలు నిరసన తెలుపుతున్నారు... వారు ఇంటర్నెట్‌ను నిలిపివేశారు, అసలు ఏం చేస్తున్నారు? విద్యార్థులు ఉగ్రవాదులు కారు కదా. వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతుంటారు, వారు ఎవరినీ సంప్రదించలేకపోతున్నారు. వారిపై బాష్పవాయువు ప్రయోగిస్తున్నారు, కొడుతున్నారు. ఇది ఎలాంటి ప్రజాస్వామ్యం? అని ప్రియాంక గాంధీ ప్రశ్నించారు. బుధవారం రాత్రి విద్యార్థులపై బాష్పవాయువు ప్రయోగించి, వారిని కొట్టించిన ప్రధాని, పిల్లల పట్ల తనకు శ్రద్ధ ఉందని సోషల్ మీడియాలో ఎలా పోస్ట్ చేయగలిగారని మీడియాను ఆమె ప్రశ్నించారు. 'అంగారక గ్రహంపైకి వెళ్లిన ఘనతను, అలాగే మన యువత, ప్రజల విజయాలన్నింటినీ ఆయన (ప్రధాని మోదీ) తన ఖాతాలో వేసుకుంటారు కదా? కాబట్టి ఇప్పుడు తన చర్యలకు బాధ్యత వహించాల్సిన సమయం ఆసన్నమైంది' అని ప్రియాంక గాంధీ స్పష్టం చేశారు. 'ప్రజలను కొట్టిస్తోంది ఆయనే. ఆయన కళ్ల ముందే 152 పరీక్షా పత్రాలు లీక్ అయ్యాయి, కానీ ఒక్కరికి కూడా శిక్ష పడలేదు; దీనికి ఎవరు బాధ్యులు? అంగారక గ్రహంపైకి వెళ్లడానికి మోదీజీ బాధ్యులైతే, ఒలింపిక్స్ లేదా ఆసియా క్రీడల్లో భారతీయులు సాధించే ప్రతి విజయానికి మోదీజీ బాధ్యులైతే, నేడు జరుగుతున్న పరిణామాలకు కూడా మోదీజీనే బాధ్యులు' అని ఆమె అన్నారు. తమకు భవిష్యత్తు లేదని మన యువత భావించడానికి మోదీజీనే కారణమన్నారు. వ్యవస్థపై విద్యార్థులకు నమ్మకం పోయిందని ప్రియాంక గాంధీ అన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం ఆలకించాల్సిన సమయం ఆసన్నమైందనిఆసన్నమైందని ప్రియాంక గాంధీ పేర్కొన్నారు.

## విద్యార్థుల ఆవేదనను తెలిపేందుకే
# 26న ముంబయిలో 'మోర్చా'

**ఉద్ధవ్, రాజ్ థాకరేలు వెల్లడి**



**ముంబయి :** నిరసనకారులపై పోలీసుల అఘాయిత్యాలు, విస్తృత నిరసనలకు దారితీసిన 'నీట్' పేపర్ లీక్‌పై విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆవేదనను తెలియజేయడానికి జులై 26న 'మోర్చా' నిర్వహిస్తున్నామని శివసేన (యుబిటి) చీఫ్ ఉద్ధవ్ థాకరే, ఎంఎన్ఎస్ అధ్యక్షుడు రాజ్ థాకరే గురువారం ప్రకటించారు. ఇక్కడ విలేకరుల సమావేశంలో ఉద్ధవ్ మాట్లాడుతూ ప్రభుత్వం కఠినమైనదే అయినా విద్యార్థులు ఇక ఎవరికీ భయపడటం లేదని చెప్పారు. విద్యార్థులపై దాడిచేసి, నిరసనకారులైన మహిళల దుస్తులను చింపివేసిన పోలీసుల విషయంలో ప్రధానమంత్రి బాధ్యత తీసుకుంటారా ? అని ప్రశ్నించారు. ప్రజలు ఏళ్ల తరబడి పేరుకుపోయిన ఆగ్రహాన్ని వ్యక్తం చేయాలని అనుకుంటున్న నేపథ్యంలో తాము ఒక మార్గాన్ని కల్పిస్తున్నామని ఆయన చెప్పారు. తమ నిరసన గురించి లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీతో తాను మాట్లాడానని, ఇందులో మహారాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పాల్గొంటారని ఆయన తెలిపారు. రాష్ట్రంలోని మహా వికాస్ అఘాడీ ప్రతిపక్ష కూటమిలో శివసేన (యుబిటి), కాంగ్రెస్‌లు భాగస్వాములుగా ఉన్నాయి. కాగా, మెర్చా దాదర్‌లోని శివాజీ పార్క్ నుంచి బయలుదేరుతుందని, ప్రభాదేవి ఏరియాలోని సిద్ధివినాయక్ టెంపుల్ వద్ద ముగుస్తుందని ఉద్ధవ్ థాకరే వివరించారు. కుక్కలు, పిల్లలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడానికి న్యాయవ్యవస్థకు సమయం ఉంది కానీ, బొద్దింకల (యువత) గురించి పట్టించుకోవడానికి వారికి సమయం లేకపోవడం విచారకరమన్నారు. న్యాయవ్యవస్థ పరిస్థితి ధృతరాష్ట్రుడిని న్యాయం కోసం వేడుకునే ద్రౌపదిలా ఉందని ఉద్ధవ్ ఆవేదన వ్యక్తం చేశారు.'జులై 26న ముంబయిలో మా శాంతియుత నిరసనకు ఆటంకం కలిగించాలని ప్రయత్నించే వారిని చితకబాదుతాం' అని హెచ్చరించారు. ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి గణేషుడికి ప్రార్థనలు చేస్తామని చెప్పారు. నిరసన సందర్భంగా ఎలాంటి రాజకీయ జెండాలను ప్రదర్శించబోమని విలేకరులు అడిగిన ఒక ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. విద్యార్థుల ఆందోళన భారీ స్థాయికి చేరడంతో ప్రభుత్వం వెనకడుగు వేసిందని మహారాష్ట్ర నవ్‌నిర్మాణ్ సేన (ఎంఎన్ఎస్) అధ్యక్షుడు రాజ్‌థాకరే పేర్కొన్నారు.నిరసనకారులపై పోలీసులు జరిపిన అఘాయిత్యాలు, నీట్ పేపర్ లీక్‌లపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఈ మోర్చాకు పిలిచినట్లు ఇద్దరు నాయకులూ విలేకరులకు తెలియజేశారు.న్యూఢిల్లీలో ఆందోళన కొనసాగిస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) ఆందోళనకు ముంబయిలో చేపట్టనున్న నిరసనలు సంఘీభావం తెలుపుతాయన్నారు. ఢిల్లీ పోలీసులు భాష్పవాయు గోళాలు ప్రయోగించి, లాఠీలతో విచక్షణారహితంగా దాడి చేయడం శోచనీయమన్నారు.

## బిజెపి నేతల కోసం
# ఫాస్ట్ ట్రాక్ కోర్టులు పెట్టండి

**రాజ్యసభ ఎంపి కపిల్ సిబల్ ఎద్దేవా**



**న్యూఢిల్లీ :** పేపర్ లీక్‌లలో పాల్గొన్న వారికి శిక్ష పడేలా చూడటానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటుచేస్తామన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటనపై రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బిజెపిలో చేరడానికి ముందు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి కోసం అటువంటి కోర్టులను ఏర్పాటు చేయాలని ఆయన ఎద్దేవా చేశారు. సీనియర్ న్యాయవాది కూడా అయిన సిబల్ మాట్లాడుతూ అధికార పార్టీకి కౌంట్‌డౌన్ ప్రారంభమైందని, పరిస్థితి వారికి వ్యతిరేకంగా మారిందని కపిల్ సిబల్ ధ్వజమెత్తారు. పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రధానమంత్రి ముందుగా సొంత పార్టీ వారికోసం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తే బాగుంటుందని ఎద్దేవా చేశారు. బిజెపి వారు వారి పార్టీలోకి తీసుకున్న పలువురు తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్నప్పటికీ, ఈ వ్యక్తులు భారీ కుంభకోణాలకు పాల్పడ్డారని ఆరోపణలకుగురవుతున్నప్పటికీ, ఆ తర్వాత వారిని బిజెపిలోకి స్వాగతించారని కపిల్ సిబల్ మండిపడ్డారు. బిజెపిలోకి చేరిన అవినీతిపరులపై ఫాస్ట్ ట్రాక్ విచారణను ఎందుకు ప్రారంభించడం లేదు?. సిబిఐ వారిని ఎందుకు విచారించడం లేదు?.ఇప్పటికే కొనసాగుతున్న దర్యాప్తులను ఎందుకు నిలిపివేశారు?అనే ప్రశ్నలకు ముందుగా సమాధానం చెప్పాలని స్వతంత్ర రాజ్యసభ సభ్యుడు అయిన కపిల్ సిబల్ నిలదీశారు. జూన్ 28న విద్యార్థుల నిరసనలు ప్రారంభమమై ఇప్పటికే 25 రోజులు గడిచిపోయాయన్నారు. కానీ, ఈ మొత్తం కాలంలో కేంద్ర ప్రభుత్వం విద్యార్థులతో ఎలాంటి సంప్రదింపులూ జరపకపోవడం శోచనీయం అన్నారు.ఏదైనా ప్రకటన చేయడం గానీ, విద్యార్థులను పట్టించుకున్న దాఖలాలు కూడా లేకపోవడం బాధాకరమన్నారు. విద్యార్థులు నిరాహారదీక్షలు చేస్తున్నప్పుడు మౌనంగా ఉన్న బిజెపి నేతృత్వంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం ఇప్పుడు పరిస్థితి చేయిదాటి పోయిందని గ్రహించి హఠాత్తుగా మేల్కొన్నారని పేర్కొన్నారు.అయితే వారికి కౌంట్‌డౌన్ ప్రారంభం అయ్యిందని, అందుకే వారు ఇప్పుడు మాట్లాడుతున్నారని కపిల్ సిబల్ దుయ్యబట్టారు. ప్రజల మనోభావం వారికి వ్యతిరేకంగా ఉందని బిజెపి ప్రభుత్వానికి బాగా తెలుసునని భారత దేశ ప్రజలలో ముఖ్యంగా యువతలో తీవ్ర ఆగ్రహం నెలకొన్నదని కపిల్ సిబల్ విలేకరులడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. బిజెపికి ఒకే ఒక సమస్య ఉన్నదని, అది హిందూ, ముస్లిం అంశం మాత్రమేనన్నారు. ఆ పార్టీ ఎల్లవేళలా అధికారంలో కొనసాగడం గురించి మాత్రమే ఆలోచిస్తుందని సిబల్ ఆరోపించారు.సంక్షేమం, మన యువత భవిష్యత్తుకంటే మించిన అతిముఖ్యమైనది ఏదీ ప్రభుత్వానికి లేదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ 'ఎక్స్' పోస్ట్‌లో తెలిపిన అనంతరం రాజ్యసభ ఎంపి కపిల్ సిబల్ ఆయనపై ఈ విమర్శలు చేశారు.

## ప్రధాని నివాసం ఎదుట నిరసనపై
# కాంగ్రెస్ ఎంపి 'హక్కుల ఉల్లంఘన నోటీసు

**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసం వెలుపల ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ పార్టీకి చెందిన మహిళా ఎంపీలు నిరసన తెలిపిన సందర్భంగా పోలీసులు 'వారి పార్లమెంట్ హక్కులు, రక్షణలను ఉల్లంఘించారు' అని ఆరోపిస్తూ, 'ప్రివిలేజ్ మోషన్' ప్రవేశపెట్టేందుకు కాంగ్రెస్ ఎంపి హిబీ ఈడెన్ గురువారం లోక్‌సభలో నోటీసు సమర్పించారు. లోక్‌సభ సెక్రటేరియట్ జనరల్‌కు రాసిన లేఖలో కాంగ్రెస్ ఎంపి హిబీ ఈడెన్ నిరసన శాంతియుతంగా కొనసాగిస్తున్నప్పటికీ, పోలీసులు నిరసన చేస్తున్న ఎంపీలను, ముఖ్యంగా లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీని దారుణంగా కొట్టారని పేర్కొన్నారు.ఈ దేశ ప్రతిపక్ష నాయకుడు (ఎల్ఓపి)ని ఈడ్చుకెళ్లి బలవంతంగా 'ఛత్రసాల్' స్టేడియానికి తీసుకెళ్లడం అత్యంత దురదృష్టకరమని ఈడెన్ తెలిపారు. గత కొద్ది రోజులుగా ఈ దేశ విద్యార్థులు, యువతపై జరిగిన దారుణ దాడులకు సంఘీభావంగా కాంగ్రెస్ ఎంపీలు జులై 21న శాంతియుతంగా నిరసన నిర్వహిస్తున్నారని హిబీ ఈడెన్ వివరించారు. 'కేంద్ర ప్రభుత్వం అండతో జరుగుతున్న పేపర్ లీకేజీలు, పరీక్షా అవకతవకలకు వ్యతిరేకంగా మన దేశ విద్యార్థులు, యువత చాలా రోజులుగా నిరసన తెలుపుతున్నారనే విషయాన్ని గమనించాలి. దేశం ముఖ్యంగా యువత కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి అని డిమాండ్ చేస్తోంది' అని ఈడెన్ తెలిపారు.రాహుల్ గాంధీ నాయకత్వంలో దేశ యువత మనోభావాలను గౌరవిస్తూ, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, ఇటీవలి పేపర్ లీకులపై జవాబుదారీతనాన్ని నిర్ధారించాలని నిరంతరం డిమాండ్ చేస్తోందని అన్నారు.అయితే, బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వందేశ డిమాండ్‌ను పట్టించుకోవడానికి నిరాకరించిందని, ఈ విషయమై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఈడెన్ తన నోటీసులో వివరించారు. గాంధీ పట్ల వ్యవహరించిన తీరు ప్రభుత్వం ప్రజాస్వామ్య సూత్రాలను, పార్లమెంటరీ నిబంధనలను, నైతిక విలువలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారనడానికి ఇది ఒక నిదర్శనమని ఎంపీ హిబీ ఈడెన్ తన నోటీసులో ఆరోపించారు. మంగళవారం ప్రధాని నరేంద్రమోదీ నివాసం బయట ధర్నా చేస్తున్న రాహుల్‌గాంధీ, వయనాడ్ ఎంపి ప్రియాకంగాంధీ వాద్రా, సమాజ్‌వాదీ పార్టీకి చెందిన అఖిలేష్ యాదవ్‌లను పోలీసులు బలవంతంగా తొలగించిన తర్వాత హిబీ ఈడెన్ ఈ హక్కుల ఉల్లంఘన నోటీస్‌ను లోక్‌సభలో సమర్పించారు.

# నిలకడగా సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యం

**న్యూఢిల్లీ :** ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నిరశన కొనసాగిస్తున్న సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యం నిలకగా ఉన్నట్లు మేదాంత ఆసుపత్రి వెల్లడించింది. ఆసుపత్రిలో ఆయనకు వివిధ వైద్యుల బృందం చికిత్స అందిస్తోందని తెలియజేసింది. ఈ మేరకు హెల్త్ బులెటిన్‌ను గురువారం విడుదల చేసింది. వాంగ్‌చుక్ పరిస్థితిలో ఎటువంటి మార్పు లేదని, ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆయన స్పృహతో ఉన్నారని తెలిపింది. అలాగే ఆయన కీలక ఆరోగ్య సూచికలు సాధారణ పరిధిలోనే ఉన్నాయని ఆసుపత్రి పేర్కొంది.

# మహిళపై దాడి చేసిన డిసిపిపై పోలీసులకు ఫిర్యాదు

**న్యూఢిల్లీ :** న్యూఢిల్లీలో జూలై 20న జరిగిన 'చలో సంసద్'లో పాల్గొన్న ఒక మహిళపై దాడి చేశారన్న ఆరోపణలపై, అదనపు డిసిపి సందీప్ లాంబాకు వ్యతిరేకంగా పోలీసులకు తృణమూల్ కాంగ్రెస్ రాజ్యసభ మాజీ సభ్యులు సాకేత్ గోఖలే ఫిర్యాదు చేశారు. పార్లమెంట్ వైపు విద్యార్థులు చేపట్టిన ర్యాలీని అడ్డుకునే క్రమంలో ఆ పోలీసు అధికారి ఒక మహిళా నిరసకారిపై దాడి చేశారని ఆరోపిస్తూ, లాంబాపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరుతూ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఒకు ఫిర్యాదు అందజేసినట్లు గోఖలే తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు.

## ఢిల్లీ పోలీసుల ప్రివెంటివ్ డిటెన్షన్ అధికారాలు
# అక్టోబరు 18 వరకు పొడిగింపు

**న్యూఢిల్లీ :** కఠినమైన జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఏ) కింద ఢిల్లీ పోలీసులకు ఉన్నటువంటి నివారణ నిర్బంధ (ప్రివెంటివ్ డిటెన్షన్ ) అధికారాలను ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అక్టోబర్ 18వరకు పొడిగించారు. ఈ విషయాన్ని ఒక అధికారిక ప్రకటన వెల్లడించింది. ఇది అధికారాన్ని 'రొటీన్‌గా విస్తరించడమే' నని గురువారం ఢిల్లీ పోలీస్ ప్రకటనలో తెలిపింది. ఢిల్లీ పోలీసులు ఒక ప్రకటనలో 'ఇది అధికారానికి సంబంధించిన ఒక సాధారణ పొడిగింపు' అని పేర్కొన్నారు. కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) నేతృత్వంలోని నిరసనను అణచివేసేందుకు ఈ అధికారాన్ని కల్పించారని కొన్ని మీడియా కథనాలు చేస్తున్న వాదనలు వాస్తవ సందర్భానికి భిన్నంగా ఉన్నాయని ఢిల్లీ పోలీసులు తెలిపారు. 'నీట్' పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ జూన్ 20న తమ నిరసనను చేపట్టింది. ఈ విషయంలో, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసనను ప్రారంభించింది. సిజెపి నేతృత్వంలో నిర్వహించిన 'ఛలో సంసద్' ఈ నిరసన కార్యక్రమంలో సోమవారం 10వేల మందికి పైగా పార్లమెంట్ వరకు పాదయాత్ర చేయడానికి ప్రయత్నించారు. ఈ పాదయాత్ర హింసాత్మకంగా మారడంతో అనేకమంది నిరసనకారులు, పోలీసు సిబ్బంది కూడా గాయపడ్డారు. ఢిల్లీ ప్రభుత్వ హోం శాఖ జులై 15న జారీ చేసిన నోటిఫికేషన్..జాతీయ భద్రతా చట్టంలోని సెక్షన్ 3, సబ్ సెక్షన్ (2) కింద నగర పోలీస్ కమిషనర్‌కు నిర్బంధించే అధికారం ఇవ్వబడింది. ఈ అధికారం అక్టోబరు 18వరకూ చెల్లుబాటులో ఉంటుందని తెలియజేసింది. తమ ప్రకటనలో ఢిల్లీ పోలీసులు ఈ విధంగా తెలియజేశారు. 'ప్రతీ మూడు నెలలకు ఒకసారి జారీ చేయబడే ఎన్ఎస్ఏ అధికారాల కింద సాధారణ పొడిగింపు / పునరుద్ధరణే తెలపబడిన ఉత్తర్వు' అని స్పష్టం చేశారు. జులై 19 నుంచి అక్టోబరు 18వరకు ఉన్న కాలానికి ప్రారంభానికి చాలా ముందుగానే జులై 7న ప్రస్తుత పునరుద్ధరణ మంజూరు చేయబడిందని వెల్లడించింది.

# ఉగ్రవాదం కావాలా? సింధు జలాలు కావాలా?

**ఉగ్రవాదాన్ని ఆశ్రయిస్తే నీళ్ళు వదిలేసుకోండి కశ్మీర్ భారత్‌లో విడదీయరాని అంతర్భాగం భద్రతామండలిలో దౌత్యవేత్త హరీశ్ స్పష్టీకరణ**

**న్యూయార్క్:** జమ్మూ కశ్మీరు భారతదేశంలో విడదీయరాని అంతర్భాగమని ఐక్యరాజ్యసమితిలో భారత ప్రతినిధి స్పష్టం చేశారు. సింధునదీ జలాల ఒప్పందం(ఐడబ్ల్యుటి)పై పాకిస్థాన్ చేసిన ఆరోపణలను తిరస్కరించారు. తమ దేశానికి సింధు జలాల సరఫరాను నిలిపివేయడం ద్వారా భారత ప్రభుత్వం నీటిని ఒక ఆయుధంగా ఉపయోగిస్తోందని, ఇది చట్టవిరుద్ధమైన చర్యఅనీ, 24 కోట్లమంది పాకిస్థాన్ ప్రజల జీవనోపాధికి ముప్పు కలిగిస్తోందని పాకిస్థాన్ శాశ్వత ప్రతినిధి ఆసిమ్ ఇఫ్తికార్ అహ్మద్ చేసిన ఆరోపణలపై ఐక్యరాజ్యసమితిలో భారతదేశ శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ ఘాటుగా స్పందించారు.

భద్రతామండలిలో జరిగిన ఉన్నతస్థాయీ బహిరంగ చర్చలో హరీశ్ మాట్లాడుతూ, ఉగ్రవాదాన్ని ఎగుమతి చేయడం ప్రభుత్వ విధానంగా పాకిస్థాన్ అనుసరించి దానిని ఒక ఆయుధంగా ఉపయోగించుకున్నంతకాలం సింధు జలాల ఒప్పందంపై ఆదేశానికి ఎలాంటి సహకారం లభించదని, పాకిస్థాన్ ''నీళ్ళు'' వదిలేసుకోవాలని, ఈ విషయంలో ఎలాంటి ఆశలూ పెట్టుకోవద్దని స్పష్టం చేశారు. దేశ సరిహద్దుల్లోంచి భారత్ భూభాగంలోకి ఉగ్రవాదాన్ని ఎగుమతి చేసేందుకు నిత్యం ప్రయత్నాలు చేస్తోందని, ఉగ్రవాదులను ప్రోత్సహిస్తోందని విమర్శించారు.

''సహజ వనరుల నిర్వహణఃశాంతి భద్రతలు– శ్రేయసుకు పునాది'' అనే అంశంపై జరిగిన ఉన్నతస్థాయీ బహిరంగ చర్చలో భారత్‌పై పాకిస్థాన్ చేసిన ఆరోపణలను పర్వతనేని హరీశ్ తీవ్రస్థాయిలో ఖండించారు. పాకిస్థాన్ వైఖరిపై నిశిత విమర్శలు చేశారు. జమ్మూ కశ్మీరు ఎల్లప్పుడూ భారతదేశంలో విడదీయరాని అంతర్భాగంగా కొనసాగుతుందని స్పష్టం చేశారు.తప్పుడు కథనాలను ప్రచారం చేసేందుకు ఈ వేదికను పాకిస్థాన్ దుర్వినియోగం చేసిందని, అందుకే భారతదేశం తన వైఖరిని చాలా స్పష్టంగా చెప్పాల్సి వచ్చిందని అన్నారు.ఉగ్రవాదాన్ని పాకిస్థాన్ తన ప్రభుత్వ విధానంగా అమలు చేస్తోందని, ఈ పరిస్థితుల్లో పరస్పర విశ్వాసం ఆధారంగా సద్భావను, పరస్పర సహకార ధోరణిని ఆ దేశం నుండి ఆశించలేమని ఆయన అన్నారు. సహజ వనరుల అక్రమ దోపిడీ, అక్రమ రవాణాల కారణంగా ఇది చాలా సమయాల్లో ఉగ్రవాదులకు ఉపయోగపడతాయని, సాయుధ సంఘర్షణలు అదేపనిగా కొనసాగడానికి వీలు కలుగుతుందని అందువల్ల తాము సహకరించలేమని చెప్పారు.సహజవనరుల దోపిడీని అరికట్టడానికి జవాబుదారీతనంతో కూడిన అంతర్జాతీయ సహకారం ఉండాలని కోరారు. దేశాలమధ్య ఉండే సహజవనరులు ఆయా దేశాల ఉమ్మడి సార్వభౌమాధికారాభివృద్ధికి,శ్రేయస్సుకు,ఆర్థిక అభివృద్ధికి దోహదపడాలిగానీ, వినాశనాన్ని ఎగదోసేందుకు ఉపయోగపడకూడదని అన్నారు.

1960లో ప్రపంచబ్యాంకు మధ్యవర్తిత్వంలో భారత్–పాకిస్థాన్ మధ్య సింధునదీ జలాల పంపిణీ ఒప్పందం జరిగింది.సింధునదీ పరీవాహకప్రాంతంలో ఉన్న ఆరు నదుల నీటిని ఈ ఒప్పందం నియంత్రిస్తుంది. ఈ ఒప్పందం కింద తూర్పు నదులు భారత్‌కు, పశ్చిమ నదులు పాకిస్థాన్‌కు కేటాయించారు. 2025 ఏప్రిల్ 22వ తేదీన పహల్గామ్‌లో ఉగ్రవాదులు చేసిన దాడి తర్వాత, సరిహద్దు ఉగ్రవాదాన్ని ఒక ప్రభుత్వ విధానంగా పాకిస్థాన్ అనుసరిస్తున్నందువల్ల వారికి ఎలాంటి సహకారాన్ని కొనసాగించలేమని ప్రకటించిన భారత ప్రభుత్వం ఈ ఒప్పందం అమలును నిలిపివేసింది. నీటి సరఫరాను నిలిపివేసింది.



## విద్యార్థుల అసంతృప్తిని
# సమాజ వేదనగా గుర్తించండి

**ప్రధాని మోదీకి అన్నా హజారే లేఖ అహల్యానగర్ గాంధీ విగ్రహం వద్ద మౌనదీక్ష**



**అహల్యానగర్:** రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరవధిక బైఠాయింపు,ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్న వేలాదిమంది విద్యార్థులకు మద్దతుగా సామాజిక కార్యకర్త అన్నాహజారే (89) మౌన దీక్ష చేశారు. మహారాష్ట్రకు చెందిన సుప్రసిద్ధ సామాజిక కార్యకర్త అన్నాహజారే అహల్యానగర్‌లో ఉన్న మహాత్మాగాంధీ విగ్రహం వద్ద గురువారం ఉదయం 11 గంటలకు 'మౌన ఆందోళన్' ప్రారంభించి మధ్యాహ్నం ఒంటిగంటకు ముగించారు. ఆ తర్వాత ఆయన అహ్మద్‌నగర్‌జిల్లాలోని తన స్వగ్రామం రాలేగావ్ సిద్ధికి వెళ్ళారు. ముందురోజు బుధవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఒక లేఖ కూడా రాశారు. ''విద్యార్థులు,యువకులకు వ్యతిరేకంగా పోలీసులు జరిపిన హింసాత్మక చర్యకు పాల్పడ్డారన్న వార్త చాలా తీవ్రంగా నన్ను బాధించింది'' అని పేర్కొన్నారు. ''విద్యార్థులు,యువకుల అసంతృప్తిని కేవలం ఒక శాంతి భద్రతల సమస్యగా చూడవద్దు, ఇది సమాజం నుండి ప్రతిబింబించే వేదనగా పరిగణించాలి, ఆందోళనకారుల అసంతృప్తిని వారి ఆశయంగా పరిగణించాలి'' అని తన లేఖలో మోదీకి హితవు చెప్పారు. కేంద్ర విద్యాశాఖామంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను రాజీనామా చేయాలని కోరితే, అది మీ ప్రభుత్వం కుప్పకూలిపోయినట్లు కాదు, పైగా అది కేంద్ర ప్రభుత్వ పనితీరును మరింత జవాబుదారీగా, సమర్థవంతంగా మారుస్తుంది'' అని హితవాక్యం చెప్పారు. నిరసన ప్రదర్శకుల మాట పెడచెవిన పెట్టవద్దని, వారి ఘోషను ఓపిగా ఆలకించాలని మోదీకి విజ్ఞప్తి చేశారు. వారికి విశ్వాసం కల్పించే వాతావరణాన్ని సృష్టించాలని సానుకూల సంభాషణల ద్వారా సమస్యకు పరిష్కారాన్ని సాధించాలని కోరారు. అన్నాహజారే పాత్రికేయులతో మాట్లాడుతూ, తాను ప్రధానమంత్రి మోదీకి ఒక లేఖ రాశానని చెప్పారు. దేశానికి ఆయనే సర్వోన్నత నాయకుడని, ప్రజల సమస్యలను ఆయనకు తెలియజేయాలని అన్నారు. రాలేగావ్ గ్రామాన్ని ఆదర్శవంతగా తీర్చిదిద్దడంతోపాటు దేశ ప్రభుత్వ కార్యాలయాలలో అవినీతి నిర్మూలనకు కృషి చేశారు. అన్నాహజారేకు కేంద్ర ప్రభుత్వం 1990 పద్మశ్రీ అవార్డు, 1992 పద్మశ్రీ పురస్కారాన్ని ఇచ్చి సత్కరించింది.

# హౌతీల దాడులు

## రెండు సౌదీ చమురు ట్యాంకర్లు దగ్ధం

### ఎర్రసముద్రంలో కొత్త యుద్ధం
### నౌకా రవాణాకు ఆటంకం
### పాకిస్థాన్ ప్రధానమంత్రి ఖండన



**కైరో:** కొత్త ప్రాంతాలకు విస్తరించిన పశ్చిమాసియా యుద్ధంలో ఇరాన్ పక్షాన రంగంలోకి దిగిన హౌతీ తిరుగుబాటు సైన్యాలు ఎర్ర సముద్రంలో రెండు సౌదీ అరేబియా ట్యాంకర్లపై మొదటిసారి ప్రత్యక్ష దాడి చేశాయి. ఎన్సెలియా,లైలా అనే రెండు చమురు ట్యాంకర్లపై దాడి చేశామని,ట్యాంకర్లు మంటల్లో దగ్ధమయ్యాయని హౌతీ దళాలు చెప్పినట్లు 'సబా' వార్తాసంస్థ ప్రకటించింది. దీంతో హోర్ముజ్ జలసంధితోపాటు సరికొత్తగా మరో కీలక జలరవాణా మార్గంలో కూడా నౌకలకు ఆటంకాలు ప్రారంభమయ్యాయి. అదేసమయంలో అమెరికా సెంట్ కామ్ సైన్యాలు గురువారం తెల్లవారకముందే వరుసగా 12వ రోజు రాత్రి కూడా ఇరాన్ నౌకా సామర్థ్యాన్ని బలహీనపరచేందుకు భారీస్థాయిలో దాడులు కొనసాగించగా,ఐఆర్‌జిసి సైనిక దళాలు కూడా ప్రతీకార దాడులు కొనసాగించాయి. హోర్ముజ్ జలసంధిలో కీలకమైన నౌకా మార్గాలపై ఆధిపత్యం సాధించడంకోసం అమెరికా–ఇరాన్ మధ్య జరుగుతున్న పోటీలో ఒక తాజాపరిణామంలో ఈ యుద్ధం కొనసాగుతోంది. హౌతీల ప్రత్యక్ష దాడులు ప్రారంభం కావడంతో ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు,ఇతర సముద్ర రవాణా వస్తువుల ధరలు గణనీయంగా పెరిగాయి. గల్ఫ్‌లో ప్రతిష్టంభన తీవ్రమతున్నప్పటికీ ఈ సంఘర్షణ ముగించడానికి మధ్యవర్తి దేశాలు చేస్తున్న దౌత్య ప్రయత్నాలలో ఎలాంటి పురోగతి కనిపించడంలేదు. యెమెన్‌లోని హౌతీలపై సౌదీ అరేబియా అనేక ఏళ్ళుగా ఆంక్షలు అమలు చేస్తోంది. వారి అధీనంలోని సనా విమానాశ్రయంపై కూడా దాడి చేసింది. దీనికి తాము ప్రతీకారం తీర్చుకుంటున్నామని, తమపై దిగ్బంధనం ఎత్తివేసేవరకూ ఎర్రసముద్రంలో సౌదీ నౌకలను అడ్డుకుంటామని హౌతీలు ప్రకటించారు.ఐతే మనీలాలో జరుగుతున్న 'ఏసియన్' సదస్సులో అమెరికా విదేశీమంత్రి మార్కో రుబియో మాట్లాడుతూ, ఇరాన్ చేతిలో మోసపోయిన హౌతీ తిరుగుబాటుదారులు యుద్ధంలో చేరి పెద్ద ఉచ్చులో చిక్కుకున్నారన్నారు.

ఇన్నాళ్ళూ హౌతీలు యుద్ధానికి దూరంగా ఉండి తెలివిగా వ్యవహరించారని, ఇప్పుడు ఇరకాటంలో పడ్డారన్నారు. కాగా సౌదీ అరేబియా చమురు ట్యాంకులపై హౌతీలు దాడులతో ధ్వంసం చేయడానికి పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ తీవ్రంగా ఖండించారు. సౌదీ అరేబియా యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్‌తో ఫోన్‌లో సంభాషించారు.స్వేచ్ఛా జల రవాణావ్యవస్థపై దాడులను పాకిస్థాన్ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని బిన్ సల్మాన్‌కు ఆయన చెప్పారు. సౌదీ రాజ్య భద్రతకు,సార్వభౌమాధికారానికి,అచంచలమైన,నిర్ణయాత్మకమైన మద్దతు ఇస్తుందని పునరుద్ఘాటించారు. సౌదీ–పాకిస్థాన్ మధ్య వ్యూహాత్మక రక్షణ ఒప్పందం ఉంది.ప్రాంతీయ భద్రత,వ్యూహాత్మక రక్షణకు సంబంధించిన అంశాలపై కూడా వారిద్దరు చర్చించారు.హోర్ముజ్ జలసంధిలో కీలక నౌకా రవాణా స్తంభించిపోయిన పరిస్థితుల్లో హౌతీల కొత్త యుద్ధ దాడులు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను మరింత అతలాకుతలం చేసే ప్రమాదం వచ్చిందని పశ్చిమాసియా పత్రికలు పేర్కొన్నాయి. ఇదిలా ఉండగా, అణుస్థావరాలపై దాడులు చేస్తే ఊహించని దెబ్బ తీస్తామని సెంట్‌కామ్‌కు ఇరాన్ మరోసారి హెచ్చరించింది. నతాంజ్ సమీపంలోని భూగర్భ అణుకేంద్రంపై అమెరికా త్వరలో దాడులు చేస్తుందని వార్తలు వెలువడిన తరుణంలో ఇరాన్ ఈ హెచ్చరిక చేసింది. కోలాంగ్ పర్వతాల్లో ఎలాంటి రహస్య అణు కేంద్ర కాంప్లెక్ ఉనికిలో లేదని, అక్కడ ఎలాంటి అణు కార్యకలాపాలు జరగడంలేదని మరోసారి స్పష్టం చేసింది. అమెరికా మిత్రదేశాలలో ఉన్న గగనతల స్థావరాలు,రాడార్ వ్యవస్థలను క్షిపణులు,డ్రోన్లతో ధ్వంసం చేసింది. గల్ఫ్‌లో జరిగే ఒక్కక్క దాడికీ ప్రతిఫలంగా ఇరాన్‌లో ఒక్కొక్క వంతెన,విద్యుత్ కేంద్రం ధ్వంసమవుతూ ఉంటాయని ట్రంప్ ఇప్పటికే హెచ్చరించారు.

# అబ్రహాం ఎకార్డ్‌లో చేరితేనే అణు ఒప్పందం అమలు

### సంతకాలు జరిగాక సౌదీ అరేబియాకు ట్రంప్ షరతు
### ఇజ్రాయెల్‌తో బంధం పెంచుకుంటే యురేనియం శుద్ధి కర్మాగార నిర్మాణం



**వాషింగ్టన్ :** సౌదీ అరేబియా శాంతియుత అణుకార్యక్రమానికి అమెరికా ఎట్టకేలకు ఆమోదం తెలియజేసింది. 30 సంవత్సరాలపాటు అమలులో ఉండేవిధంగా సౌదీ అరేబియా శాంతియుత అణు కార్యక్రమానికి మద్దతు ఇచ్చే విధంగా రెండు దేశాలు ఒక ఒప్పందానికి వచ్చాయి. దీనికోసం పదుల బిలియన్ డాలర్లను సౌదీ కేటాయించింది. వాల్‌స్ట్రీట్ జనరల్ పత్రిక కథనం ప్రకారం, అవసరం అనుకుంటే సౌదీ అరేబియాలో ఒక అణుశుద్ధి కర్మాగారాన్ని కూడా నిర్మించే నిబంధన ఈ ఒప్పందంలో ఉంది. ఐతే ఈ ఒప్పందంపై సంతకాలు జరిగిన మరునాడే గురువారం అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కొత్త మెలిక పెట్టారు. ఇజ్రాయెల్‌తో సంబంధాలను సాధారణీకరించుకోవాలని కోరారు. ఎంతో గౌరవనీయమమైన,విజయవంతమైన అబ్రహాం ఒప్పందాలలో చేరినప్పుడే పూర్తిస్థాయిలో ఈ అణు ఒప్పందం వర్తిస్తుందని, సౌదీలో యురేనియం శుద్ధి ప్రక్రియకు అప్పుడే అవకాశాలు ఉంటాయని ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ పోస్టింగ్ పెట్టారు. అబ్రహం ఒప్పందాలలో చేరకపోతే ఇరాన్,యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో అమెరికా చేసుకున్న ఒప్పందం తరహాలో యురేనియం శుద్ధికి అవకాశం లేని సాధారణ సైనిక సంబంధాలతో కూడిన పౌర అణు ఒప్పందమే అమలు జరుగుతుందని స్పష్టం చేశారు.

అమెరికా–ఇరాన్ మధ్య హోర్ముజ్ జలసంధిపై ఆధిపత్యంకోసం జరుగుతున్న పోరాటం పరాకాష్టకు చేరుకున్న సమయంలో గల్ఫ్‌దేశాల భవిష్యత్తును నిర్దేశించే దిశగా ఈ ఒప్పంద ప్రకటన వెలువడింది. అమెరికా ఇంధనశాఖ మంత్రి క్రిస్‌రైట్, సౌదీ అరేబియా ఇంధన మంత్రి ప్రిన్స్ అబ్దుల్ అజీజ్ బిన్ సల్మాన్ అల్‌సౌద్ మధ్య ఒక ఒప్పంద పత్రంపై బుధవారం సంతకాలు జరిగాయి. సౌదీ అరేబియాలో అణు కార్యక్రమానికి సంబంధించిన మౌలిక సదుపాయాలను అభివృద్ధిచేసే ప్రక్రియలో అమెరికా కంపెనీలు కీలక పాత్ర పోషిస్తాయి. తద్వారా అమెరికా కంపెనీలు బాగా లాభపడతాయి. హోర్ముజ్ జలసంధి నుండి ఇరాన్ బదులు అమెరికాయే సుంకాలు వసూలు చేస్తుందని ఇంతకుముందు ట్రంప్ ప్రకటించి తర్వాత కొద్ది గంటల్లోనే ఈ ప్రకటనను వెనక్కు తీసుకున్నారు. సుంకాల వసూళ్ళ బదులుగా గల్ఫ్ దేశాలు, ఇతరులు అమెరికాలో పెట్టుబడులు సమకూర్చేవిధంగా ఒప్పందాలు చేసుకుంటామని ట్రంప్ సవరణ ప్రకటన చేసిన నేపథ్యంలో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఈ డిమాండ్‌పై ఒప్పందం కుదిరింది.ఐతే ఈ ఒప్పందంలో పూర్తి భద్రతా ప్రమాణాలతోపాటు అణ్వస్త్రవ్యాప్తి జరగకుండా నిరోధించే అంశాలు ఉన్నాయని, ఈ ఒప్పందంవల్ల రాబోయే కాలంలో సౌదీ అరేబియా నుండి అమెరికాకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని క్రిస్‌రైట్ చెప్పారు. కాగా మనీలాలో జరుగుతున్న 'ఏసియన్' విదేశాంగమంత్రుల శిఖరాగ్ర సదస్సు సందర్భంగా అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో గురువారం విడిగా పత్రికాగోష్ఠిలో మాట్లాడుతూ, సౌదీఅరేబియా తమ దేశానికి ఒక వ్యూహాత్మక భాగస్వామి అనీ, ఒక శాంతియుత అణుకార్యక్రమాన్ని ప్రజా ప్రయోజనాలకోసం ఆ దేశం కోరుకుంటున్నదని, అందుకే ఒక ఒప్పందం చేసుకున్నామని చెప్పారు. మిత్రదేశాలతో సహకార ఒప్పందాలకు అమెరికా ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని చెప్పారు.ఈ ఉమ్మడి భాగస్వామ్యం ద్వారా ఇరు దేశాలమధ్యా వాణిజ్య సంబంధాలు మరింత బలపడతాయని చెప్పారు. సమీక్ష నిమిత్తం ఈ ఒప్పంద పత్రాన్ని అమెరికా కాంగ్రెస్‌కు సమర్పించినట్లు క్రిస్‌రైట్ చెప్పారు. అమెరికా కాంగ్రెస్‌లో ఆమోదం పొందడానికి ముందు డెమోక్రాట్లు,రిపబ్లికన్లు ఈ బిల్లులో చాలా మార్పులు చేర్పులు చేసే ఆవకాశాలు ఉండవచ్చు. దీనిపై డెమోక్రాట్లకు తీవ్ర అభ్యంతరాలున్నాయి. ఈ ఒప్పందాన్ని అమెరికా కాంగ్రెస్ తిరస్కరించే అవకాశాలున్నాయి. అణస్త్రవ్యాప్తిని నిరోధించాలనే లక్ష్యంతో ప్రపంచవ్యాప్తంగా అమెరికా ఇప్పటివరకూ ఏ దేశంతోనూ ఇలాంటి ఒప్పందం చేసుకోలేదు. కానీ సౌదీ అరేబియా ప్రిన్స్ క్రౌన్ మహ్మద్ బిన్ సల్మాన్ పదేపదే అమెరికాపై శాంతియుత అణు కార్యక్రమం కోసం ఒత్తిడి తెస్తున్నారు. అదేవిధంగా సౌదీకి ఈ కార్యక్రమానికి తన పర్యవేక్షణ,నియంత్రణలో అండదండలు ఇవ్వడంవల్ల ఇరాన్,చైనా,రష్యాలను కూడా ఒకరకంగా నిలువరించినట్లు ఉంటుందని అమెరికా భావిస్తోంది. మరోవైపు ఈ విషయంలో భారత్ కూడా తీవ్ర ఆందోళన చెందుతోంది. సౌదీఅరేబియాతో దీర్ఘకాలంగా లోతైన సంబంధాలున్న పాకిస్థాన్‌కు ఆ దేశంతో రక్షణ ఒప్పందం కూడా ఉంది. ఇప్పటికే అణ్వాయుధాన్ని సేకరించుకున్న పాకిస్థాన్ ఈ ఒప్పందాన్ని ఒక పెద్ద అవకాశంగా మలచుకునే పరిస్థితులు భవిష్యత్తులో తలెత్తుతాయని భారత ప్రభుత్వంలో ఆందోళన మొదలైందని పత్రికా నివేదికలు పేర్కొన్నాయి.

# ఉక్రేన్‌కు ఆయుధాలు సరఫరా చేయొద్దు

### మనీలా చర్చల్లో మార్కో రుబియోకు లావరోవ్ స్పష్టీకరణ
### దౌత్యచర్చలకు సిద్ధంగా ఉన్నామని వెల్లడి

**మనీలా :** ఉక్రేన్‌కు ఆయుధాలు సరఫరా చేయవద్దని అమెరికాను రష్యా కోరింది. ఫిలిప్పీన్స్‌లో 'ఏసియన్' సభ్యదేశాల విదేశీ మంత్రుల శిఖరాగ్ర సదస్సు సందర్భంగా గురువారం అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియోతో రష్యా విదేశాంగమంత్రి లావరోవ్ ముఖాముఖీ చర్చల సందర్భంగా ఉక్రేన్ సమస్యను ప్రస్తావించారు. టాస్ వార్తాసంస్థ ఈ విషయం వెల్లడించింది. ఉక్రేన్‌కు ఆమోదయోగ్యంకాని ఆయుధాలు సరఫరా చేయడం ఎంత మాత్రం సరైన చర్య కాదని ఆయన రుబియోకు తెలియజేశారు. యుద్ధ రేఖ వెంబడి, యుద్ధ ప్రాంతంలో ఉన్న పరిస్థితులను కూడా రుబియోకు ఆయన వివరించారు. ఆయుధ సరఫరాలకు స్వస్తిచెప్పాలని కోరుతూనే, అదే సమయంలో ఉక్రేన్‌తో రాజకీయ,దౌత్యపరమైన చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు కూడా రుబియోకు తెలియజేశారు. పర్షియన్‌గల్ఫ్‌లో పరిస్థితులు,అంతర్జాతీయ సమస్యలపై కూడా వారిద్దరూ చర్చించారు. రష్యా–అమెరికా ద్వైపాక్షిక సంబంధాల గురించి ప్రధానంగా చర్చించారు. తరచు సంభాషణలు చేస్తూ ఉండాలని, అనుసంధాన కార్యక్రమం కొనసాగించాలని కూడా వారు నిర్ణయించుకున్నారు. వాస్తవానికి ఉక్రేన్‌లో యుద్ధం ముగించేందుకు రష్యా సహకారం తీసుకోవడానికి మధ్యవర్తిత్వం చేయడానికి సంబంధించి ప్రధానంగా చర్చించేందుకు లావరోవ్‌తో రుబియో సమావేశం జరిపారు. కానీ ఈ మధ్యవర్తిత్వ వ్యవహారం గురించి వారిద్దరిమధ్యా చర్చల్లో ఏం మాట్లాడుకున్నారనే విషయంపై అమెరికా విదేశీమంత్రిత్వశాఖ ఎక్కువ సమాచారాన్ని బయటకు చెప్పలేదు. కానీ ఉక్రేన్‌తో రాజకీయ,దౌత్యపరమైన చర్చలకు తాము సిద్ధంగా ఉన్నట్లు రుబియోకు లోవరోవ్ చెప్పారని టాస్‌వార్తాసంస్థ పేర్కొంది. పుతిన్–ట్రంప్ మధ్య జరిగిన శిఖరాగ్ర సమావేశంలో ఒప్పందాలకు రష్యా కట్టుబడి ఉంటుందని కూడా రుబియోకు లావరోవ్ స్పష్టం చేశారు. ఏసియన్ సమావేశంలో కూడా లావరోవ్ మాట్లాడుతూ, రష్యాను వ్యూహాత్మకంగా ఓడించేందుకు అస్థిరత్వంలో యూరప్ దేశాలు చేస్తున్న ప్రయత్నాలను తీవ్రంగా ఖండించారు.



**28 నౌకలపై రష్యా దాడులు :** ఈనెల 11 నుండి ఇప్పటివరకూ గడచిన 12 రోజుల్లో ఉక్రేన్ సైనికులకు ఆయుధ సామాగి,ఇంధనం తీసుకువెళుతున్న 28 నౌకలపై దాడి చేసినట్లు రష్యా రక్షణమంత్రిత్వశాఖ గురువారం ప్రకటించింది. ఉక్రేన్ ఓడరేవుల్లో, సముద్ర ప్రయాణ సమయంలో ఈ దాడులు చేసినట్లు పేర్కొంది. చెర్నోమోర్స్క్ ఓడరేవుపై రాత్రిపూట ఈ దాడులు చేసినట్లు పేర్కొంది. మానవ రహిత వాహనాలు దాచిపెట్టేందుకు నీటి అడుగున ఏర్పాటు చేసిన ఒక డాక్ రేవుపై కూడా దాడులు చేసి ధ్వంసం చేసినట్లు తెలియజేసింది. కాగా, రష్యాపైఉక్రేన్ చేసిన దాడుల్లో ఇద్దరు మరణించారు. ఉల్యనోవ్స్క్ చమురు కేంద్రంపై డ్రోన్లతో ఉక్రేన్ దాడులు చేసింది. క్రిమియాపై చేసిన దాడుల్లో మరో నలుగురు మరణించారు. ఇదే సమయంలో 223 ఉక్రేన్ డ్రోన్లను కూల్చివేసినట్లు రష్యా ఒక ప్రకటనలో పేర్కొంది. కాగా రష్యాలో ప్రఖ్యాత ఆన్‌లైన్ మార్కెటింగ్ సంస్థ వైల్డ్ బెరీస్‌కు చెందిన గిడ్డంగులు,లాజిస్టిక్ కేంద్రాలపై ఉక్రేన్ రక్షణ బలగాలు నాలుగురోజుల వ్యవధిలోనే రెండుసార్లు డ్రోన్ దాడులు చేశాయి. ఈ దాడుల్లో తొలుత ఎనిమిది మంది మరణించారు. ఇప్పటివరకూ 90 మంది గాయపడ్డారని సంస్థ వ్యవస్థాపకురాలు టాట్యానా కిమ్ చెప్పారు.

## మెట్టుదిగని ప్రతిపక్షం
(మొదటి పేజీ తరువాయి)

పాటు కూడా జరగవచ్చని ఆయన అన్నారు. అంతేకాకుండా, ఉభయ సభలలో చర్చ తేదీ, వ్యవధిని ప్రతిపక్షాలే నిర్ణయించవచ్చని రిజిజు పేర్కొన్నారు. చర్చను నిర్వహించడంపై ప్రభుత్వం కాంగ్రెస్ మరియు ఇతర ప్రతిపక్ష పార్టీలను సంప్రదించిందన్నారు. సభ తొలుత వాయిదా పడిన తరువాత సభ సమావేశమైనప్పుడు, ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేస్తూ ప్లకార్డులను ప్రదర్శించారు. చాలా మంది సభ్యులు వెల్‌లోకి వెళ్లి నిరసన తెలిపారు. నిరసనలు కొనసాగుతుండటంతో, ఆ రోజుకు నిర్దేశించిన పత్రాలను సభలో ప్రవేశపెట్టిన 10 నిమిషాలకే సభను వాయిదా వేశారు. అంతకుముందు ప్రశ్నోత్తరాల సమయం, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సభ్యులనుద్దేశించి మాట్లాడుతూ, ఇది రోజువారీ కార్యకలాపాలలో ముఖ్యమైన భాగమని, సభ సజావుగా సాగేలా చూడాలని కోరారు. 'ప్రశ్నోత్తరాల సమయం అత్యంత ముఖ్యమైనది. దీని తర్వాత, ప్రతి అంశంపై చర్చించడానికి సభ సిద్ధంగా ఉంది. ప్రభుత్వంతో మాట్లాడతాను, ప్రభుత్వం కూడా చర్చలకు సిద్ధంగా ఉంది. ప్రశ్నోత్తరాల సమయం తర్వాత జరిగే చర్చల్లో సభ్యులందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేస్తున్నాను' అని బిర్లా అన్నారు.

**ప్రధాన్ రాజీనామా చేసే వరకు నీట్ చర్చ ప్రారంభం కాదు : ఖర్గే**

మరో వైపు రాజ్యసభలోనూ ఇవే దృశ్యాలు ఆవిష్కృతమయ్యాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పలు మార్లు సభ వాయిదా పడగా, మధ్యాహ్నం 3 గంటలకు సభ తిరిగి ప్రారంభమైంది. డిప్యూటీ చైర్మన్ హరివంశ్ రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గేను మాట్లాడటానికి అనుమతించారు. దేశ ప్రయోజనాల దృష్ట్యా ప్రతిపక్షం ఏ సవాలునైనా స్వీకరిస్తుందని పేర్కొంటూ, ఖర్గే ఒక లిఖితపూర్వక ప్రసంగంలోని కవితాత్మక వ్యాఖ్యలను చదవడం ప్రారంభించారు. సభకు అధ్యక్షత వహిస్తున్న హరివంశ్, ఖర్గేను తన ప్రసంగాన్ని కొనసాగినివ్వలేదు. ప్రభుత్వం అంగీకరించిన నీట్ పేపర్ లీక్ అంశంపై చర్చను ప్రారంభించడానికి, ప్రతిష్టంభనను తొలగించడానికి మాత్రమే ప్రతిపక్ష నాయకుడికి మాట్లాడే అవకాశం ఇచ్చానని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై సమగ్ర చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, కానీ ప్రతిపక్షం కేవలం నిరసన తెలపడానికే ఆసక్తి చూపిస్తోందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. ఉదయం సభ సమావేశమైన వెంటనే, నీట్ అంశంపై గురువారమే చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, చర్చ నిర్వహణకు ప్రతిపక్షం ఎటువంటి షరతులు విధించకూడదని రిజిజు అన్నారు. అయితే, ఈ అంశంపై చర్చ జరగాలంటే ముందుగా ప్రధాన్ రాజీనామా చేయాలని ఖర్గే అన్నారు. ఇరువర్గాలు నినాదాలు కొనసాగించడంతో, రాజ్యసభ చైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. చర్చ ప్రారంభించడానికి ముందు ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌ను ప్రతిపక్ష పార్టీలు కొనసాగించడంతో సభ కార్యకలాపాలు మళ్లీ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడ్డాయి. పోలీసు లాఠీచార్జ్ కారణంగా చాలా మంది విద్యార్థులు ఆసుపత్రిలో ఉన్నారని, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని ఖర్గే చెప్పారు. 'ప్రధాన్ రాజీనామా చేసే వరకు చర్చ ప్రారంభం కాదు' అని ఖర్గే అన్నారు. ఖర్గే వ్యాఖ్యలకు స్పందిస్తూ, సభ నాయకుడు జె.పి. నడ్డా ప్రతిపక్షం ప్రవర్తన అత్యంత బాధ్యతారాహిత్యంగా ఉందన్నారు.

**స్పీకర్ బిర్లాను కలిసిన రాహుల్‌గాంధీ, అఖిలేశ్ యాదవ్ :**

నీట్ పేపర్ లీక్ అంశంపై చర్చ జరపాలని డిమాండ్ చేస్తూ సభా కార్యకలాపాలకు పదేపదే అంతరాయం కలుగుతున్న నేపథ్యంలో, రాహుల్ గాంధీ, అఖిలేష్ యాదవ్‌లతో సహా అగ్ర ప్రతిపక్ష నాయకులు గురువారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిశారు.ఈ సమావేశానికి టిఎంసి నాయకులు సౌగతా రాయ్, మహువా మొయిత్రా కూడా హాజరయ్యారు. ప్రశ్నోత్తరాల సమయంలో, చర్చ వ్యవధి, తేదీ గురించి చర్చించడానికి తనను కలవాలని బిర్లా ప్రతిపక్ష నాయకులను కోరారు. చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ, ప్రతిపక్షం సూచిస్తే సభా నియమాల ప్రకారం దానికి అనుమతిస్తానని ఆయన అన్నారు.

**బిర్లాతో అమిత్ షా భేటీ :**

నీట్ పేపర్ లీక్‌పై పార్లమెంటులో ప్రతిపక్షాలు నిరంతరంగా నిరసనలు చేస్తున్న నేపథ్యంలో, కేంద్ర హోం మంత్రి అమిత్ షా గురువారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిశారు. చర్చకు అంగీకరించే ముందు విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే షరతును ప్రతిపక్షాలు పెడుతున్నాయని ప్రభుత్వం ఆరోపించింది. నిరంతర గందరగోళం మధ్య లోక్‌సభను గురువారం వాయిదా వేసిన అనంతరం షా, బిర్లాను కలిసినట్లు వర్గాలు తెలిపాయి.

## నిరసనలు
(మొదటి పేజీ తరువాయి)

తెలియజేశాము. జంతర్ మంతర్ లేదా కాన్స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియా వంటి తటస్థ వేదికకు రండి, అక్కడ మనం కలుద్దాం' అని ఆయన మీడియాతో అన్నారు. అయితే, వారి వైపు నుండి తమకు ఇప్పటి వరకు ఎలాంటి సందేశం రాలేదని, ఎక్కడ, ఎప్పుడు కలవాలి, చర్చ ఎంతసేపు కొనసాగాలి అనే విషయాలపై వారు మమ్మల్ని నేరుగా సంప్రదించి చర్చించాలని సౌరభ్ దాస్ డిమాండ్ చేశారు. ప్రశ్నపత్రాల లీకేజీకి పాల్పడిన వారికి కఠిన శిక్షలు పడేలా చూసేందుకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ఏర్పాటు గురించి ప్రధాని మోదీ 'ఎక్స్' ద్వారా చేసిన ప్రకటనపై స్పందిస్తూ ఇలాంటి ప్రకటనలతో ఎలాంటి ప్రయోజనం లేదని, ఇవి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మాత్రమేనని స్పష్టం చేశారు. తమకు జవాబుదారీతనం, బాధ్యత వహించటం కావాలని, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే స్థాయికి దిగివస్తే తప్ప, ఈ విషయంపై తాము ఎవరితోనూ చర్చించబోమని స్పష్టం చేశారు.

**నా కార్యాలయం లేదా నివాసం ఎక్కడికైనా రండి : నడ్డా**

జంతర్ మంతర్ వద్ద 'కాక్రోచ్ జనతా పార్టీ' (సిజెపి) నేతృత్వంలో విద్యార్థులు, యువత, పార్టీ మద్దతుదారులు నిరసనలు మళ్లీ ఉధృతమవుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం దిగొచ్చింది. నిరసన తెలుపుతున్న యువతతో తదుపరి చర్చలకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఈ చర్చలు తన కార్యాలయంలో లేదా నివాసంలో జరగవచ్చని కేంద్ర మంత్రి జె.పి. నడ్డా తెలిపారు. అయితే నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై జంతర్ మంతర్ వద్ద యువత చేపట్టిన నిరసనలకు నాయకత్వం వహిస్తున్న సిజెపి, ప్రభుత్వం జరిపే తదుపరి విడత చర్చలను నిరసన వేదిక వద్ద లేదా తటస్థ ప్రదేశంలోనే నిర్వహిస్తామని ప్రకటించిన నేపథ్యంలో నడ్డా వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. సోమవారం సిజెపి ప్రతినిధులు ఇద్దరు నడ్డా నివాసంలో ఆయనతో మొదటి విడత చర్చలు జరిపారు. ఆ సమయంలో వారు విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో సహా తమ డిమాండ్లను ఆయన ముందు ఉంచారు. కాగా, సిజెపితో మరో విడత చర్చలకు ప్రభుత్వం సిద్ధంగా ఉందా అని అడిగినప్పుడు, పార్లమెంట్ భవన సముదాయంలో గురువారం నడ్డా విలేకరులతో మాట్లాడుతూ 'అవును, మేము సిద్ధంగా ఉన్నాము' అని చెప్పారు. సమావేశ వేదిక గురించి అడిగినప్పుడు, వారు తన నివాసానికి లేదా తన కార్యాలయానికి రావచ్చు అని ఆయన పేర్కొన్నారు. అంతకుముందు రోజు, నడ్డా సిజెపిని చర్చలకు ఆహ్వానించినప్పటికీ, ఆ పార్టీ నాయకులు ఆ ప్రతిపాదనను తిరస్కరించారని సంబంధిత వర్గాలు తెలిపాయి. బుధవారం నాడు కూడా నడ్డాతో చర్చలకు సిజెపికి ఆహ్వానం అందింది, కానీ ప్రభుత్వం జరిపే చర్చలు కేవలం తటస్థ వేదిక వద్దే జరగాలని పేర్కొంటూ వారు ఆ ఆహ్వానాన్ని తిరస్కరించారు.

## ఆందోళనలు (మొదటి పేజీ తరువాయి)

ఎంపిలు 'సిగ్గుపడండి, సిగ్గుపడండి', 'వందేమాతరం' అంటూ నినదించారు. ఎన్‌డిఎకు వ్యతిరేకంగా ప్రతిపక్ష ఎంపిలు 'రాజీనామా చెయ్, పదవి విడిచి పెట్టు, సిగ్గుపడు' వంటి నినాదాలు కూడా చేశారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, పలువురు కాంగ్రెస్, ఇతర పార్టీల ఎంపిలు కూడా ప్రధాన్ రాజీనామా కోరుతూ ఒక పెద్ద బ్యానర్‌ను ప్రదర్శించారు. ఆ తర్వాత రాహుల్ గాంధీ, అఖిలేష్ యాదవ్, ఇతర ఇండియా కూటమి నాయకులు పార్లమెంట్ వెలుపల నిరసనలో చేరారు. సమావేశానికి ముందు, రాహుల్ గాంధీ, యాదవ్, ఇతర ఇండియా కూటమి నాయకులు తమ నిరసనలపై ఒక వ్యూహాత్మక సమావేశం నిర్వహించారు. ప్రతిపక్ష శిబిరం ప్రధాన్ రాజీనామాను డిమాండ్ చేస్తూనే ఉండగా, నీట్ అంశంపై పార్లమెంట్‌లో చర్చించాలని ఎన్‌డిఎ ఎంపిలు డిమాండ్ చేస్తూ ప్రతిపక్షం చర్చ నుండి పారిపోతోందని ఆరోపించారు.

## పీఠిక పతనం (మొదటి పేజీ తరువాయి)

నిలబడటానికి ఇక్కడ ఉన్నామని, తాము న్యాయం పక్షాన నిలబడటానికే ఇక్కడ ఉన్నామని, విద్యార్థులు న్యాయం సాధించాలనే డిమాండ్ సాధించడానికే తాము ఇక్కడ ఉన్నామని, ఆందోళన న్యాయవాదుల కోసం చేయడానికి ఇక్కడ లేమని, ఇది వారికి సంబంధించిన విషయం కాదని చెప్పారు.

## తీవ్ర ఆగ్రహం (మొదటి పేజీ తరువాయి)

సిబ్బందిని మోహరించాలని, హైడ్రా అధికారులు సహా ఎవరైనా అక్కడికి వస్తే వారిని అదుపులోకి తీసుకుని ఆర్మీ బ్యారక్స్‌కు తరలించాలని, అవసరమైతే వారి వాహనాలను కూడా స్వాధీనం చేసుకోవాలని ఆదేశాలు ఇవ్వగలమని స్పష్టం చేశారు. ఇలాంటి వ్యవహారాల్లో సైన్యాన్ని జోక్యం చేసుకోవడం సరైనది కాదని తమకు తెలుసని, అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం, దాని యంత్రాంగంపై పూర్తిగా విశ్వాసం కోల్పోవడంతో న్యాయపాలనను కాపాడేందుకు ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని కోర్టు వ్యాఖ్యానించింది. 'సచివాలయంలో కూర్చున్న వారికీ రాష్ట్రంలో ఏమి జరుగుతోందో తెలియాలి' అని కూడా న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై విచారణలో పిటిషనర్ తరఫు న్యాయవాది ఎం. హరీశ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ, గత విచారణ సందర్భంగా హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్ వివాదాస్పద స్థలంలోకి వెళ్లబోమని కోర్టుకు హామీ ఇచ్చినా, జూలై 21న కేసు వాయిదా పడిన వెంటనే పునరుద్ధరణ పనులను అడ్డుకునేందుకు హైడ్రా అధికారులు, పోలీసులు అక్కడికి వెళ్లారని తెలిపారు. కోర్టు ఉత్తర్వులు చూపించినా పట్టించుకోకుండా పనులను నిలిపివేయాలని ఆదేశించారని, హైడ్రా వాహనాలు స్థలంలో ఉన్న ఫొటోలను కూడా కోర్టుకు సమర్పించారు. అదనపు అడ్వకేట్ జనరల్ మహమ్మద్ ఇమ్రాన్ ఖాన్ మాత్రం హైడ్రా అధికారులు స్థలంలోకి వెళ్లలేదని వాదించగా, ఫొటోలను పరిశీలించిన న్యాయమూర్తి 'ఈ చిత్రాలు చూస్తే కూడా పరిస్థితి అర్థం కావడంలేదా?' అని ప్రశ్నించారు. ఇప్పటికే ఇది మూడో కోర్టు ధిక్కరణ పిటిషన్ అని గుర్తుచేస్తూ, ఎన్ని ఆదేశాలు ఇచ్చినా అధికారులు మారడం లేదని, రెండు రోజుల క్రితమే అడ్వకేట్ జనరల్ హామీతో సంయమనం పాటించామని, అయినా మళ్లీ అదే పరిస్థితి పునరావృతమైందని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ దశలో అడ్వకేట్ జనరల్ ఎ. సుదర్శన్‌రెడ్డి స్వయంగా కోర్టు ముందుకు వచ్చి రాష్ట్ర ప్రభుత్వం తరఫున వివరణ ఇచ్చారు. వివాదాస్పద స్థలంలోకి హైడ్రా అధికారులు వెళ్లలేదని, ఇకపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ భూమిలో జోక్యం చేసుకోరని హామీ ఇచ్చారు. ప్రభుత్వ అత్యున్నత న్యాయాధికారి ఇచ్చిన ఈ హామీని పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి, అదే విషయాన్ని అఫిడవిట్ రూపంలో వెంటనే దాఖలు చేయాలని ఆదేశించారు. అలాగే సైన్యాన్ని మోహరించడం, పది మంది సైనికులను నియమించడం తదితరంగా తాము జారీ చేసిన ఆదేశాల అమలును తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. అఫిడవిట్‌ను పరిశీలించిన తర్వాత తదుపరి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేస్తూ విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు.

(మొదటి పేజీ తరువాయి)

హయాంలో 10 వ తరగతి పేపర్ లీక్ అయిందని, ఇంటర్ పేపర్లు దిద్దడంలో స్కామ్ జరిగిందన్నారు. గ్రూప్–1 పేపర్లు అమ్ముకున్నారని సిఎం ఆరోపించారు. గ్లోబారీనపై విజిలెన్స్ విచారణ జరుగుతోందని సిఎం వెల్లడించారు. గ్లోబరీనా సంస్థ తప్పుదాలపై కెటిఆర్ క్షమాపణలు చెప్పి అమరవీరుల స్థూపం వద్ద ముక్కు నేలకు రాయాలని సిఎం డిమాండ్ చేశారు. ఈ గ్లోబరినాను ఆదర్శంగా తీసుకుని నీట్ పేపరు లీక్ జరిగిందని సిఎం వ్యాఖ్యానించారు. అసెంబ్లీ భవనాల మరమ్మతు, పునరుద్ధరణ పనులను పరిశీలించేందుకు గురువారం అసెంబ్లీకి వచ్చిన ముఖ్యమంత్రి తనను కలిసిన మీడియా ప్రతినిదులతో ఇష్టాగోస్టిగా మాట్లాడారు. జన్వాడ పామ్ హౌస్ భూములు ఏ రాజు నుండి కెటిఆర్ కు వచ్చాయని సిఎం ప్రశ్నించారు. జన్వాడ భూములు నావి కావని కెటిఆర్ ను ఒప్పుకోవాలని, ప్రభుత్వానికి ఫిర్యాదు చేయాలని, విచారణ చేయించమని కెటిఆర్ ముందుకు వచ్చి డిమాండ్ చేయాలని సిఎం అన్నారు.

**సిబిఐని బిఆర్‌ఎస్ నేతలు మేనేజ్ చేసుకున్నందునే విచారణ జరగడంలేదు :** కాళేశ్వరం వ్యవహారంలై వీళ్ళను జైల్లో పెట్టడానికి సిబిఐ వద్ద అధికారం ఉందని, కానీ బిఆర్‌ఎస్ నేతలు సిబిఐని మేనేజ్ చేసుకున్నారని, అందుకే ఈ విషయంలో సిబిఐ తరపు నుంచి ఏలాంటి విచారణ జరగడంలేదని సిఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. అందుకు కృతజ్ఞతగా రాష్ట్రంలో బిఆర్‌ఎస్ అవయవదానం చేసి బిజెపికి 8 ఎంపి సీట్లు ఇచ్చారన్నారు.

## బిఆర్ఎస్ నోరుమెదపదేం?

లోకసభ ఎన్నికల్లో సిద్దిపేటలో బీజేపీకి ఎందుకు మెజారిటీ వచ్చిందని ఆయన ప్రశ్నించారు. కెసిఆర్ కుటుంబం ఉన్న మూడు అసెంబ్లీ స్థానాల్లోను లోక్ సభ ఎన్నికల్లో బిజెపికి మెజారిటీ వచ్చిందని, మెదక్ లోక్ సభ స్థానంలో ఒక్క దుబ్బాక తప్ప మిగతా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో బిజెపికి ఎక్కువ ఓట్లు వచ్చాయని సిఎం గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో న్‌డిఎస్ఎ ఆదేశాలను ప్రభుత్వం పాటిస్తోందన్నారు. మేడిగడ్డ అంటే చెప్పుతో కొడతారు కాబట్టి బిఆర్‌ఎస్ నేతలు కన్నెపల్లి పంపు హౌస్‌ను పదేపదే ప్రస్తావిస్తున్నారన్నారు. బ్యారేజి కూలిపోయింది బిఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే కదా, ఆ ప్రభుత్వంలో కాపర్ డ్యామ్ ఎందుకు కట్టలేదని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కట్టమని ఎందుకు డిమాండ్ చేస్తున్నారని సిఎం ప్రశ్నించారు. ఎన్‌డిఎస్ఎ పి.సి.ఘోష్ కమిషన్, విజిలెన్స్ కమిషన్ కాళేశ్వరంపై రిపోర్టు ఇచ్చాయని, ఎన్‌డిఎస్ఎకు కేంద్ర ప్రభుత్వం చట్టబద్దత కల్పించిందన్నారు. అప్పుడు బిఆర్‌ఎస్ ఎంపిలు పార్లమెంట్‌లో దానికి అనుకూలంగా ఓటు వేశారని సిఎం గుర్తు చేశారు. హరీష్ రావుకు రెండవ సారి ఎందుకు ఇరిగేషన్ మంత్రి పదవి కెసిఆర్ ఇవ్వలేదో సమాధానం చెప్పాలని సిఎం ప్రశ్నించారు. బిజెపి నేతల అంతర్గత కలహాలతో కాంగ్రెస్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని సిఎం రేవంత్ రెడ్డి విమర్శించారు.

**కాంగ్రెస్ అనుమతించిన ధర్నా చౌక్‌లోనే కెటిఆర్ ధర్నా**

కెసిఆర్ ప్రభుత్వం అప్పట్లో ప్రజాస్వామ్య పద్ధతుల్లో నిరసన వ్యక్తం చేసే అవకాశాన్ని కూడా లేకుండా చేసిందని సిఎం అన్నారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతించిన ధర్నా చౌక్ వద్ద కెటిఆర్ ధర్నా చేస్తున్నారని సిఎం తెలిపారు. మోదీ పర్మిషన్ ఇచ్చినట్టు ఉన్నారని, అందుకే శుక్రవారం బిఆర్‌ఎస్ నేతలు ధర్నా చేస్తున్నారని సిఎం వ్యాఖ్యానించారు. అయినా రాష్ట్రంలో శాంతియుతంగా ధర్నాలు, నిరసనలు తెలుపవచ్చని, ప్రభుత్వానికి అభ్యంతరం ఉండదని సిఎం స్పష్టం చేశారు.

**ఓట్లు లేకుంటే ప్రభుత్వ పథకాలు ఎలా వస్తాయి?**

రాష్ట్రంలో జరుగుతున్న ఎస్ ఐ ఆర్ ప్రక్రియను ప్రస్తావిస్తూ ప్రక్షాళన పేరుతో ఓట్లు తొలగించే అవకాశం ఉందని, అలా జరగకుండా ఉండేందుకు బిఎల్‌ఏలను పెట్టామని, ఓట్లు లేకుంటే ప్రభుత్వ పథకాలు ఎలా వస్తాయని సిఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ఓటు పోతే సంక్షేమ పథకాలు ఆగిపోయే అవకాశం ఉంన్నారు. ఓటర్ల జాబితా ప్రక్షాళన వేళ ప్రతి ఒక్కరూ తమ ఓటును జాబితాలో ఉండేలా చూసుకోవాలని కోరారు. ఈ విషయంలో బిఎల్‌ఓల పాత్ర కీలకమైనందున పార్టీ నాయకులు క్షేత్ర స్థాయిలో ఉండి పర్యవేక్షించాలని చెప్పారు.

**నాకు రెండు ఓట్లు లేవు :** తనకు రెండు ఓట్లు లేవని, కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకుని తన ఓటు కొడంగల్‌కు బదిలీ చేయించుకున్నానని సిఎం తెలిపారు. ఒక వేళ రెండు ఓట్లు ఉన్నాయని ఎవరైనా ఫిర్యాదు చేస్తే విచారణ చేయిస్తానని, లేవని తేలితే ఫిర్యాదు ఇచ్చిన వారిపై చట్టపరమైన చర్యలుంటాయని సిఎం హెచ్చరించారు. కెసిఆర్ సిఎంగా ఉన్నప్పుడు కమిషనర్ సోమేష్ కుమార్ జిహెచ్‌ఎంసిలో 28 లక్షల ఓట్లు తొలగించారని, జిహెచ్‌ఎంసి పరిధిలో ఉన్న ఆంధ్ర ఓట్లన్నీ తొలగించారని, దీనిపై కాంగ్రెస్ పార్టీ కోర్టుకు వెళితే జిహెచ్‌ఎంసి కమిషనర్‌పై న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసిందన్నారు. ఆ తర్వాత సోమేష్ కుమార్ సస్పెండ్ అయ్యే పరిస్థితి వచ్చిందన్నారు. వీటన్నిటికి మూల పురుషుడు కెసిఆర్, కాగా, ఇప్పుడు కేంద్రం అదే పని చేస్తోందని సిఎం విమర్శించారు. ఇందిరమ్మ ఇండ్లకు ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. బిఆర్‌ఎస్ పాలన లో ఇండ్లను దళారులకు అమ్ముకున్నందునే ప్రజలు వాళ్ళను వెల్లగొట్టారన్నారు. నేడు పేదలకు లాభం జరుగుతుంటే జీర్ణం చేసుకోలేకపోతున్న బిఆర్‌ఎస్ నేతలు ఇందిరమ్మ ఇళ్ల పథకంపై విమర్శలు చేస్తున్నారన్నారు.

హైడ్రా అద్భుతంగా పని చేస్తోందని, కబ్జాకు గురైన చాలా ప్రభుత్వ ఆస్తులను హైడ్రా స్వాధీనం చేసుకుందని చెప్పారు. బిఆర్‌ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్లపై, ఎవరెన్ని ఉద్యోగాలు ఇచ్చారన్న అంశంపై అసెంబ్లీలో చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని సిఎం ప్రకటించారు. కేసీఆర్ కుటుంబ సభ్యుల ఉద్యోగాలు పోతే వారికి వెంటనే ఉద్యోగాలు ఇచ్చారని, పేద విద్యార్థులకు ఉద్యోగాలు ఇవ్వలేదని ఆయన విమర్శించారు. కాగా, తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పటికీ హైదరాబాద్‌లో తాగు నీటి సమస్య లేదని సిఎం చెప్పారు. ట్రంప్ మనకు పెట్టుబడులు పెట్టాడు కాబట్టి ఆయన పేరు పెట్టామని, ఎవరు పెట్టుబడులు పెట్టినా వారి పేరు మీద పెడతామమని సిఎం ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు.

# టీమిండియాకు తొలి విజయం



జింబాబ్వే X భారత్ టీ 20 సిరీస్

టీ20ల్లో వరసగా ఆరు ఓటములతో అవమాన పడ్డ భారత జట్టు గెలుపు బాట పట్టింది. అనుకున్నట్టే జింబాబ్వే పర్యటనను భారీ విజయంతో ఆరంభించి సిరీస్‌లో ముందంజ వేసింది. టీ20ల్లో వరసగా ఆరు ఓటములతో అవమాన పడ్డ భారత జట్టు గెలుపు బాట పట్టింది. అనుకున్నట్టే జింబాబ్వే పర్యటనను భారీ విజయంతో ఆరంభించి సిరీస్‌లో ముందంజ వేసింది. 126 పరుగుల స్వల్ప ఛేదనలో వైభవ్ సూర్యవంశీ(50) మెరుపు ఇన్నింగ్స్‌తో అంతర్జాతీయంగా మొదటి అర్ధ శతకం నమోదు చేయగా.. ఇషాన్ కిషన్(35) దంచేశాడు. 11 ఓవర్లకే స్కోర్ వంద దాటేయగా.. తిలక్ వర్మతో కలిసి కెప్టెన్‌గా శ్రేయాస్ అయ్యర్(28 నాటౌట్) లాంఛనం ముగించాడు. ఏడు వికెట్లతో గెలుపొందిన భారత్ 10తో ఆధిక్యంలోకి దూసుకెళ్లగా.. కెప్టెన్‌గా అయ్యర్ తొలి విజయాన్ని రుచి చూశాడు. స్వదేశంలో ఇటీవలే బంగ్లాదేశ్‌పై టెస్టు సిరీస్ విజయం, టీ20లో గెలుపుతో జోరు మీదున్న జింబాబ్వేకు గట్టి షాకిచ్చింది భారత్. తొలుత బౌలర్ల ప్రదర్శనతో 125కే కట్టడి చేసిన టీమిండియా.. స్వల్ప లక్ష్యాన్ని 13.2 ఓవర్లలోనే ఉఫ్‌మనిపించింది. ఇంగ్లండ గడ్డపై విఫలమైన ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ(50) పిడుగల్లే రెచ్చిపోగా చూస్తుండగానే చిన్నపాటి లక్ష్యం మంచుముక్క కంటే వేగంగా కరిగిపోయింది. ఇన్నింగ్స్ రెండో ఓవర్లోనే రెండు సిక్సర్లు, ఫోర్ బాదిన సూర్యవంశీ ఐపీఎల్ తరహా విధ్వంసాన్ని కళ్లకు కట్టాడు. మరో ఓపెనర్ అభిషేక్ శర్మ(1) త్వరగా ఔటయ్యాక.. సూర్యవంశీ మరింత రెచ్చిపోయాడు. ముజరబనిని బాదేస్తూ.. 5వ ఓవర్లో రెండు ఫోర్లు, సిక్సర్ కొట్టి అర్ధ శతకానికి చేరువయ్యాడు. ఇషాన్ కిషన్(35) సైతం మూడు ఫోర్లు సంధించగా 6 ఓవర్లకే స్కోర్ 68కి చేరింది. ఆ తర్వాతి ఓవర్లోనే డబుల్స్‌తో 18 బంతుల్లోనే హాఫ్ సెంచరీ అందుకున్న వైభవ్.. వెంటనే ఔటయ్యాడు. అనంతరం.. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(28 నాటౌట్) జతగా కిషన్ చెలరేగాడు. వీరిద్దరు ధనాధన్ ఆడి 11 ఓవర్లకే స్కోర్ వంద దాటించారు. ఇషాన్ ఔటైనా.. వైస్ కెప్టెన్ తిలక్ వర్మ(6 నాటౌట్) సాయంతో అయ్యర్ లాంఛనం ముగించాడు. 7 వికెట్లతో గెలుపొందిన భారత్ మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆధిక్యంలోకి వెళ్లింది.

## యాషెస్ షెడ్యూల్ విడుదల

### ఏకకాలంలో అబ్బాయిలు, అమ్మాయిల మ్యాచ్‌లు!

టెస్టు క్రికెట్‌లోని గొప్ప పోరాటాల్లో ఒకటిగా పేరొందిన యాషెస్ సిరీస్ షెడ్యూల్ వచ్చేసింది. వచ్చే ఏడాది ఇంగ్లాండ్ వేదికగా జరుగునున్న సిరీస్ తేదీలను గురువారం ఇంగ్లాండ్ వేల్స్ క్రికెట్ బోర్డు వెల్లడించింది. ఈసారి ఏకకాలంలో ఆస్ట్రేలియా పురుషుల, మహిళల జట్లు ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లనున్నాయి. తొలుత పురుషుల యాషెస్ జూన్ 18 నుంచి ట్రెంట్ బ్రిడ్జ్ వేదికగా మొదలవ్వనుంది. ఆపై జూన్ 24న మహిళల ఏకైక యాషెస్ టెస్టు హెడింగ్లే మైదానంలో జరుగనుంది. గత యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియా గడ్డపై చావుదెబ్బ తిన్న ఇంగ్లాండ్ ప్రతీకారానికి సిద్ధమవుతోంది. అప్పటి ఓటమికి బదులు తీర్చుకునేందుకు వచ్చే ఏడాది జూన్‌లో సిరీస్ నిర్వహణకు సిద్ధమవుతోంది ఇంగ్లాండ్ వేల్స్ బోర్డు. గురువారం యాషెస్ ఐదు మ్యాచ్‌ల సిరీస్ షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈసారి ఏకకాలంలో ఆసీస్ పురుషుల, మహిళల జట్లు ఇంగ్లాండ్‌లో పర్యటించేలా సిరీస్‌ను ప్లాన్ చేసింది ఇసిబి. ఓవల్‌లో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025–27 ఫైనల్ (జూన్ 913) ముగియగానే యాషెస్ సిరీస్ షురూ కానుంది. ఇంగ్లండ ఆస్ట్రేలియా పురుషుల జట్ల మధ్య జూన్ 18న ట్రేండ బ్రిడ్జ్‌లో తొలి టెస్టు మొదలవ్వనుంది. మహిళల యాషెస్ ఏకైక టెస్టు జూన్ 24న లీడ్స్‌లోని హెడింగ్లే స్టేడియంలో జరుగనుంది.

**పురుషుల యాషెస్ షెడ్యూల్**

1. మొదటి టెస్టు – జూన్ 18 22 ట్రెంట్ బ్రిడ్జ్(నాటింగమ్)
2. రెండో టెస్టు జూన్ 30 జూలై 4, లారడ్స్ (లండన్)
3. మూడో టెస్టు జూలై 8 12, ఎడ్జ్‌బాస్టన్(బర్మింగ్‌హమ్)
4. నాలుగో టెస్టు జూలై 2125, రోస్ బౌల్(సౌతాంప్టన్)
5. ఐదో టెస్టు జూలై 29 ఆగస్టు 2, ది ఓవల్ (లండన్)

## చైనా ఓపెన్ నుంచి పివి సింధు నిష్క్రమణ

### ప్రీక్వార్టర్స్‌లో చెన్ చేతిలో ఓటమి



చైనా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ నుంచి భారత స్టార్ షట్లర్ పీవీ సింధు ప్రీక్వార్టర్ ఫైనల్లోనే నిష్క్రమించింది. గురువారం జరిగిన ఉత్కంఠభరిత పోరులో ప్రపంచ నాలుగో ర్యాంకర్, చైనా స్టార్ చెన్ యుఫేయియా.. పీవీ సింధుపై 16–21, 22–20, 21–18 తేడాతో విజయం సాధించింది. ఒక గంటా 29 నిమిషాలపాటు సాగిన ఈ మ్యాచ్‌లో చివరి వరకు ఇద్దరూ హోరాహోరీగా తలపడ్డారు. ఇటీవల జపాన్ ఓపెన్‌లో టైటిల్ గెలిచి మంచి జోష్‌లో ఉన్న సింధు తొలి గేమ్‌ను అద్భుతంగా కైవసం చేసుకుంది. రెండో గేమ్‌లోనూ విజయం అంచుల వరకు వెళ్లిన ఆమె నాలుగు మ్యాచ్ పాయింట్లను సద్వినియోగం చేసుకోలేకపోయింది. ఆ అవకాశాన్ని అందిపుచ్చుకున్న యుఫేయియా రెండో గేమ్‌ను గెలిచి మ్యాచ్‌ను నిర్ణయాత్మక మూడో గేమ్‌కు తీసుకెళ్లింది. మూడో గేమ్‌లోనూ ఇద్దరూ నువ్వానేనా అన్నట్లుగా పోరాడినా, చివర్లో యుఫేయియా కీలక పాయింట్లు సాధించి విజయాన్ని ఖాయం చేసుకుంది. దాంతో గతవారం జపాన్ ఓపెన్ సెమీఫైనల్లో ఎదురైన ఓటమికి యుఫేయియా ప్రతీకారం తీర్చుకున్నట్లైంది. ఈ ఓటమితో చైనా ఓపెన్‌లో సింధు పోరాటం ముగిసింది.

## పోటీ కోసం జైకె

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

## సహారా అంతర్జాతీయ విమానాశ్రయం గల నగరం

- ప్రపంచంలో 'పండ్ల' ఉత్పత్తిలో ప్రథమ స్థానంలో ఉన్న దేశం ఏది?
  భారత్
- కొబ్బరి దీనికి ఉదాహరణ
  ఏకలింగ పుష్పము
- రబ్బరు ఉత్పత్తిలో ముఖ్య దేశం ఏది?
  మలేషియా
- రక్తం గడ్డకట్టడానికి అవసరమయ్యే విటమిన్ ఏది?
  'K' విటమిన్
- పంచదార, ఎరువులు, కాగితం పరిశ్రమలలో ఉపయోగింపబడే ఖనిజం:
  సున్నపురాయి
- ప్రాచీన ఆర్యులు ఇచట స్థిరపడ్డారు
  సింధులోయ
- పహ్లవి అనేది:
  ఒకలిపి
- 'దాద్రా నగర్ హవేలి' రాజధాని
  సిల్వసా
- రాజ్యసభకు అధిపతి.
  ఉపరాష్ట్రపతి
- బృహస్పతి గ్రహం చుట్టూ తిరిగే ఉపగ్రహాలెన్ని?
  16
- ప్రభుత్వ ఉద్యోగాల్లో సమాన అవకాశాలు కల్పించిన ఆర్టికల్ ఏది?
  16
- రేడియో తరంగాలు ఏ ఆవరణలో విస్తరించి ఉంటాయి?
  ఐనో ఆవరణం
- అంటరానితనాన్ని నిషేధించిన ఆర్టికల్ ఏది?
  17
- సిమ్లా సమావేశం?
  1945
- భారత రాజ్యాంగం హామీ ఇచ్చిన ప్రాథమిక హక్కులు ఎన్ని?
  6
- రైన్ డీర్ ఇచ్చట కన్పిస్తుంది.
  టంద్రాలలో
- కప్ప లార్వా దేన్ని పోలి ఉంటుంది.
  చేప
- డెంగీ వ్యాధి కారకమైన సూక్ష్మ క్రిమి
  ఫ్లావి వైరస్
- పిల్లలకు పాలిచ్చే ఆడ, మగ జంతువులు
  ఎకిడ్నా
- కిరసనాయిల్తో వీటిని చంపడం తేలిక
  దోమ లార్వాలను
- ఐస్క్రీం పాత్రలు తయారుచేయుటకు ఉపయోగించునది
  సోయా చిక్కుడు జిగురు
- భారతదేశంలో పౌరసత్వం స్వభావం ఏమిటి?
  ఏకపౌరసత్వం
- చట్ట సమానత్వాన్ని (చట్టం ముందు అందరూ సమానమే) తెలియజేసే ఆర్టికల్ ఏది?
  14
- 1956లో పుదుచ్చేరిని భారతదేశానికి అప్పగించిన దేశం?
  ఫ్రాన్స్
- ప్రాథమిక హక్కులను రాజ్యాంగంలోని ఏ భాగంలో పొందుపరిచారు?
  3 వ భాగంలో
- భారతదేశ సంస్కృతి ఈ దేశం ద్వారా విదేశాలకు వ్యాపించింది:
  ఇరాన్
- ఈజిప్టు దేశపు ముఖ్య పరిశ్రమ:
  నూలు వస్త్రాల ఉత్పత్తి
- భారత్ చైనాల యుద్ధం :
  1962
- ఇప్పటివరకు రాజ్యాంగ ప్రవేశికను ఎన్నిసార్లు సవరించారు?
  ఒకసారి
- ఇందులో ఏ సంస్థానంపై విలీనీకరణ సందర్భంగా పోలీసు చర్య తీసుకోవలసి వచ్చింది?
  జునాఘడ
- ప్రాథమిక హక్కులను ఏ దేశ రాజ్యాంగం నుంచి స్వీకరించారు?
  అమెరికా
- దండి సత్యాగ్రహంతో సంబంధం ఉన్న దండి గ్రామం గుజరాత్లోని ఏ జిల్లాలో ఉంది?
  నౌసారి
- స్త్రీ, పురుష నిష్పత్తి ఎక్కువగా ఉన్న మొదటి రెండు రాష్ట్రాలు?
  కేరళ, తమిళనాడు
- ఉత్తర్ ప్రదేశ్ రాజధాని :
  లక్నో
- ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ను తయారుచేయుటలో ఉపయోగించు అలోహ ఖనిజం:
  జిప్సం
- పెద్దపులి రక్షించబడే శాంక్చుయరీ
  కవాల్
- దీని వాడకం వాతావరణాన్ని కాలుష్యం చెయ్యదు
  సహజవాయువు
- ఎట్నా అగ్నిపర్వతం గల ప్రాంతం
  సిసిలీ
- స్వదేశ సంస్థానాల విలీనీకరణ ఘనత ఇతనికి దక్కుతుంది?
  సర్దార్ వల్లభాయిపటేల్
- గాంధీజీకి 'మహాత్మా' అనే బిరుదును ఇచ్చింది ఎవరు?
  రవీంద్రనాథ్ ఠాగూర్
- కొండ ప్రాంతాలకు మాత్రమే పరిమితమైన రైలు మార్గం ఏది?
  నేరోగేజ్
- మంత్రిత్రయ రాయబారం జరిగిన సంవత్సరం?
  1946
- గాంధీజీ, అంబేద్కర్ మధ్య ఒప్పందం జరగడానికి కృషి చేసిన వ్యక్తి ఎవరు?
  మదన్ మోహన్ మాలవీయ
- మధ్యప్రదేశ్ రాష్ట్రం ఈ ఖనిజాన్ని అధికంగా ఉత్పత్తి చేస్తున్నది?
  వజ్రాలు
- సహారా అంతర్జాతీయ విమానాశ్రయం గల నగరం?
  ముంబయి



## 31న 'అదే నీవు అదే నేను'



కమిటీ కుర్రోళ్లు మూవీ ఫేమ్ త్రినాథ్ వర్మ, యశ్వంత్ పెండ్యాల, 'సిద్ధార్థ్ రాయ్' సినిమా ఫేమ్ తన్వీ నేగి, సహర్ కృష్ణన్ హీరో హీరోయిన్స్ గా నటిస్తున్న సినిమా 'అదే నీవు అదే నేను'. ఈ చిత్రాన్ని శ్రీ లక్ష్మి వీరభద్ర క్రియేషన్స్ బ్యానర్ పై గోవింద కాంద్రేగుల నిర్మిస్తున్నారు. రొమాంటిక్ థ్రిల్లర్ కథాంశంతో యువ దర్శకుడు కొండల్ రూపొందిస్తున్నారు. 'అదే నీవు అదే నేను' సినిమా సెన్సార్ సహా అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని ఈ నెల 31న థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ సినిమా నుంచి ఇప్పటికే ప్రముఖ నిర్మాత దిల్ రాజు చేతుల మీదుగా రిలీజ్ చేసిన టీజర్ 1 మిలియన్ వ్యూస్ తో డిజిటల్ మీడియాలో దూసుకెళ్తోంది. స్టార్ డైరెక్టర్ వి వి వినాయక్ చేతుల మీదుగా లాంఛ్ చేసిన మనసా మనసా సాంగ్ హ్యూజ్ రెస్పాన్స్ దక్కించుకున్నాయి. ఈ చిత్రం నుంచి మధురమా పాటను క్రియేటివ్ డైరెక్టర్ క్రిష్ రిలీజ్ చేయబోతున్నారు. ప్రముఖ నటుడు తనికెళ్ల భరణి, యంగ్ హీరో ఆకాష్ పూరి, నటి ఇంద్రజ మూవీ టీమ్ కు బెస్ట్ విశెస్ అందించారు. ఇలా చిత్ర పరిశ్రమలోని పలువురు ప్రముఖుల బెస్ట్ విశెస్ అందుకున్న అదే నీవు అదే నేను సినిమా మీ సమీప థియేటర్స్ లో రిలీజ్ కు వస్తోంది. ఒక గేటెడ్ కమ్యూనిటీలో జరిగే సరికొత్త రొమాంటిక్ థ్రిల్లర్ కథతో అన్ని వర్గాల ప్రేక్షకులకు ఆద్యంతం ఆసక్తిని పంచేలా ఈ సినిమా ఉండబోతోంది. 'అదే నీవు అదే నేను' సినిమా విజయంపై మూవీ టీమ్ పూర్తి నమ్మకంతో ఉన్నారు. ఈ చిత్రానికి ఆర్ట్ డైరెక్టర్ నార్ని శ్రీనివాస్, లిరిక్స్ పూర్ణాచారి, డైలాగ్స్ వై.అమ్మిరాజు, డీవోపీ నిమ్మల జయపాల్ రెడ్డిఎడిటర్ ఛోటా కె ప్రసాద్, మ్యూజిక్ కనిష్క.

## చిన్న సినిమాల్లోనే మంచి కంటెంట్ ఉంది

విజయశాంతి

చిన్న సినిమాల్లోనే మంచి కంటెంట్ వస్తోందని ప్రముఖ నటి, ఎమ్మెల్సీ విజయశాంతి వ్యాఖ్యానించారు. కొత్త వాళ్ళు మంచి కంటెంట్ తో ముందుకు వస్తున్నారని అన్నారు. కామాఖ్యా అనే సినిమా కార్మాఖ్య గా పేరు మారిన నేపథ్యంలో ప్రసాద్ ల్యాబ్ లో జరిగిన కార్యక్రమంలో విజయశాంతి సినిమా ట్రైలర్ ను విడుదల చేశారు. ఈ స్నాదర్భంగా ఆమె మాట్లాడుతూ సినిమా మీద నమ్మకం పెట్టుకోవాలి తప్ప సినిమా ఆడకపోతే గుండు గీయించుకుంటాను అంటూ ఛాలెంజ్ గా మాట్లాడకూడదని దర్శకుడు అభినయ్ కృష్ణకు హితవు పలికారు. సినిమాలో అందరూ చాలా చక్కగా నటించారని అన్నారు. సహాయ నటి శరణ్య ప్రదీప్ ను అభినందించారు. తెలంగాణ బిడ్డగా శరణ్య చాలా బాగా అంటిస్తోందని అన్నారు. శరణ్య చేసిన సినిమాలు కొన్ని చూశానని విజయశాంతి పేర్కొన్నారు. కొత్తగా పరిచయం అవుతున్న హీరోయిన్ సమైరా చాలా చక్కగా నటించిందని అన్నారు. ఇది లేడి ఓరియెంటేడ్ సినిమాలా అనిపించిందని ఆమె చెప్పారు. సమైరా కు మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. ఇలాంటి మంచి సినిమాలు రావాలని చెప్పారు. చిన్న సినిమాలను మీడియా భుజాలమీద పెట్టుకుని పబ్లిసిటీ ఇవ్వాలని అన్నారు. మేమెంత చిన్న సినిమాల నుంచే వచ్చామని విజయశాంతి పేర్కొన్నారు. ఈ సినిమాలో సంగీతం కూడా బాగుందని చెప్పారు. ప్రస్తుతానికి తన ద్రుష్టి అంత రాజకీయాలపనేనని అన్నారు. మంచి కథలు వస్తే ఆలోచిస్తానని చెప్పారు. మాజీ ఎంపీ మధు యాష్కీ గౌడ్ మాట్లాడుతూ కార్మాఖ్య సినిమా నిర్మాతలు తనకు ఎప్పటి నుంచో పరిచయమన్నారు. ట్రేలర్ బాగుందని ఈ సినిమా సక్సెస్ కావాలని అయన ఆకాంక్షించారు. చిత్ర దర్శకుడు అభినయ కృష్ణ మాట్లాడుతూ ఈ సినిమా ఖచ్చితంగా థియేటర్ కు వచ్చిన ప్రేక్షకులకు థ్రిల్ ఇస్తుందని అన్నారు. థ్రిల్ ఇవ్వకపోతే తాను గుండు కొట్టించుకుంటానని ఆయన శపథం చేశారు. ఒక సంఘటన చుట్టూ జరిగే కథతో చాలా ఇంట్రెస్ట్ గా తీశానని అన్నారు. ఇద్దరు ఫ్రెండ్స్ మధ్య జరిగే కథ అని పేర్కొన్నారు. హీరోయిన్ సమైరా మాట్లాడుతూ ఈ సినిమాలో తొలిసారిగా తెలుగు ప్రేక్షకుల ముందుకు వస్తున్నానని , తనను ఆశీర్వదించాలని కోరారు. నటుడు విజయ్ భాస్కర్, దర్శక నిర్మాతలు మాట్లాడారు.



## రీల్





## ప్రజాస్వామ్యాన్ని కాపాడే 'జన నాయకుడు'

రివ్యూ

దేశాన్ని పరిపాలిస్తున్న పాలకులు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చెయ్యడానికి ప్రజల మధ్య ఎలాంటి విభేదాలు సృష్టిస్తున్నారు ? ప్రజలను ఎలా రెచ్చగొడుతున్నారు? ప్రలాలను కేవలం ఓటు వేసే మిషన్లు లాగే చూస్తున్నారా ? ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే ఏం చెయ్యాలి వంటి అంశాలను ఇతివృత్తంగా తీసుకుని తెరకెక్కించిన సినిమా 'జన నాయకుడు'. ఒక్క ముక్కలో చెప్పాలంటే కేంద్రంలో పరిపాలిస్తున్న బిజెపి సర్కార్‌ను ఉతికి ఆరేశారని చెప్పవచ్చు.తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ నటించిన చివరి చిత్రం ఇది. జన నయగన్ పేరుతో తమిళంలో, జన నాయకుడు పేరుతో తెలుగులో గురువారం(23వ తేదీన) విడుదలైంది. జన నాయకుడు సినిమా చూసినంత సేపు తెలుగులో గతంలో వచ్చిన బాలకృష్ణ సినిమా ' భగవంత్ కేసరి' సినిమానే కనిపిస్తుంటుంది. భగవంత్ కేసరి సినిమాను యాజిటీస్ గా తీశాడని చెప్పవచ్చు. అంతేకాదు ఒక సన్నివేశంలో హీరో పెంచి పోషించిన అమ్మాయితో జై బాలయ్య అని కూడా చెప్పించాడు దర్శకుడు. నిజానికి విజయ్ రాజకీయాల్లోకి వచ్చే ముందు చివరి సినిమాగా తీసిన ఈ సినిమా సెన్సార్ బోర్డర్ క్లియరెన్స్ ఇవ్వకపోవడంతో తమిళనాడు ఎన్నికలకు ముందు విడుదల కాలేదు. విజయ్ ముఖ్యమంత్రి అయినాక విడుదలైన తొలి చిత్రం ఇదే. అందుకే సినిమా టైటిల్స్‌లో ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ అని కూడా వేశారు. భగవంత్ కేసరి సినిమా థీమ్ ను తీసుకుని నిర్మించిన ఈ సినిమాలో మమితా బైజు, పూజా హెగ్డే, బాబీ డియోల్ ప్రధాన తారాగణం. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కే నారాయణ్ నిర్మించారు.దళపతి వెట్రి కొండాన్ (విజయ్) పోలీస్ అధికారి. తాను జైలులో ఉన్న సమయంలో అత్యంత దగ్గరైన జైలర్ మరణించడంతో అతని కుమార్తెను కన్న బిడ్డలా చూసుకుంటాడు. ఆమెను మిలిటరీ ఆఫీసర్ గా చేయాలన్నది వెట్రి ఆశయం. విజ్జి (గా మమితా బైజు నటించింది. బాలకృష్ణ శ్రీలీల , బాలయ్య కాజల్ సన్నివేశాలు, గూడ్ టచ్ బ్యాడ టచ్ ఎపిసోడ్ హీరో బ్యాక్ డ్రాప్ వరకు తీసుకున్నారు. బాబీ డియోల్, ప్రకాష్ రాజ్ విలన్ రోల్స్ కొత్తగా రాశారు. విజయ్ ఇమేజ్, ఆయన స్టైల్ & మేనరిజమ్స్ దృష్టిలో పెట్టుకుని కథలో మార్పులు చేర్పులు చేశారు. ఇక్కడ విజయ్ సరసన పూజ హెగ్డే (కాయల్) జర్నలిస్ట్ పాత్రలో నటిచింది. విజయ్ కు అమ్మగా రేవంతి నటించింది. ప్రియమణి ఉన్నత స్థాయి అధికారిగా ఉండి విలన్ గా మారిపోతుంది. పోలీస్ అధికారిగా ఉన్న బాబీ డియోల్ పొలిటీషియన్ ప్రకాష్ రాజ్ (రోజా రంగస్వామి) తో చేతులు కలిపుతాడు. ఒక సన్నివేశంలో ప్రకాష్ రాజ్ జైలులో ఉండగా అతని దగ్గరికి వెళ్లిన బాబీ డియోల్ (జాన్ హిమ్లర్ )ఇలా అన్నాడు. '' వచ్చే ఎన్నికల్లో నువ్వు ముఖ్యమంత్రి, నేను ఉప ముఖ్యమంత్రి'' అని చెప్పే సన్నివేశం ఆంధ్ర రాష్ట్రంలో చంద్రబాబు జైలులో ఉన్నప్పుడు పవన్ కళ్యాణ్ వెళ్లి పరామర్శించిన సంఘటన గుర్తకొస్తుంది. కుల మతాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయం చెయ్యాలనే కొంతమంది నాయకుల భారతం పట్టేలా దర్శకుడు హెచ్ వినోత్. దేశాల మధ్య జరుగుతున్న యుద్ధాలు, ఇండియాను నాశనం చెయ్యడానికి పాకిస్థాన్ వేసిన కుట్ర వంటి సన్నివేశాలు ఉన్నాయి. భవిష్యత్తులో రోబిటిక్ యుద్ధాలు వస్తే అప్ డేటేడ టెక్నాలజీతో యుద్ధం ఎలా చెయ్యాలి అనేది క్లైమాక్స్ లో చూపించాడు. ఇప్పుడున్న నీచమైన రాజకీయ వ్యవస్థను ప్రశ్నిస్తూనే మరోపక్క దేశాన్ని ఎలా కాపాడుకోవాలి, ప్రజలను ఎలా మంచి చేసుకోవాలి, ప్రజలను ఎలా రక్షించుకోవాలి, ప్రజాస్వమ్యన్ని ఎలా రక్షించుకోవాలి వంటి ఆశలను చాలా చక్కగా తెరకెక్కించారు. విజయ్ అభిమానులకు ఈ సినిమా ఒక పండుగ అని చెప్పడం అతిశయోక్తి కాదు. తెలుగులో భగవంత్ కేసరి సినిమా చూసిన వాళ్లకు జన నాయకుడు పెద్దగా అనిపించకపోవచ్చు కానీ తమిళ ప్రేక్షకులకు ఈ సినిమా కొత్తగా ఉంటుంది. విజయ్ వేసే మాస్ స్టెప్పులు థియేటర్లో ఫాన్స్ కు ఉత్రుతలూగిస్తుంది. ఎవరి పాత్రల్లో వారు పర్ఫెక్ట్ గా నటించారు. అనిరుద్ అందించిన బ్యాక్‌గ్రాండ్ స్కోర్ ప్రతి సన్నివేశాన్ని బాగా ఎలివేట్ చేసింది. ఓవరాల్‌గా తమిళ ప్రేక్షకులకు జన నయగన్ (జన నాయకుడు) పండుగే అని చెప్పాలి.

## 'నా కంటి మీద కునుకే'ను పాట విడుదల



గత కొన్నేళ్లుగా విభిన్న పాత్రలు, కంటెంట్ ఓరియెంటెడ్ సినిమాలతో ప్రేక్షకులను అలరించిన అల్లరి నరేష్, ఇప్పుడు తన మార్క్ కామెడీ జోనర్ 'రంభ ఊర్వశి మేనక'తో సిద్ధమయ్యారు. చంద్ర మోహన్ చింతాడ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ ఫాంటసీ ఎంటర్‌టైనర్ ను అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ బ్యానర్లపై రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'కామెడీ గోస్ కాస్మిక్ ' అనే ట్యాగ్‌లైన్‌తో రూపొందుతున్న ఈ సినిమా అల్లరి నరేష్ మార్క్ వినోదంతో మేళవించిన వినూత్న కథగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా మ్యూజికల్ జర్నీకి శ్రీకారం చుడుతూ మేకర్స్ తొలి పాట 'నా కంటి మీద కునుకే'ను విడుదల చేశారు. అల్లరి నరేష్, సురభిపై చిత్రీకరించిన ఈ పాట సినిమాలోని రొమాంటిక్ కోణాన్ని పరిచయం చేస్తూనే, గ్రామీణ నేపథ్యంలో సాగే కథకు అందమైన అనుభూతిని అందిస్తోంది. పచ్చని పల్లె అందాల నడుమ తెరకెక్కిన ఈ పాటలో, తన కలల రాణిపై మనసుపడిన యువకుడు తన ప్రేమను, అభిమానాన్ని అందంగా ప్రజెంట్ చేశారు. అల్లరి నరేష్, సురభి మధ్య కనిపించే సహజమైన కెమిస్ట్రీ ఈ పాటకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది.సంగీత దర్శకుడు చైతన్ భరద్వాజ్ గ్రామీణ సంగీతపు మాధుర్యాన్ని మోడరన్ ఆర్కెస్ట్రేషన్‌తో మేళవిస్తూ హాయిగా సాగే మెలోడీని అందించారు. భాస్కరభట్ల రవికుమార్ సాహిత్యం ప్రేమలోని మధురమైన భావాలను అందంగా ఆవిష్కరించగా, ధనుంజయ్ సీపాన తన వోకల్స్ తో పాటకు మరింత భావోద్వేగాన్ని తీసుకొచ్చారు. బ్రహ్మ కడలి ఆర్ట్ డిజైన్‌ను రూపొందించగా, చోటా కె. ప్రసాద్ ఎడిటింగ్ చేశారు. ఈ చిత్రం సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

## మహేష్ బాబు సినిమాకు 'వారణాసి' టైటిల్ ఇచ్చిన సుబ్బారెడ్డి



దర్శకుడు సుబ్బారెడ్డి తాను రిజిస్టర్ చేసుకున్న 'వారణాసి' సినిమా టైటిల్‌ను ఎస్.ఎస్.రాజమౌళి మహేష్ బాబు హీరోగా రూపొందుతున్న చిత్రానికి ఎలాంటి ఇచ్చారు. ఈ సందర్భంగా నిర్మాతల మండలి కార్యదర్శి ప్రసన్న కుమార్, దర్శకుల సంఘం మాజీ అధ్యక్షుడు వీరశంకర్, వారణాసి సినిమా నిర్మాత కె ఎల్ నారాయణ దర్శకుడు సుబ్బారెడ్డి కలసి అభినందించారు. ఈ సందర్భంగా దర్శకుడు సుబ్బారెడ్డి మాట్లాడుతూ 2023లో 'వారణాసి' టైటిల్‌ను తన బ్యానర్‌పై రిజిస్టర్ చేసుకుని ఆ కథపై పని ప్రారంభించానని తెలిపారు. అయితే అదే టైటిల్ రాజమౌళి సినిమా కోసం అవసరమైందని తెలిసిన తర్వాత, తెలుగు సినిమా గౌరవం దృష్ట్యా ఎలాంటి సందేహం లేకుండా ఇవ్వాలని నిర్ణయించుకున్నానన్నారు. తన అభిమాన హీరో మహేష్ బాబు, దర్శకుడు రాజమౌళి, నిర్మాత కేఎల్ నారాయణ కలిసి చేస్తున్న ఈ భారీ చిత్రానికి టైటిల్ ఇవ్వడం తన అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. టైటిల్ అనేది నాకు ఒక ఎమోషన్.దర్శకుల సంఘం మాజీ అధ్యక్షుడు వీరశంకర్ మాట్లాడుతూ తరువాత రాజమౌళి, కేఎల్ నారాయణ వంటి ప్రముఖుల చిత్రం కోసం టైటిల్ ఇస్తే ఇండస్ట్రీకి మంచి సందేశం వెళ్తుందని వివరించగా, సుబ్బారెడ్డి వెంటనే అంగీకరించారని తెలిపారు.



## వేగవంతంగా 'సర్' ప్రక్రియ

రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేసే చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని 48, 17వ వార్డుల్లో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా బిఎల్ఓలు, బిఎల్ఏలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. నిజమైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు, అనవసరమైన పత్రాలతో ప్రజలు ఎస్ఐఆర్ ప్రక్రియలో చురుకుగా పాల్గొని తమ వివరాలను సరిచేసుకోవాలని కోరారు. జిల్లాలో ఇప్పటి వరకు సుమారు 75 శాతం ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయిందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీఉల్లా, వార్డు కౌన్సిలర్లు వెలుగు వెంకన్న, బైరబోయిన శ్రీదేవి శ్రీనివాస్, నాయకులు పాలగాని కృష్ణ, వల్లాల దేవేందర్ పాల్గొన్నారు.

## భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందం రద్దు చేయాలి




**ప్రజాపక్షం/మునుగోడు** : భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందం రద్దు చేయాలని రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి గురజా రామచంద్రం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో రైతు సంఘం ఆధ్వర్యంలో అమెరికా భారత్ వాణిజ్య ఒప్పందం రద్దు చేయాలని మునుగోడు అంబేద్కర్ చౌరస్తాలో రైతులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక నల్ల చట్టాలను రద్దు చేయాలని మోదీ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. అమెరికాకు స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలు ప్రతిపాదనకు పూనుకోవడం కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులపై విపరీతమైన చట్టాలు తీసుకొచ్చి రైతు పండించిన పంటను కూడా గిట్టుబాటు ధరకు అమ్ముకోలేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బొలుగురి నరసింహ,ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి తిరుపతి వెంకటేశ్వర్లు,సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీను,జిల్లా కౌన్సిల్ సభ్యులు బొమ్మరబోయిన లాలయ్య, సురిగి చలపతి,నల్లగ సర్వంచ్ బండమీది యాదయ్య, గోస్కొండ లింగయ్య పాల్గొన్నారు.


## ట్రాఫిక్ సమస్యల నివారణకు చర్యలు



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : ట్రాఫిక్ సమస్యల నివారణకు పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని జిల్లా ఎస్పి కె. నరసింహ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్, పరిసర రోడ్లను స్థానిక పోలీస్ అధికారులు, ఆర్‌టిసి అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ క్రమబద్దీకరణ, ప్రయాణికుల భద్రతపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. సాధారణ ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా బస్టాండ్‌లోకి ఆర్‌టిసి బస్సులు సజావుగా వచ్చి వెళ్లేలా ప్రత్యేక మార్గాలను ఏర్పాటు చేసుకోవాలని ఆర్‌టిసి అధికారులకు సూచించారు. బస్టాండ్ చుట్టుపక్కల రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న వారు రోడ్లపైకి రాకుండా, తమ పరిధిలోనే వ్యాపారులు చేసుకోవాలని లేనిపక్షంలో చట్టప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చరించారు. బస్టాండ్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ జామ్ కాకుండా స్థానిక పోలీస్, ట్రాఫిక్ సిబ్బంది ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ పర్యవేక్షించాలని ఆదేశించారు. పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్, ఆర్‌టిసి సిబ్బంది పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు అన్ని సౌకర్యాలు

డబుల్ ఇండ్లను పరిశీలించిన అదనపు కలెక్టర్



**ప్రజాపక్షం/యాదాద్రి** : సింగన్నగూడెంలో డబుల్ బెడ్ రూమ్ గృహాల మౌలిక వసతుల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. గురువారం భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని సింగన్నగూడెం 2బీహెచ్‌కె గృహ సముదాయంలో జరుగుతున్న మౌలిక వసతుల పనులను అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా గృహాలలో కరెంటు, త్రాగునీరు, పెయింటింగ్, మౌళిక వసతుల పనుల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించి, పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. గృహాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మిగిలిన మౌలిక సదుపాయాల పనులను పూర్తి చేసి లబ్ధిదారులకు అన్ని సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హోసింగ్ సిబ్బంది,ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## జంతర్‌మంతర్ ఘటనను ఖండించిన 'ఐలు'



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) సభ్యత్వ నమోదు కార్యక్రమం గురువారం మిర్యాలగూడలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మామిడి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతూ పార్లమెంట్ వైపు ర్యాలీగా వెళ్తున్న విద్యార్థులు, యువతపై ఢిల్లీ పోలీసులు లాఠీచార్జ్ చేయడం, అక్రమ నిర్బంధాలకు పాల్పడడం అత్యంత అమానుషమని తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో ఐలు జిల్లా ఉపాధ్యక్షుడు ఇబ్రహీం, కోర్టు కమిటీ అధ్యక్షుడు పరమేష్, కందిమల్ల వెంకట్ రెడ్డి, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ జె. ఎల్లయ్య, కొంక వెంకన్న, కళ్యాణ్, కరుణాకర్, ఉంగరాల నాగరాజు పాల్గొన్నారు.

## ప్రభుత్వం కేటాయించిన ధాన్యం

# పక్కదారి పట్టించినట్లుగా నిర్ధారణ

వజ్రా రైస్ కార్పోరేషన్, వజ్రా వికాస్ మార్ట్ రైస్ మిల్లుల్లో ఆకస్మిక తనిఖీ

ఎఫ్‌సిఐకి సరఫరా చేయాల్సిన బియ్యాన్ని లారీల్లో తరలిస్తుండగా సీజ్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : సూర్యాపేట మండలంలోని బాలెంల గ్రామ సమీపంలో ఉన్న వజ్రా రైస్ కార్పోరేషన్, వజ్రా వికాస్ మార్ట్ రైస్ మిల్లుల్లో నల్లగొండ జిల్లా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో పాటు సూర్యాపేట పౌరసరఫరాల శాఖ అధికారులు సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈనెల 20వ తేదీ నుండి చేసిన తనిఖీలకు సంబంధించిన వివరాలను గురువారం అధికారులు అధికారికంగా వివరాలు వెల్లడించారు. ప్రభుత్వం రైతుల నుండి కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యాన్ని మిల్లింగ్ కోసం కేటాయించగా ఈ ధాన్యానికి సంబంధించిన బియ్యాన్ని ఎఫ్‌సిఐకి అప్పగించాల్సిన బియ్యాన్ని లారీలో ముదిగొండలోని సత్యసాయి రైస్ కార్పోరేషన్‌కు తరలిస్తుండగా అధికారులు అడ్డుకొని సీజ్ చేశారు. అనంతరం ఈ రెండు మిల్లుల్లో ధాన్యం నిల్వలను తనిఖీ చేయగా రికార్డుల ప్రకారం ఉండాల్సిన ధాన్యం లేనట్లుగా గుర్తించారు. వజ్రా రైస్ కార్పోరేషన్‌లో 11,073.054 మెట్రిక్ టన్నులు, వజ్రా వికాస్ మార్ట్ రైస్ మిల్లులో 18,114.834 మెట్రిక్ టన్నుల ధాన్యం కొరత ఉన్నట్లుగా లెక్కలు తేల్చారు. దీని మొత్తం 29,187.888 మెట్రిక్ టన్నుల ధాన్యం కొరతగా ఉన్నట్లు నిర్ధారించారు. ఈ కొరత విలువ రూ.69కోట్లుగా అంచనా వేశారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారుల సమక్షంలో పంచనామా నిర్వహించి మిల్లులో లభ్యమైన ధాన్యం, బియ్యం నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే రైస్ మిల్లుపై రికవరీ చర్యలు చేపట్టడంతోపాటు సంబంధిత చట్టప్రకారం క్రిమినల్ కేసు నమోదు చేసేందుకు చర్యలు ప్రారంభించారు. స్వాధీనం చేసిన ధాన్యాన్ని ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇతర అనుమతించబడిన రైస్ మిల్లులకు తరలించేందుకు జిల్లా సివిల్ సప్లై మేనేజర్‌కు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ ధాన్యం, బియ్యం నిల్వలు, కస్టమ్ మిల్లింగ్ ప్రక్రియ, ప్రజాపంపిణీ వ్యవస్థకు సంబంధించిన అంశాలలో అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరా అధికారులు స్పష్టం చేశారు.

# విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాట మొద్దు







రాహుల్ గాంధీ అరెస్టు అప్రజాస్వామికం

కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వీరేశం,ఎమ్మెల్యే బాలునాయక్, డిసిసి అధ్యక్షుడు కైలాష్‌నేత, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

**ప్రజాపక్షం/నకిరేకల్** : నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంపై దేశవ్యాప్తంగా వ్యక్తమవుతున్న నిరసనలకు మద్దతుగా ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేపట్టిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ప్రభుత్వ విప్,నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. పట్టణంలోని మెయిన్ సెంటర్‌లో గురువారం నిర్వహించిన కాంగ్రెస్ ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూజర్ల శంభయ్య, టీపీసీసీ మేనిఫెస్టో కమిటీ సభ్యుడు చామల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్తా మంజులమాధవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాదగోని కొండయ్య, టౌన్ అధ్యక్షుడు లింగాల వెంకన్న, నకిరేకల్ మాజీ మున్సిపల్ చైర్మన్ చౌగోని రజిత శ్రీనివాస్ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/దేవరకొండ:** ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న మోదీ ప్రభుత్వానికి రాబోవు రోజుల్లో ప్రజల నుండి గుణపాఠం తప్పదని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక అన్నారు. గురువారం దేరవకొండ బస్టాండ్ సమీపంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీకి మద్దతుగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండించారు. ఎంఎల్‌ఏ బాలునాయక్, డిసిసి అధ్యక్షులు పున్న కైలాష్‌నేతలు మాట్లాడుతూ ఇటీవల ఢిల్లీలో జరిగిన నిరసన కార్యక్రమంలో రాహుల్ గాంధీపై జరిగినదాడి దేశ ప్రజాస్వామ్య చరిత్రలో ఒక దురదృష్టకర సంఘటన అని అన్నారు. అనంతరం ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో నల్గొండ జిల్లా అధ్యక్షులు పున్న కైలాష్‌నేత, మండల అధ్యక్షులు సురేష్‌గౌడ్, సిరాజ్ ఖాన్, శ్రీధర్‌రెడ్డి, వేణుధర్‌రెడ్డి, రాంసింగ్, నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : ఢిల్లీలో ఏఐసిసి అగ్రనేత రాహుల్ గాంధీపై జరిగిన దాడి దేశ ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి అని ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ అన్నారు. నీట్ ఎగ్జామ్ పేపర్ లీక్, ఏఐసిసి అగ్రనేత రాహుల్ గాంధీ,ప్రియాంక గాంధీల అక్రమ అరెస్టును నిరసిస్తూ గురువారం నల్లగొండ పట్టణంలోని జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టి అనంతరం గడియారం సెంటర్లో ప్రధాని మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న అధికార పార్టీ రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తోందని ఆయన మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి గుమ్ముల మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రఫ్ అలీ అమేర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్‌ఉన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగులు సేవానిరతిని చాటాలి

అదనపు కలెక్టర్లు వెంకారెడ్డి, భాస్కరరావు




**ప్రజాపక్షం/యాదాద్రి కలెక్టరేట్:** ప్రభుత్వ ఉద్యోగులు సేవా నిరతిని చాటాలని యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్లు వెంకారెడ్డి, భాస్కర్ రావు అన్నారు. గురువారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ యాదాద్రి భువనగిరి జిల్లా శాఖ, జిల్లా రెవెన్యూ శాఖ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సంయుక్త నిర్వహణలో కలెక్టరేట్ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిలుగా పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలలో పాల్గొని సమాజ సేవకు తన వంతు సహకారాన్ని అందించాలని కోరారు. నిరంతరం ఉద్యోగ బాధ్యతల్లో ఉండే ఉద్యోగులు అప్పుడప్పుడు సేవా కార్యక్రమాలలో పాల్గొనడం వల్ల ఎంతో ఊరట లభిస్తుందని పేర్కొన్నారు.రెడ్ క్రాస్ నిర్వహించే రక్తదాన శిబిరాలలో రక్తదానం చేసిన వారు ఆపదలో ఉన్న వారికి ప్రాణదానం చేసినట్లేనని వెంకారెడ్డి, భాస్కర్ రావు అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మనోహర్ రావు మాట్లాడుతూ వైద్య, ఆరోగ్యశాఖలో పనిచేసే ఉద్యోగులకు రక్తదానం యొక్క ప్రాధాన్యత తెలుసన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ యాదాద్రి భువనగిరి జిల్లా చైర్మన్ డాక్టర్ జి లక్ష్మీ నరసింహ రెడ్డి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ప్రత్యేక చొరవతో జిల్లాలోని అన్ని శాఖల ఉద్యోగులు రక్తదానం చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ మందడి ఉపేందర్ రెడ్డి, డిఆర్ఓ జయమ్మ, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ కృతిక, భువనగిరి, చౌటుప్పల్ ఆర్డీవోలు కృష్ణారెడ్డి, వి.శేఖర్ రెడ్డి, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణ, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు భగత్, డాక్టర్ వంశీకృష్ణ ఇన్నర్ వీల్ అసోసియేషన్ అధ్యక్షురాలు పి.స్వాతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ విద్యానగర్ రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ వారు చేపట్టిన ఈ శిబిరంలో రెవిన్యూ, వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు 53 మంది రక్తదానం చేశారు.

## 31లోగా ఇ-కెవైసి పూర్తి చేయాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లాలోని ప్రతి రేషన్ కార్డు లబ్ధిదారుడి ఈనెల 31 నాటికి ఇ కెవైసిను పూర్తి చేయడం లక్ష్యంగా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.ప్రస్తుతం బియ్యం పంపిణీ పూర్తయిన నేపథ్యంలో తదుపరి పంపిణీ ప్రారంభమయ్యేలోపు ఉన్న సమయాన్ని పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు. ఈకెవైసిపూర్తి చేయని లబ్ధిదారులందరూ తమ సమీప ప్రభుత్వ చౌక ధరల దుకాణానికి వెళ్లి బయోమెట్రిక్ ధృవీకరణ పూర్తి చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.రేషన్ కార్డులో నమోదైన ప్రతి సభ్యుడు వ్యక్తిగతంగా ఈకెవైసి చేయించుకోవాలని స్పష్టం చేశారు. వృద్ధులు, దివ్యాంగులు,అనారోగ్యంతో ఉన్న లబ్ధిదారులకు అవసరమైన సహాయాన్ని అధికారులు, ప్రభుత్వ చౌక ధరల దుకాణ డీలర్లు అందించాలని ఆదేశించారు.ఈనెల 31 నాటికి జిల్లాలో 100 శాతం ఈకెవైసి పూర్తి చేయడంలో విఫలమైతే, ఆహార ధాన్యాల కేటాయింపుపై సబ్సిడీ నిలిపివేయడం లేదా కేటాయింపులు తగ్గించడం జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు.

## సేవల్లో దేశంలోనే ప్రత్యేకం కోదాడ ప్రాంతీయ పశువైద్యశాల

జాతీయ మాంసం పరిశోధన కేంద్రం డైరెక్టర్ డాక్టర్ బి.బార్బుద్దే

**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ ప్రాంతీయ పశువైద్యశాలను సందర్శించిన జాతీయ మాంసం పరిశోధనా కేంద్రం డైరెక్టర్ డా బి బార్బుద్దే ప్రాంతీయ పశు వైద్యశాలలో అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి.పెంటయ్య అందిస్తున్న పశు ఔషద బ్యాంకు సేవలను సవివరంగా తెలుసుకున్న డైరెక్టర్ దేశంలో ఎక్కడ లేని విధంగా పశు పోషకుల కోసం లాభసాటి పశుపోషణకు దాతల సహకారంతో నిర్వహిస్తున్న పశు ఔషద బ్యాంకు ద్వారా అనతికాలంలోనే రైతులకు 15 కోట్లపైన అదనపు సంపదను సృష్టించడం దేశంలోనే ఒక చరిత్ర అని అందులోనూ పశుసంవర్ధక శాఖలో ఇలాంటి అద్భుతం ఎంతైనా అభినందనీయం అన్నారు. అంతే కాకుండా కోదాడ పట్టణమే కాకుండా జిల్లా నలుమూలల నుండి, ఇతర జిల్లాలు పక్క రాష్ట్ర నుండి వస్తున్న జంతువులు వాటికి నిర్వహిస్తున్న అత్యంత కఠినమైన ఆపరేషన్లు చేస్తుంటే అబ్బురమేస్తుందన్నారు. అనంతరం మహబూబ్ నగర్ జిల్లా నారాయణపేట జిల్లాల నుండి ఔషదాల కోసం వచ్చిన గొర్రెల పెంపకం దారులతో ముచ్చటించి వందల కిలోమీటర్ల దూరం నుండి వచ్చి పశు ఔషద బ్యాంకులో మందులు తీసుకెళ్లడం చూసి విస్మయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశువైద్య, పశుసంవర్ధక అధికారి డాక్టర్ బోడేపూడి శ్రీనివాసరావు, జాతీయ మాంసం పరిశోధన కేంద్రం హైద్రాబాద్ ప్రిన్సిపాల్ సైంటిస్టులు డాక్టర్ బస్వారెడ్డి, దీపక్ రావుల్, వెటరినరీ అసిస్టెంట్ సర్జన్ సిరిపురపు సురేంద్ర, సిబ్బంది పోటు వెంకటేశ్వరరావు, శేషగిరి, సాయికృష్ణ, చిరంజీవి, బడేటి శివ పాల్గొన్నారు.





## వేగంగా జాతీయ రహదారి విస్తరణ పనులు

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట** : జాతీయ రహదారి విస్తరణ పనులను నిర్దేశిత గడువులోగా, అత్యంత వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలో జాతీయ రహదారి 65కు సంబంధించి జరుగుతున్న రోడ్డు విస్తరణ, ఫ్లైఓవర్ నిర్మాణ పనులను జిల్లా ఎస్పి కె. నరసింహతో కలిసి పరిశీలించారు. జాతీయ రహదారుల అథారిటి అధికారులతో కలిసి వారు క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని నిశితంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన, సౌకర్యవంతమైన రవాణా వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పి కె. నరసింహ సూచించారు. ప్రయాణికుల రక్షణే ధ్యేయంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రమాదాల నివారణకు అవసరమైన చోట్ల సైన్ బోర్డులు, రక్షణ కంచెలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాతీయ రహదారుల అథారిటి అధికారులు, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## హామీలను అమలు చేయాల్సిందే



**ప్రజాపక్షం/ఆత్మకూర్(యం)** : అఖిల భారత మహిళా సమాఖ్య ఆత్మకూర్ మండల నిర్మాణ కౌన్సిల్ సమావేశం సుధగాని మంగమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బండి జంగమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చడం పూర్తిగా విఫలం అయిందన్నారు. ప్రభుత్వం ఏర్పడి రెండున్నర ఏండ్లు గడిచిన 6 గ్యారంటీలు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని వారు ఎద్దేవా చేశారు. పెరిగిన గ్యాస్, నిత్యవసర సరుకుల ధరలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు మానుకొని ప్రజల సమస్యలను పరిష్కరించడంలో దానికి సంబంధించిన అధికారులను పూర్తిస్థాయిలో పరిశీలన చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సమైక్య గౌరవాధ్యక్షురాలు గుర్రం రాజమణి, పంజాల వనిత, యండి నసీమ బీ.సుల్తాన్ ధనలక్ష్మి, బొబ్బల విజయ, మామిడి లక్ష్మి, మారుపాక మౌనిక, బుచ్చమ్మ,లక్ష్మి పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే భర్తరఫ్ చేయాలి

ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పేరబోయిన మహేందర్



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** నీట్ యుజి, యుజిసి నెట్ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీలు, తీవ్రమైన అక్రమాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (NTA)ని రద్దు చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి పేరబోయిన మహేందర్ డిమాండ్ చేశారు. గురువారం యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని న్యూ గుండ్లపల్లిలో ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి కంబాల వెంకటేష్ అధ్యక్షతన 'మండల నిర్మాణ మహాసభ' నిర్వహించారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వ పాలనలో విద్యావ్యవస్థ పూర్తిగా బలహీనపడిందని విమర్శించారు. నిరుద్యోగం, పేపర్ లీకేజీలపై ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులు, యువతపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం, బాష్పవాయువు ప్రయోగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. లక్షలాది మంది విద్యార్థుల కష్టానికి కేంద్ర బీజేపీ ప్రభుత్వం విలువ ఇవ్వడం లేదని మండిపడ్డారు. విద్యార్థి సంఘాల పిలుపు మేరకు రేపు జరగబోయే విద్యాసంస్థల బంద్‌కు ఏఐవైఎఫ్ సంపూర్ణ మద్దతు తెలుపుతోందని, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, మేధావులు పాల్గొని బంద్ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

**ఏఐవైఎఫ్ యాదగిరిగుట్ట మండల నూతన కమిటీ ఎన్నిక..**

మహాసభ అనంతరం ఏఐవైఎఫ్ యాదగిరిగుట్ట మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా రాఘవాపురం వినయ్, ఉపాధ్యక్షులుగా తోటకూరి శేఖర్, అనంతుల నరసింహ, ప్రధాన కార్యదర్శిగా కంబాల వెంకటేష్, సహాయ కార్యదర్శులుగా శెట్టి నరసింహ, నవీన్, కోశాధికారిగా సంఘి అరవింద్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, పట్టణ కార్యదర్శి బబ్బూరి శ్రీధర్, ఏఐటీయూసీ మండల కార్యదర్శి గోపగాని రాజు, నాయకులు బండ రామచందర్, కంబాల నరసింహ, పేరబోయిన రాజేష్, వట్టి లింగస్వామి, మహేష్ పాల్గొన్నారు.

## కేర్ టేకర్ నియామకానికి దరఖాస్తులు

**ప్రజాపక్షం/డిండి:** తెలంగాణ మోడల్ స్కూల్ గుండ్లపల్లి బాలికల హాస్టల్ లో కేర్ టేకర్ నియామకం కొరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండల విద్యాధికారి పగిడిపాటి నర్సింహా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 27 నుండి 29 వరకు మండల వనరుల కేంద్రం గుండ్లపల్లిలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. డిగ్రితో పాటు బిఈడి అర్హత కలిగిన మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించడునని ఆసక్తికలిగిన మహిళా అభ్యర్థులు అప్లికేషన్లతో పాటు సంబంధిత సర్టిఫికేట్లు జతచేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు. మం డల రెవెన్యూ అధికారి, మండల అభివృద్ధి అధికారి, మండల విద్యాధికారితో కూడిన త్రిసభ్య కమిటీ సభ్యులచే ఎంపిక ప్రక్రియ నిర్వహించబడుతుందని తెలిపారు.

# దేశానికే ఆదర్శంగా నిలుస్తున్న పథకాలు

అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు* ఒఆర్ఆర్ నుండి ఉనికిచర్ల వరకు నాలుగు లైన్ల రోడ్డు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు* స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



ప్రజాపక్షం/ధర్మసాగర్ : ఉనికిచర్ల గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఉనికిచర్ల గ్రామానికి పట్టణ రూపురేఖలు తెచ్చే బాధ్యత నాదని మాజీ ఉప ముఖ్య మంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. గ్రేటర్ వరంగల్ 64వ డివిజన్ పరిధిలోని ఉనికిచర్ల గ్రామంలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 2కోట్లతో నిర్మించనున్న కుడా వెంచర్ నుండి ఉనికిచర్ల వరకు డబుల్ లైన్ సిసి రోడ్డు నిర్మాణానికి, 50లక్షలతో చేపట్టనున్న స్మశాన వాటిక అభివృద్ధి పనులకు, 2కోట్లతో నిర్మించనున్న అంతర్గత సిసి రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి శంకుస్థాపన చేశారు. అలాగే గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులతో కలిసి ప్రారంభించారు. అలాగే సుమారు 700 మంది మహిళా సంఘాల సభ్యులకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ పేద ప్రజల స్వంత ఇంటి కలను సాకారం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమే అని అన్నారు. దేశంలోనే ఎక్కడ లేని విధంగా రెండేళ్లలోనే 35వేల కోట్లతో 7లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసిన ఘనత కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని పేర్కొన్నారు. 1994 ఉమ్మడి రాష్ట్రంలో ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్నప్పుడు ఉనికిచర్ల గ్రామంలో ఎస్సీలకు 70పక్కా ఇల్లు నిర్మాణం చేయించానని అలాగే గ్రామంలో సిసి రోడ్లు, డ్రైనేజీలు వంటి అనేక అభివృద్ధి పనులు చేశానని తెలిపారు. మళ్ళీ నేను ఎమ్మెల్యే అయిన ఈ రెండున్నర ఏళ్లలో కోటి 50లక్షలతో అభివృద్ధి పనులు చేశానని ఇవాళ ఒక్క రోజే సుమారు 5కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసుకున్నామని అన్నారు. ఒఆర్ఆర్ నుండి ఉనికిచర్ల వరకు నాలుగు లైన్ల రహదారి నిర్మాణం చేయడంతో పాటు సెంట్రల్ లైటింగ్, సైడ్ డ్రైనేజీల నిర్మాణం చేపట్టనున్నట్లు అందుకు అవసరమైన నిధులు మంజూరు చేస్తానని తెలిపారు. అలాగే స్మశాన వాటికలో 50లక్షలతో ప్రహరీ గోడ, బర్నింగ్ ప్లాట్ ఫామ్‌తో పాటు బోర్, వాటర్ ట్యాంక్, ప్రధాన రహదారి నుండి స్మశాన వాటిక వరకు సిసి రోడ్డు 6నెలలలో నిర్మాణం పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. ఎంపి నిధుల ద్వారా త్వరలోనే మహిళా కమ్యూనిటీ హాల్ తో గ్రామంలో అవసరమైన ఇతర అభివృద్ధి పనులను సైతం మంజూరు చేస్తానని తెలిపారు. కడియం శ్రీహరి ఎమ్మెల్యే గా ఉన్నప్పుడే అభివృద్ధి జరిగిందని మళ్ళీ కడియం శ్రీహరి వచ్చాకే అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధిలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ అధికారులు, హౌసింగ్ అధికారులు, తహసీల్దార్, ఎంపిడిఒ, మాజీ కార్పొరేటర్ ఆవాల రాధికా రెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## 'నేడు' జనగామకు కూనంనేని



ప్రజాపక్షం/జనగామ: సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు శుక్రవారం జనగామకు రానున్నారు. జిల్లాలోని రఘునాథపల్లిలో 24,25 తేదీల్లో రెండు రోజుల పాటు రాజకీయ శిక్షణ తరగతులు జరుగుతుండగా శుక్రవారం సాంబశివరావు పాల్గొని ప్రారంభిస్తారు. రెండు రోజుల పాటు జరిగే శిక్షణ తరగతులకు రఘునాథపల్లి మండలంలోని ఖిలాషాపురం రోడ్డులో గల ఎవిఆర్ గార్డెన్‌ను సిద్ధం చేశారు. మండల కార్యదర్శి, జిల్లా సమితి సభ్యులు కావటి యాదగిరి ఆధ్వర్యంలో ఎర్ర తోరణాలతో అలంకరించారు. ఉదయం 9.30 గంటలకు కూనంనేని పాల్గొని మహాసభల్ని ప్రారంభిస్తూ నాయకులను ఉద్దేశించి మాట్లాడుతారు. రెండు రోజుల పాటు జరిగే శిక్షణ తరగతులకు జిల్లాలోని అన్ని మండలాల నుండి ఎంపికైన ప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకే అందరు ఎవిఆర్ గార్డెన్‌కు చేరుకోవాలన్నారు.

## త్వరితగతిన పనులు పూర్తి : కలెక్టర్



ప్రజాపక్షం/ఎల్కతుర్తి : డ్రైనేజీ నిర్మాణ పనులు వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. హనుమకొండ–కరీంనగర్ ప్రధాన రహదారిపై ఎల్కతుర్తి జంక్షన్ వద్ద నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో చేపడుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను కలెక్టర్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.పనుల పురోగతిని సమీక్షించిన కలెక్టర్, ఇంకా మిగిలి ఉన్న డ్రైనేజీ పనులను వేగవంతం చేసి యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఎన్‌హెచ్ఎఐ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. అధికారులు పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎక్కడా జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట ప్రాజెక్టు అధికారి అజిత్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 6 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం పట్టివేత



ప్రజాపక్షం/భూపాలపల్లి: పేదలకు పంపిణీ చేయాల్సిన ప్రభుత్వ వీడియోస్ పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసిన ఘటనలో ఒక కిరాణా వ్యాపారిని పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా ఎస్పి సిరిశెట్టి సంకీర్త్, ఆదేశాల మేరకు జిల్లా సిసిఎస్ పోలీసులు విశ్వసనీయ సమాచారంతో దాడి నిర్వహించారు. చిట్యాల మండలం మునిపర్తి గ్రామానికి చెందిన కిరాణా వ్యాపారి గౌరిశెట్టి సత్యనారాయణను పట్టుకుని 6 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకొని నిందితుడి వద్ద నుంచి సుమారు 6 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని, స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం చిట్యాల పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పేద ప్రజలకు అందించాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేయడం, రవాణా చేయడం లేదా విక్రయించడం వంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా పోలీసులు హెచ్చరించారు. ఇటువంటి అక్రమ కార్యకలాపాలపై ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## నిషేధిత మత్తు పదార్థాల విక్రయాలపై ప్రత్యేక తనిఖీలు: పసర ఎస్ఐ



ప్రజాపక్షం/గోవిందరావుపేట:ములుగు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోనీ చల్వాయి గ్రామంలోని పలు కిరాణా దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు ఎస్ఐ తాజుద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా డాగ్ స్క్వాడ్ బృందంతో కలిసి కిరాణా దుకాణాలు క్షుణ్ణంగా పరిశీలించారు యువత ఆరోగ్యానికి హానికరమైన గంజాయి మాదక ద్రవ్యాలు నిషేధిత పొగాకు ఉత్పత్తులు గుట్కా తదితర నిషేధిత వస్తువుల విక్రయాలు జరుగుతున్నాయా అనే అంశంపై ప్రత్యేకంగా తనిఖీలు చేపట్టారు. దుకాణదారులకు ఎస్ఐ తాజుద్దీన్ అవగాహన కల్పిస్తూ ఎట్టి పరిస్థితుల్లోనూ నిషేధిత మత్తు పదార్థాలు గుట్కా వంటి వస్తువులను విక్రయించవద్దని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించి ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటమని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో డాగ్ స్క్వాడ్ సిబ్బంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## రైతు రుణాలపై వన్ టైం సెటిల్‌మెంట్‌కు అవకాశం ఇవ్వాలి: సిపిఐ

ప్రజాపక్షం/మరిపెడ:మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం అబ్బాయిపాలెం గ్రామంలో గురువారం నిర్వాహించిన రైతుల సమావేశంలో సిపిఐ జిల్లా సమితి సభ్యుడు ఎండి అబ్దుల్ రషీద్ మాట్లాడుతూ మండలంలోని రైతులు వివిధ బ్యాంకుల నుండి తీసుకున్న పంటఋణాల భారంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని,ప్రభుత్వం రెండు లక్షలలోపు ఋణాలు మాఫీ చేసిన నేపథ్యంలో ఆపై ఋణాలు కూడ మాఫీ అవుతాయని ఆశతో అనేక మంది రైతులు సకాలంలో ఋణాలు చెల్లించలేదనీ ఋణమాఫీపై స్పష్టత లేదనీ, పెట్టుబడి సాయం అందక ఇబ్బందులు పడుతున్నారనీ ఆవేదన వ్యక్తం చేశారు.ఎల్‌నినో ప్రభావం,వర్షాభావ పరిస్థితులు,పెరిగిన సాగు ఖర్చులు,దిగుబడులు తగ్గడం వంటి కారణాలతో రైతులు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నారనీ ఆవేదన వ్యక్తం చేశారు.ప్రస్తుత పరిస్థితులలో బ్యాంకులు మానవత దృక్పథంతో వ్యవహరించి పంట ఋణాలపై వన్‌టైం సెటిల్‌మెంట్‌కు అవకాశం కల్పించాలనీ,వడ్డీపై రాయితీ ఇచ్చి రైతుకు ఉపశమనం కల్పించాలనీ డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో రైతులు లక్ష్మణ్,వీరన్న,భగవత్,దీపక్, రాములు,తదితరులు పాల్గొన్నారు.

## ఎఐటియుసిని కార్మిక రంగాలన్నింటికీ విస్తరింపజేయాలి

కార్మికులు సంఘటిత పోరాటాలకు సిద్ధం * ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజు



ప్రజాపక్షం/జనగామ : కార్మిక సంమస్యలపై సంఘటిత పోరాటాలు చేస్తూఎఐటియుసిని అన్ని రంగాలకు విస్తరింపజేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్ బాలరాజు పిలుపునిచ్చారు. బిజెపి తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తిప్పికొట్టాలంటే సంఘటిత ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.ఎఐటియుసి జనగామ జిల్లా నాలుగవ మహాసభ గురువారం జనగామ జిల్లా కేంద్రంలో మోటే శ్రీశైలం, లింగాల రాములు అధ్యక్షతన జరిగింది. మహాసభను ప్రారంభిస్తూ సీనియర్ నాయకులు కేమిడి మల్లయ్య జెండాను ఎగరవేశారు. ఈ మహాసభలకు ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజు మాట్లాడుతూ స్వాతంత్ర్యానంతరం కార్మికులు పోరాడి సాధించుకున్న 29 చట్టాలను మోదీ ప్రభుత్వం రద్దు చేసి ,కార్మిక వ్యతిరేక నాలుగు కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. కార్మికులకు వ్యతిరేకమైన ఆ కోడ్‌లను రద్దు చేసే వరకు పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం కార్మిక వర్గ ప్రధాన సంఘమైన ఎఐటియుసిని అన్ని పట్టణాలు, గ్రామాలు, రంగాలకు విస్తరింపజేయాలని పిలుపునిచ్చారు. అన్ని జిల్లాల మహాసభల అనంతరం కరీంనగర్‌లో రాష్ట్ర మహాసభ జరుపుకోనున్నామన్నారు. అనంతరం ఆలిండియా మహాసభ నిర్వయించి భవిష్యత్తు కర్తవ్యాలు నిర్ణయించుకోనున్నట్లు వివరించారు. ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి బి వెంకటేశం మాట్లాడుతూ ఎఐటియుసి ట్రాన్స్‌పోర్టు రంగంతో పాటు ఆర్‌టిసి, సింగరేణి, భీమా ప్రభుత్వ రంగాల్లో బలమైన సంఘంగా ఏర్పడిందన్నారు. జనగామ జిల్లాలో హమాలీ, భవణ నిర్మాణ రంగాల్లో ఎఐటియుసి బలమైన సంఘంగా ఉందని, తమ హక్కుల సాధించుకోవడంతో కార్మికులు ముందుభాగంలో ఉన్నారన్నారు. ఈ మహాసభల అనంతరం ఒక ప్రత్యేక కార్యాచరణ చేపడతామని జిల్లా గౌరవాధ్యక్షులు సిహెచ్ రాజారెడ్డి తెలిపారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో ఎఐటియుసిని విస్తరింపజేస్తున్నామన్నారు.

**నూతన కమిటి ఎన్నిక**

మహాసభ అనంతరం నూతన కమిటి ఎన్నిక జరిగింది. గౌరవాధ్యక్షుడిగా సిహెచ్ రాజారెడ్డి, అధ్యక్షుడిగా మోటే శ్రీశైలం, ప్రధాన కార్యదర్శిగా ఆకుల శ్రీనివాస్, కోశాధికారిగా గూడెల్లి రాజు, ఉపాధ్యక్షులుగా రావుల సదానందం, వివిఎస్ఆర్ రెడ్డి, మరికుక్కల సాయిలు, ముల్కల లక్ష్మయ్య, గొలనుకొండ నాగరాజు, లింగాల రాములు, జిల్లా కార్యదర్శులుగా చామకూర యాకూబ్, ఏ శ్రీనివాస్, గాదరి శ్యామల, తోట సుశీల, గొడిశాల శ్రీనివాస్‌తో పాటు 27 మందితో నూతన కమటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## పీవీ ఆశయాలకు ప్రతీకగా 'పీవీవిజ్ఞాన కేంద్రం'

రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రజాపక్షం/భీమదేవరపల్లి : మాజీ ప్రధాని, భారతరత్న పివినరసింహారావు స్వగ్రామమైన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగరలో నిర్మాణంలో ఉన్న పీవీ విజ్ఞాన కేంద్రాన్ని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా విజ్ఞాన కేంద్ర ంలో కొనసాగుతున్న తుది దశ పనులను క్షుణ్ణంగా పరిశీలించిన మంత్రి, నిర్మాణ పనులు నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేసి త్వరలోనే ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంచాలని అధికారులకు సూచించారు. విజ్ఞాన కేంద్రంలోని ఫోటో గ్యాలరీ, సైన్స్ మ్యూజియం, అంపీథియేటర్, ఆడిటోరియం, ధ్యాన మందిరం తదితర విభాగాలను మంత్రి పరిశీలించారు. ముఖ్యంగా ఫోటో గ్యాలరీలో పీవీ నరసింహారావు జీవిత విశేషాలు, ఆయన రాజకీయ ప్రస్థానం, దేశానికి చేసిన సేవలను ప్రతిబింబించే చిత్రాలు, అరుదైన జ్ఞాపకాలు, చారిత్రక అంశాల ప్రదర్శనపై పివి కుటుంబ సభ్యులతో చర్చించి పలు విలువైన సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో పివి నరసింహారావు కుమారులు ప్రభాకర్ రావు, రాజేశ్వర్ రావు, భీమదేవరపల్లి మండల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## నిషేధిత ఉత్పత్తులపై సిసిఎస్ పోలీస్‌ల దాడులు

రూ.1,96,430 విలువైన గుట్కా, పొగాకు ఉత్పత్తులు స్వాధీనం



ప్రజాపక్షం/భూపాలపల్లి: భూపాలపల్లిలో నిషేధిత పొగాకు ఉత్పత్తులపై సిసిఎస్ పోలీసుల దాడి చేసి రూ.1,96,430 విలువైన గుట్కా, పొగాకు ఉత్పత్తులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పి సిరిశెట్టి సంకీర్త్, ఆదేశాలతో జిల్లాలో నిషేధిత పొగాకు ఉత్పత్తుల విక్రయాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోంది. ఈ క్రమంలో భాగంగా గురువారం సిసిఎస్ పోలీసులు భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని చాముండా జనరల్ స్టోర్స్, దుర్గా జనరల్ స్టోర్స్, పవన కృష్ణ కిరాణం దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.తనిఖీల్లో అంబర్, ఆర్ఆర్, అనార్, జేకే, మీరాజ్ తదితర ని షేధిత పొగాకు ఉత్పత్తులను అక్రమంగా నిల్వ ఉంచి విక్రయిస్తున్నట్లు గుర్తించి, మొత్తం రూ.1, 96,430 విలువైన పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకుని భూపాలపల్లి పోలీస్ స్టేషన్ లో అప్పగించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ, ప్రజారోగ్యానికి హానికరమై న నిషేధిత పొగాకు ఉత్పత్తులను నిల్వ చేయడం, విక్రయించడం లేదా రవాణా చేయడం వంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## కళ్యాణ లక్ష్మీ , షాదీముబారక్ చెక్కులు పంపిణీ



ప్రజాపక్షం/కేసముద్రం: కేసముద్రం మున్సిపల్ పరిధిలోని రైతువేదికలో గురువారం నిర్వహించిన కళ్యాణలక్ష్మీ , షాదీ ముబారక్ లబ్ధి దారులు 44 మందికి మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళీ నాయక్ రూ.44,05,104 విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలులో దళారులను నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు.మహిళా సాధికారతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని పేర్కొంటూ, ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి నేరుగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం గానీ, కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులను సంప్రదించాలని సూచించారు. అంతకుముందు ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే పిలుపుమేరకు కాంగ్రెస్ నిర్వహిస్తున్న దేశవ్యాప్త నిరసనలో భాగంగా కేసముద్రం అంబేద్కర్ కూడలిలో మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖడించారు. ఆయా కార్యక్రమాలలో మార్కెట్ చైర్మన్ గంట సంజీవ రెడ్డి, కేసముద్రం, ధన్నసరి సొసైటి వైస్ చైర్మన్‌లు అంబటి మహేందర్ రెడ్డి, అల్లం నాగేశ్వర రావు, మున్సిపల్ చైర్ పర్సన్ బానోత్ సునీత, సీనియర్ నాయకులు దస్రు నాయక్, నీలం దుర్గేష్, బండారు వెంకన్న, కదిర సురేందర్, చిలువేరు సమ్మయ్య గౌడ్, ఆర్టీఎ సభ్యులు రావుల మురళీ, వ్యవసాయ కమిటి డైరెక్టర్‌లు, వార్డు కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిడిఒ క్రాంతి, డిప్యూటి తహశీల్ధార్ రాగం ఎర్రయ్య, వ్యవసాయాధికారి వెంకన్న, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 5న హనుమకొండలో మహాసభలు

ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు
సారంగపాణి, జక్కు రాజు గౌడ్



ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : హనుమకొండ బాలసముద్రంలోని ఎఐటియుసి కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి అధ్యక్షతన కరపత్రాల ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హనుమకొండ జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ పాల్గొని మాట్లాడుతూ కార్మికులు పోరాడి త్యాగాలు చేసి సాధించుకున్న 44 చట్టాలతో 29 కార్మిక చట్టాలు ఒకరు 4 కోడ్లను మార్చి కార్మిక వర్గానికి నష్టం చేశారని అన్నారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కు రాజ్ గౌడ్ మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనము 26,000 అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎఐటియుసి హనుమకొండ జిల్లా రెండవ మహాసభలు ప్రెస్ క్లబ్ లో ఆగస్టు 5వ నిర్వహించడం జరుగుతుందని వేల్పుల సారంగపాణి అధ్యక్షులు తెలియజేశారు. ఈ మహాసభలకు అన్ని కార్మిక సంఘాలు , ఉద్యోగులు, ఎన్ హెచ్ ఎం ఆల్ క్యాడర్స్ ఉద్యోగులు, స్కీమ్ వర్కర్లు అంగన్వాడి, ఆశ, మిడ్ డే మిల్స్, హమాలి, గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ కార్మికులు తదితరులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా ఎఐటియుసి వర్కింగ్ ప్రెసిడెంట్ ధర్మల రామ్మూర్తి , సహాయ కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా , ఆటో యూనియన్ నాయకులు దుర్గాప్రసాద్, వ్యవసాయ నాయకులు కర్రే లక్ష్మణ్, సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్, ఇల్లందుల రాములు, మిడ్ డే మిల్స్ నుండి గడ్డం లక్ష్మి , కే.మల్లయ్య, రాసమల్ల దీన,ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మెట్రో నగరాలకు దీటుగా గూడూరు యూనియన్ బ్యాంక్ సేవలు



ప్రజాపక్షం/మహబూబాబాద్: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్‌లో వినియోగదారులకు మెరుగైన ఆధునిక బ్యాంకింగ్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు సిజిఎం రవింద్రబాబు తెలిపారు.గతంలో పరిమిత సదుపాయాలతో ఉన్న బ్యాంక్‌ను ఆధునీకీకరించి విశాలమైన ప్రాంగణంలో కస్టమర్లకు అన్ని రకాల బ్యాంకింగ్ సేవలు సులభంగా అందేలా తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు.వినియోగదారుల శ్రేయస్సే ప్రధాన లక్ష్యంగా యూనియన్ బ్యాంక్ పనిచేస్తోందని మెట్రో నగరాల్లో అందుబాటులో ఉన్న తరహాలో ఆధునిక బ్యాంకింగ్ సేవలను గూడూరు మండల కేంద్రంలోనే అందిస్తున్నామని రవింద్రబాబు తెలిపారు.ముఖ్యంగా రైతులు వ్యాపారులు ఉద్యోగులు చిరు వ్యాపారులు తమ అవసరాలకు అనుగుణంగా వివిధ రకాల రుణాలకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.గూడూరు మండల ప్రజలకు అవసరమైన అన్ని రకాల ఆర్థిక సేవలు ఒకే చోట అందించే విధంగా యూనియన్ బ్యాంక్‌ను ఫైనాన్షియల్ సూపర్ మార్కెట్ తరహాలో తీర్చిదిద్దామని ఆయన తెలిపారు. మెరుగైన సేవలు అందించేందుకు బ్యాంక్ సిబ్బంది ఎల్లప్పుడు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో డిజిఎం కమలాకర్ మేనేజర్ రవికుమార్ బ్యాంక్ సిబ్బంది బిసి మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

## అన్ని రంగాల్లో బిసిల వాటాకు బిసిలు అందరూ ఏకం

బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు



ప్రజాపక్షం/ వరంగల్: అన్ని పాలకవర్గ పార్టీల వలన దశాబ్దాల తరబడి మోసపోతూ విద్యకు ఉపాధి అవకాశాలకు దూరం అవుతున్న బిసిలు ఆ పార్టీలు విసురుతున్న ఉచితాల వలలో నుంచి బయటకు రావాలని తాటిపాముల వెంకట్రాములు అన్నారు. బిసి హక్కుల సాధన సమితి రాయపర్తి మండల కేంద్రములోని రైతు వేదికలో రావుల అనిల్ అధ్యక్షతన జరిగిన బిసి కులాల విస్తృత స్థాయి సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకట రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామిలు ప్రసంగించారు. బిసి హక్కుల సాధన సమావేశంలో గాన కోకిల ఎస్ జానకి మృతికి , రాజస్థాన్ లో 32 మంది అత్యాచారం వలన చనిపోయిన 13 ఏండ్ల మైనర్ అమ్మాయి ,నీట్ ప్రశ్నపత్రాల లీక్‌లకు వ్యతిరేకంగా ఢిల్లీలో పార్లమెంటు మార్చ్ లో పోలీసుల దాడిలో చనిపోయిన విద్యార్థిని మృతికి సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం వెంకటరాములు మాట్లాడుతూ వందల సంవత్సరాల నుండి అగ్రకుల రాజకీయాలకు బిసిలు బలవుతున్నారన్నారు. బిసిల చేత జెండాలు మోయించి, ఓట్లు వేయించుకొని,బిసిలకు ఉచితాలనిస్తూ, బిసిలు కడుతున్న పన్నులను అగ్రకుల పాలకవర్గ పార్టీలు ఎంజాయ్ చేస్తున్నారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వరు, ఆరోగ్యశ్రీ బకాయిలు ఇవ్వరు. పిల్లలకు ఉచితంగా చదువు చెప్పరు. అలాంటప్పుడు ఈ పాలక వర్గ పార్టీలు జెండాల కింద ఎందుకు ఉండాలన్నారు. ఎన్నికలకు ముందు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కామారెడ్డి బిసి డిక్లరేషన్ ద్వారా ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ గెలిచిన అనంతరం బిసిలకు స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని నానా రకాలుగా విన్యాసాలు చేసి చివరకు కేంద్ర ప్రభుత్వం మీద నెట్టివేసిందన్నారు. జిల్లా ప్రధానకార్యదర్శి చింతకింది కుమారస్వామి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం బడ్జెట్లో 20 వేల కోట్లు కేటాయిస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి ప్రతి బడ్జెట్లో 2000 కోట్ల కన్నా ఎక్కువ కేటాయించటం లేదన్నారు . ఇందులో నుంచి కూడా బిసిల సంక్షేమం కోసం కాకుండా ఉద్యోగుల జీతభత్యాలకు 600 కోట్లు మాత్రమే ఖర్చు చేసినట్టు చెప్పారు. రాబోయే రెండు సంవత్సరాలలో వరంగల్ జిల్లాలో బిసిలను సమీకరించి బిసిల హక్కుల సాధన కోసం బలమైన ఉద్యమాన్ని నిర్మించడానికి రాబోయే ఆగస్టు 23, 24 తేదీలలో నర్సంపేటలో జిల్లా మహాసభ నిర్వహించనున్నట్టు జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమార్ స్వామి అన్నారు. ఈ మహాసభకు ఇతర సామాజిక సంఘాల నుంచి సౌహార్ద ప్రతినిధులుగా ఆహ్వానించనున్నట్టు చెప్పారు.అన్ని గ్రామాల్లో బిసి కులాల ఐక్య తా కమిటీలు వేసి సభ్యత్వం చేర్పించి ఆగస్టు 9న రాయపర్తి మండల బిసి హక్కుల సాధన సమితి మండల మహాసభ నిర్వహణకు నిర్ణయం తీసుకొని, 23 మందితో ఏర్పడ్డ కమిటీకీ కన్వీనర్‌గా మచ్చ కుమారస్వామిని ఎన్నుకొన్నారన్నారు. ఈ మహాసభ విజయానికి బిసి ఉద్యోగులు వ్యాపారులు, ఆర్థిక సహకారాలు అందించాలన్నా రు. ఈ సమావేశంలో ఎఐటియుసి జిల్లా నాయకులు పనాస ప్రసాద్, గజవెల్లి అను ప్రసాద్ , గజవెల్లి బిక్షపతి, గజవెల్లి సోమన్న, పులి సోమన్న ,పెదగోని సంపత్ గౌడ్, గాదరి రాములు, మేరుగు రమేష్, మేరుగు రంజిత్, గాజుల యాకయ్య, ఎనగందుల శ్యాంసుందర్, ఎనగందుల సోమేశ్వర్, ఆవునూరి ఎల్లయ్య , రాం బాబు, సిహెచ్ వెంకటేశ్వర్లు, ఫణికర విజయ్ పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు జిల్లాలలో కలెక్టరేట్ ముట్టడి విజయవంతం అయింది. ధర్నాలో వేలాది మంది విద్యార్థులు పాల్గొని విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని నినదించారు.


నిజామాబాద్...


కరీంనగర్...


పెద్దపల్లి...


హనుమకొండ...

# ఎఐఎస్ఎఫ్ కలెక్టరేట్‌ల ముట్టడి విజయవంతం

**ప్రజాపక్షం/హనుమకొండ :** ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఎఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో గురువారం ఆర్ట్స్ కాలేజ్ ఆడిటోరియం నుంచి కలెక్టరేట్ వరకు విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించారు. ధర్నాలో పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిల సమస్య విద్యారంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టిందన్నారు. బకాయిల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్న ప్రైవేట్ ఇంజనీరింగ్, డిగ్రీ, జూనియర్ కళాశాలలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ఇప్పటికే వందలాది విద్యాసంస్థలు మూతపడగా, మరెన్నో మూతపడే పరిస్థితి ఏర్పడిందని, వేలాది మంది అధ్యాపకులు, ఉద్యోగుల ఉపాధి ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. డిగ్రీ కళాశాలల అసోసియేషన్ వ్యవస్థాపకులు, మాజీ చైర్మన్ సంఘం రెడ్డి సుందరాజు యాదవ్ కార్యక్రమానికి సంఘీభావ ప్రకటించారు. కార్యక్రమంలో డిగ్రీ కాలేజ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వేణుమాధవ్, బిసి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్, ఎఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా కార్యదర్శి భాషబోయిన సంతోష్, జిల్లా అధ్యక్షులు ఉట్కూరి ప్రణీత్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు జక్కుల భానుప్రసాద్, శ్రీపతి వినయ్, కొండ చరణ్, చిర సాయిచంద్, పెండ్యాల బన్ని, జిల్లా సమితి సభ్యులు కండకర్ల అజయ్, శ్రావణ్, అన్వేష్ రఘు, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

**నిజామాబాద్ :** సిఎం వద్ద విద్యాశాఖ ఉన్న ఉపయోగం లేకుండా పోయిందని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలంటూ డిమాండ్ చేస్తూ ఎఐఎస్ఎఫ్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో నిజామాబాద్‌లో చేపట్టిన విద్యార్థి పోరు కేక సభ దద్దరిల్లింది. వేలాది మంది విద్యార్థులతో రాజీవ్‌గాంధీ ఆడిటోరియం నుండి ధర్నాచౌక్ వరకు ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కసిరెడ్డి మణికంఠరెడ్డి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వ పాఠశాలల కుదింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని, ప్రైవేట్ విద్యా సంస్థల ఫీజులను నియంత్రించే చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బానోతు రఘురాం, నాయకులు సుధాకర్, సుభోద్, కైలాష్, అనూష, కుశాల్, కిషోర్, మహిపాల్, నీరజ్, భాను, పవన్, శివ, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

**వరంగల్ :** రాష్ట్ర సర్కారు పెండింగ్ ఫీజులు చెల్లింపులు చెయ్యకపోతే విద్యార్థుల చదువులు కొనసాగేదెలా అని ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్ఎ.స్టాలిన్ ప్రశ్నించారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఎఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఏకశిలా పార్కు నుంచి వరంగల్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దిడ్డి పార్థసారథి, ల్యాదళ్ల శరత్, నాయకులు మేకల అభిరామ్, జిలకర కార్తీక్, జి. సురేష్, ప్రశాంత్, రెండావుల రాజేష్, పెనుకుల మధు, వేముల శ్రీకాంత్, పెండ్యాల రాజు కుమార్, మహమ్మద్ యాసిన్, ముత్యాల కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

**ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వ విద్యార్థుల బోధన రుసుములు, ఉపకార వేతనాలను తక్షణమే మంజూరు చేయాలని ఎఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని కోరుతూ వందలాది మంది విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. ధర్నాలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్, నాయకులు షేక్ నాగులమీరా, బుర్రా మనోజ్, సాయి, పవన్, అభిరామ్, వరుణ్, నాగశేషు, గోపి, నరేందర్, సుకుమార్, వెంకటేష్, మహేశ్వరి, పావని, గీత, సరస్వతి, మౌనిక, రమ్య తదవితరులు పాల్గొన్నారు.

**భద్రాద్రి కొత్తగూడెం :** రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కే షాహిత్, వరక అజిత్ విమర్శించారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి విజయవంతమైంది. ధర్నాలో జిల్లా సహాయ కార్యదర్శులు ఇనపల్లి పవన్‌సాయి, గుండాల సుజన్, మాణిక్యాల వినయ్, గుగులోత్ వంశీ జిల్లా ఉపాధ్యక్షులు అక్కినపల్లి నాగేంద్రబాబు కొరిమి సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

**పెద్దపల్లి :** ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ కార్యాలయాన్ని వందలాది మంది విద్యార్థులతో ముట్టడించడం జరిగిందని ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రేణుకుంట్ల ప్రీతం, ఆర్నకొండ సాయి ఆజాద్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి గుండ్ల లక్ష్మీ ప్రసన్న, మహంకాళి శ్రీవర్ధన్, అనుప్ సాయి,అభిషేక్, చైత్ర, ఆదిత్య, మాహిన్, సాయి, అభిషేక్, గణేష్, గొడిసెల ప్రణీత్, సూర్యప్రకాష్, రాహుల్, రోహిత్, జశ్వంత్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

**మహబూబాబాద్ :** విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపుమేరకు మహబుబాబాద్ జిల్లాలో చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించారు. ధర్నాలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి, అధ్యక్షులు వెలుగు శ్రావణ్ కుమార్, మాగం లోకేష్, జిల్లా సహాయ కార్యదర్శి మేక వెంకటేష్, చిలువేరు వికాస్, బానోత్ సాయి, లోకేశ్వరి మనస్విత, ముఖేష్, రంజిత్, రాంబాబు, ఉదయ్, సంతోష్, సాయి, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

**భూపాలపల్లి :** విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోతుకు ప్రవీణ్, జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసప్, జిల్లా గర్ల్స్ కన్వీనర్ జడల రాజేశ్వరి, పోతుల పవన్, ఉల్లేరావు బన్నీ, రాజుల శివ, సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

**జగిత్యాల :** పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ధర్నాలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అక్రమ్ మాలిక్, జిల్లా నాయకులు ప్రణయ్ సాయి, వినీత్, రోహిత్, గని ఘఫ్ఫూర్, వాసిఫ్ సాయి, చందు వరుణ్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

**మేడ్చల్ మల్కాజిగిరి :** పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్సుమెంట్‌తో పాటు స్కాలర్‌షిప్‌ల బకాయిలు వెంటనే విడుదల చేయాలంటూ ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఎఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి ధర్నా నిర్వహించింది. ధర్నాలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రెహమాన్, జిల్లా ఉపాధ్యక్షులు హరీష్, నాయకులు మహేష్, అజీం, కృష్ణ, యాకూబ్, శ్రీకాంత్, చరణ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

**రంగారెడ్డి:** విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపుమేరకు రంగారెడ్డి జిల్లాలో "చలో కలెక్టరేట్" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పవన్ చౌహాన్ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో, రాష్ట్ర సమితి సభ్యులు బొంగు అరుణ్ కుమార్ గౌడ్, పత్లావత్ ఆకాష్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు భుక్యా వినోద్‌నాయక్, నాయకురాలు పార్వతి, జూనొతల భానుప్రకాష్, ఆందోజు నిఖిల్, వెంకట్ దుర్గాప్రసాద్, చందు, క్రిష్, అరవింద్, మధు, హర్షిత్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

**నల్లగొండ:** విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు భారీ ధర్నా నిర్వహించారు. ధర్నాలో జిల్లా ఉపాధ్యక్షుడు గాదెపాక సూర్యతేజ, జిల్లా సహాయ కార్యదర్శులు రమావత్ శోభన్‌బాబు, వట్టెపు శివ, గోపగోని, వినయ్, విష్ణు, కావ్య, శిరీష, భవ్య, మనీషా తదితరులు పాల్గొన్నారు.

**కరీంనగర్ :** విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపుమేరకు కరీంనగర్ జిల్లాలో చలో కలెక్టరేట్ కార్యక్రమంలో భాగంగా స్థానిక తెలంగాణ చౌక్ నుండి భారీ విద్యార్థి ప్రదర్శన నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. హలో విద్యార్థి.. చలో కలెక్టరేట్ అనే నినాదంతో విద్యార్థి హక్కుల సాధన కోసం నాయకులు, విద్యార్థులు కదలివచ్చి ప్రభుత్వ నిర్లక్ష్య తీరుకు వ్యతిరేకంగా నిరసనను వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లోకి వెళ్లే ప్రయత్నం చేయగా పోలీసుల అడ్డుకొని అరెస్టు చేశారు. ధర్నాలో ఎఐఎస్ఎఫ్ కరీంనగర్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, నునావత్ శ్రీనివాస్‌నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు కనకం సాగర్, జిల్లా కోశాధికారి లద్దునూరి విష్ణు, నగర ఉపాధ్యక్షుడు కసిరెడ్డి సందీప్ రెడ్డి, నగర సహాయ కార్యదర్శి బోయిన్ విష్ణువర్ధన్, రాజేష్, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

**సిద్దిపేట :** విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు శాంతియుత నిరసన చేపట్టారు. అనంతరం ఎఐ రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జేరిపోతుల జనార్ధన్, జిల్లా అధ్యక్షుడు సంగెం మధు, జిల్లా వర్కింగ్ ప్రెసిండెంట్ రామగళ్ల నరేష్, కార్యదర్శి ప్రసన్న కుమార్, కోశాధికారి ఆకుల శిరిషం చట్ల సమ్మయ్య, యాసిన్, గిరుక అభినయ్, ప్రశాంత్, బత్తుల రఘు, సుమన్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

**మెదక్ :** విద్యారంగంలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి దినకర్ ఆధ్వర్యంలో విద్యార్థులు జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని గురువారం ముట్టడించారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పాపయ్య గణేష్, దినేష్, నందకుమార్, చరణ్, అనిల్, కళ్యాణ్‌రామ్, అరుణ్‌కుమార్ తదితర నాయకులు పాల్గొన్నారు.

**రాజన్న సిరిసిల్ల :** స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణం విడుదల చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులె కుర్ర రాకేష్, మంద అనిల్ కుమార్, జిల్లా గర్ల్స్ కన్వీనర్ బర్రెంకల శ్రీహారిక, ఉపాధ్యక్షురాలు బోధసి ప్రవళిక, నాయకులు ఆంజనేయులు, ముదసర్ షరీఫ్, రెహాన్, ఆయన్, వైభవ్, మనీష్, గౌతమి, మౌనిక తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

**హైదరాబాద్ సిటీ:** పెండింగ్ ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు తక్షణం విడుదల చేయాలని, రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని నియమించాలని... నాణ్యమైన విద్యను అందించాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా ఎఐఎస్ఎఫ్ హైదరాబాద్ కౌన్సిల్ ఆధ్వర్యంలో లకిడికపూల్‌లో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాలో ఎఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి మట్టల చైతన్య యాదవ్, అధ్యక్షుడు అనిల్, ఉస్మానియా యూనివర్సిటీ అధ్యక్షుడు ఉప్పల ఉదయ్ కుమార్ వంశి, జిల్లా ఉపాధ్యక్షులు అరుణ్ కుమార్, భాను, దాట్ల సుమన్, హాసిని, కల్పన, ఫాతిమా నందిని, సుష్మ తదితరులు పాల్గొన్నారు.


భద్రాచలం...


జగిత్యాల...


భూపాలపల్లి...


ఖమ్మం...



మహబూబాబాద్...


నల్లగొండ......


హైదరాబాద్...


రంగారెడ్డి...


వరంగల్...


మెదక్...


సిద్దిపేట...


సిరిసిల్ల...


మేడ్చల్...

(మొదటి పేజీ తరువాయి)

బొమ్మగాని ప్రభాకర్, పాలమాకుల జంగయ్య, దండి సురేష్, అందొజు రవీంద్ర చారి, మంద పవన్, తాండ్ర సదానందం, కలకొండ కాంతయ్య, ఆర్.అంజయ్య నాయక్, కర్రే బిక్షపతి, ఎస్.బాలరాజు, జ్యోతి నాయకత్వం వహించారు.

## సిపిఐ నిరసన ప్రదర్శన

### కేంద్రం అరాచకాలకు కోర్టులు సమాధానం చెప్పాలి : కూనంనేని

ప్రదర్శకులను ఉద్దేశించి కూనంనేని సాంబశివ రావు మాట్లాడుతూ నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ ఢిల్లీలో ఉద్యమాలు చేస్తున్న విద్యార్థి, యువజనులను గొడ్డులను బాదినట్టుగా నడిరోడ్ల మీద కింద పడేసి తొక్కుతూ, మహిళా విద్యార్థునులపై లాఠీ చార్జ్ చేయడం కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమన్నారు. ఢిల్లీ ఘటనలపై తక్షణ విచారణ చేయాలని ఒకరు ఢిల్లీ హైకోర్టుకి వెళ్తే విచారణ చేయకపోగా, మరొకరు సుప్రీంకోర్టుకి వెళ్తే "ఇటువంటి వాటితో మా సమయం వృధా చేయొద్దు, మీ సమయం కూడా వృధా చేసుకోవద్దు. ఇది మాకు సంబంధం లేని అంశం" అని పేర్కొనడం విచారకరమన్నారు. ఢిల్లీలో జరుగుతున్న ఇలాంటి ఘటనలపై ఖచ్చితంగా సుప్రీం కోర్టు, హైకోర్టులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. పదవులు పట్టుకుని వేలాడుతున్న కేంద్ర విద్యాశాఖ మంత్రి, ప్రధానమంత్రి బొద్దింకలా? లేక నీట్ పేపర్ లీకేజీలపై ఉద్యమిస్తున్న యువత బొద్దింకలా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. యువతకు రాజకీయాలు తెలియవని, వారి సమస్య పరిష్కారం ఒకటే వారికి ప్రధానమని, అలాంటి వారితో ఘర్షణ పెట్టుకుంటున్న కేంద్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం ఖచ్చితంగా చెప్తారని అన్నారు.

### విద్యా రంగాన్ని గుప్పిట్లో పెట్టుకోవడానికే కేంద్రం నీట్ నిర్వహిస్తోంది : పల్లా వెంకట్‌రెడ్డి

పల్లా వెంకట రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమైనప్పటి నుండి ప్రతిరోజు నీట్ లీకేజీపై చాలా తీవ్రంగా చర్చ జరుగుతుందని, జంతర్‌మంతర్ వద్ద విద్యార్థులు పెద్ద ఎత్తున లీకేజీ బాధ్యులపై చర్యలు చేపట్టాలని ఉద్యమిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. కొంతమందికి అనుకూలంగా వ్యవహరించడం కోసమే నీట్ పేపర్ లీక్ అవుతుందనేది యదార్థమన్నారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ గతంలో విద్యార్థి నాయకుడిగా ఉన్నప్పుడు కూడా ఇలాగే పేపర్ లీక్ అయితే పెద్ద ఉద్యమం నిర్వహించారని గుర్తు చేశారు. విద్యార్థులు డిమాండ్ చేశారనే కాకుండా ఒకనాడు తాను ఉద్యమం చేసినందుకు, ప్రస్తుతం తాను బాధ్యత వహిస్తున్న విద్యాశాఖలో రెండు పర్యాయాలు ప్రశ్నాపత్రం లీక్ అయినందుకు తాను బాధ్యుడినని ధర్మేంద్ర ప్రధాన చెప్పుకుంటే ఆయన గౌరవం పెరిగేదని పేర్కొన్నారు. విద్యా రంగాన్ని వారి గుప్పిట్లో పెట్టుకోవడానికే కేంద్ర ప్రభుత్వం నీట్ పరీక్షలు దేశవ్యాప్తంగా నిర్వహిస్తుందని, ఆ పరీక్షలను రాష్ట్రాలకు అప్పగిస్తే ఇలాంటి పరిస్థితి ఉండేదికాదన్నారు. ప్రస్తుతం కాక్రోచ్ పార్టీ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఉద్యమం ఒక్క ఢిల్లీకే పరిమితం కాకుండా, దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్నారన్నారు. విద్యార్థులు కేంద్ర ప్రభుత్వంపై నిరసన వ్యక్తం చేస్తుంటే పోలీసులు వారిపై లాఠీచార్జ్ చేయడం, ఇంటర్నెట్, మెట్రో రైళ్లను నిలిపివేసినా వేలాదిమంది విద్యార్థులు, యువత జంతర్ మంతర్ దగ్గరికి వచ్చి ఉద్యమాలు నిర్వహిస్తున్నారని, వారి డిమాండ్లు నెరవేరే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తారన్నారు. గతంలో రైతు ఉద్యమం ఎలా కొనసాగిందో అంతకంటే రెండింతలు రెట్టింపుగా నేడు విద్యార్థుల ఉద్యమం ఢిల్లీలో జరుగుతున్నన్నారు. ప్రధాన మంత్రి వెంటనే విద్యాశాఖ మంత్రిని పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రశ్నాపత్రం లీకేజీ సమస్యపై 24 రోజుల నుంచి సోనం వాంగ్ చుక్ నిరాహార దీక్ష చేస్తున్నారని, ఆయన ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని వెంకట్ రెడ్డి అన్నారు.

### విద్యార్థుల ఆందోళనను రాజకీయ కోణంలో చూపించే ప్రయత్నాలు తగదు : డాక్టర్ నారాయణ

కె. నారాయణ మాట్లాడుతూ ఢిల్లీలో జరుగుతున్న ఉద్యమానికి ప్రధాన విలన్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అని ఆరోపించారు. విద్యార్థుల ఆందోళనను రాజకీయ కోణంలో చూపించే ప్రయత్నాలను నారాయణ ఖండించారు. ఈ ఉద్యమం ఏ ఒక్క పార్టీది కాదని, విద్యా వ్యవస్థను కాపాడాలనే యువత ఆకాంక్షల నుంచి పుట్టిన ప్రజా ఉద్యమమని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్, వామపక్షాలు సహా పలు రాజకీయ పార్టీలు తమ హద్దుల్లో ఉద్యమానికి మద్దతు తెలుపుతున్నాయన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి నైతిక బాధ్యత వహించి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేయాలని, లేనట్లయితే దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసే విధానాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న వారిలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు బి.స్టాలిన్, విజయలక్ష్మి పండిట్, ముత్యాల యాదిరెడ్డి, ఎం.అనిల్, కె.ధర్మేంద్ర, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com